అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 29-11-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

జై తెలంగాణ!
జై జై తెలంగాణ!

సంపుటి : 9 సంచిక : 328

Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar

10 పేజీలు + టాబ్లాయిడ్ 16 పేజీలు వెల : 6.50

దీక్షా దివస్
29TH నవంబర్ 2009

తెలంగాణ విజయాన్ని నిర్దేశించిన రోజు.

రుధిరం లో రుధిరమై
ప్రాణం లో వాయువై
జన హృదయ స్పందనై
అశక్తులకు ఆసరాగా
అసహాయుల గుండె గొంతుకగా
తమస్సు నుంచి ఉషస్సుకు
తెలంగాణ జాతిని నడిపిస్తున్న దినకరుడై..
జీవితాల్లో వెలుగులు నింపే శుభకరుడై..

తెలంగాణ అస్థిత్వానికి
అస్మితకు
ఆకాంక్షలకు ప్రతిరూపం కేసీఆర్
యావత్ తెలంగాణ ఏకాత్మ కేసీఆర్



ఆయన గుండెల నిండా
తెలంగాణ
ఆయన గుండె చప్పుడు
తెలంగాణ

జై తెలంగాణ!
జై జై తెలంగాణ!

పని గంటలు పెంచితే... మహిళలపై అధిక ఒత్తిడి



న్యూఢిల్లీ : దేశంలోని యువతరం వారానికి కనీసం 70 గంటల పాటు పనిచేయాలంటూ ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు డాక్టర్ నారాయణ మూర్తి వ్యాఖ్యానించినప్పటి నుండి దేశంలో దీనిపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. భారతీయ కార్మికులకు క్రమశిక్షణ లేదని, కొరడా ఝుళిపిస్తేనే వారు పని చేస్తారని ప్రముఖులు తరచూ చెబుతుంటారు. నారాయణ మూర్తి మాటలు వారికి సంతోషం కలిగించి ఉంటాయి. ప్రపంచ యుద్ధాల తర్వాత యూరప్‌లో కార్మికులు ఎక్కువ గంటలు పని చేయడం వల్లనే కోల్పోయిన సంపదను తిరిగి సొంతం చేసుకోగలిగిందని నారాయణ మూర్తి చెప్పుకొచ్చారు. చైనా వంటి అంతర్జాతీయ ఉత్పత్తి కేంద్రాలతో పోటీ పడాలంటే యువ కార్మికులు శ్రమ పడాలని, ఎక్కువ గంటలు పని చేయాలని ఆయన ఉద్బోధించారు.

అధిక ఉత్పత్తికి, ఎక్కువ పని గంటలకు లంకె పెట్టడం చాలా సులభం. పారిశ్రామిక ఉత్పత్తి ద్వారా జాతి నిర్మాణం జరగాలంటే కార్మికులు ఎక్కువ గంటలు పని చేయాలని చెబుతుంటారు. అయితే పురుషులతో పోలిస్తే మహిళలు అలా అధిక సమయం పని చేయడం చాలా కష్టం. వారి వేతనాలు కూడా తక్కువగా ఉంటాయి. ఫ్యాక్టరీలలో, పారిశ్రామిక ఉద్యోగాలలో పని చేసే మహిళలు ఎంతగా శ్రమ పడినప్పటికీ ఓ మహిళగా వారి పని అనుభవాన్ని గురించి ఎవరూ సంప్రదించరు.

ఫ్యాక్టరీల చట్టం ఏం చెబుతోంది?

1948వ సంవత్సరపు ఫ్యాక్టరీల చట్టం ప్రకారం వయోజన కార్మికులు వారానికి 48 గంటల కంటే ఎక్కువ సమయం పని చేయలేరు. ఒకవేళ అదనపు వేతనం ఇచ్చినప్పటికీ తొమ్మిది గంటలు మాత్రమే పని చేస్తారు. రాత్రి 7-8 గంటలు, 9.30-10.00 గంటల మధ్య మహిళలు పని చేయడాన్ని ఈ చట్టం నిషేధించింది. కార్మికులు పదిన్నర గంటలకు మించి పని చేయరాదని ఇది నిర్దేశించింది. భోజన విరామ సమయం కూడా ఇందులో కలిసి ఉంది. ఈ చట్టానికి కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలు ఇప్పటికే సవరణలు చేశాయి. ఫ్యాక్టరీ కార్మికుల పని గంటలను 12కు పెంచాయి. వాస్తవానికి వారు అంతకంటే అధిక సమయమే పని చేస్తున్నారు. వారానికి 47.7 గంటలు పని చేసే కార్మికులు ఉన్న దేశాల జాబితాలో భారత్ ఏడవ స్థానంలో ఉన్నదని అంతర్జాతీయ కార్మిక సంస్థ తాజా నివేదికలో తెలిపింది.

మహిళల పరిస్థితి దయనీయం

భారతీయ కార్మికుల్లో విద్యావంతులు తక్కువే. వారికి ఆరోగ్య సౌకర్యాలు కూడా అరకొరగానే అందుతాయి. వారికి ఫ్యాక్టరీలలో అందించే మౌలిక సదుపాయాలు నాసిరకంగా ఉంటాయి. పరికరాలను కూడా సరిగా ఇవ్వరు. ఇలాంటి ప్రతికూల వాతావరణంలో వారు ఎక్కువ గంటలు ఎలా పనిచేయగలరు? ముఖ్యంగా మహిళా కార్మికుల పరిస్థితి ఏమిటి? ఓ నివేదిక ప్రకారం మహిళల కంటే పురుషుల జీతాలు 1.2-1.3 రెట్లు అధికంగా ఉన్నాయి. ఇంటి పనికి సంబంధించి పురుషుల కంటే మహిళలు రెట్టింపు సమయం వెచ్చిస్తారు. ఇంత చేసినా పురుషులతో పోలిస్తే వారికి తీరుబడి దొరికే సమయం 24% తక్కువగా ఉంటుంది. మహిళల కోసం ప్రభుత్వాలు వందలాది పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నప్పటికీ పరిస్థితిలో పెద్దగా మార్పు రావడం లేదు. అటు కార్పొరేట్ సంస్థలు కూడా మహిళా సాధికారత కోసం సామాజిక బాధ్యతా బడ్జెట్లు సమీకరించడం లేదు. అధిక పని గంటల కారణంగా మహిళా కార్మికులపై ఒత్తిడి పెరుగుతుంది.

దీంతో వారు పనులకు సస్తి చెప్పే ప్రమాదం కూడా ఉంది. ప్రపంచంలో ఎక్కువ పని చేసేది మహిళలే. ఇందులో ఎలాంటి సందేహం లేదు. మరి అలాంటి వారిపై పని ఒత్తిడి పెంచడం భావ్యమా?

పిల్లల్లో మత విద్వేషాలు నాటుతున్న బీజేపీ..

జ్యోతిరావు పూలే వర్ధంతి సభలో ఎస్ వినయ్‌కుమార్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మోడీ ప్రభుత్వం పాఠశాల పిల్లల్లో సైతం మత విద్వేషాలు నింపేందుకు ప్రయత్నిస్తున్నదని సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్ వినయ్‌కుమార్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా టీపీఎస్‌కే అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జ్యోతిరావు పూలే 133వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ పిల్లలకు చరిత్ర పాఠాలకు బదులు సనాతన ధర్మాన్ని నూరి పోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాపం, పుణ్యం, స్వర్గం, నరకం లాంటి కర్మ సిద్ధాంతాన్ని పాఠ్యాంశాలుగా బోధిస్తున్నారని తెలిపారు. శాస్త్రీయ విద్యా విధానం ఉండాలన్న రచయితలపైనా, సనాతన ధర్మాన్ని విమర్శించిన కవుల పైనా దాడులు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య, వైద్యం ప్రభుత్వ రంగంలోనే ఉండాలని పూలే సూచించారని తెలిపారు. తెలంగాణ సాహితీ రాష్ట్ర కార్యదర్శి కె.ఆనందాచారి మాట్లాడుతూ.. 'పై వాళ్ళు అంతే'.. అనే మహాత్మా జ్యోతిరావు పూలే కవితను చదివి వినిపించారు. పూలే దంపతులు పిడికిళ్ళు బిగించకుండానే ప్రజల్ని తిరగబడే విధంగా చేశారనీ, మూగ గొంతులకు మాటలను అందించారని గుర్తుచేశారు. 150 ఏండ్ల క్రితమే పూలే శాస్త్రీయ విద్యా విధానం ఆవశ్యకతను గుర్తించారని తెలిపారు. ఈ సందర్భంగా భూపతి వెంకటేశ్వర్లు తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం తొమ్మిదేండ్ల కృషిని నివేదిక రూపంలో వివరించారు.

కార్యక్రమంలో కవి రచయిత నోరి రఘురామ మూర్తి, పిఎస్ మూర్తి, బాలోత్సవ కమిటీ నాయకులు బుచ్చిరెడ్డి, ఎన్ సోమయ్య, సుజావతి, శాంతారావు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మరో మూడు వారాల వ్యవధి ఇవ్వండి

- జ్ఞానవాపీ మసీదు కేసు
- సైంటిఫిక్ సర్వే నివేదిక సమర్పణపై ఎఎస్ఐ విజ్ఞప్తి

వారణాసి : జ్ఞానవాపీ మసీదు సముదాయానికి సంబంధించిన సైంటిఫిక్ సర్వే నివేదికను సమర్పించడానికి మరో మూడు వారాల వ్యవధి కావాలని ఆర్కియాలజికల్ సర్వే ఇండియా (ఎఎస్ఐ) కోరింది. జ్ఞానవాపీ మసీదు కేసు వివాదాన్ని వారణాసి జిల్లా కోర్టు విచారణ చేస్తున్న విషయం తెలిసిందే. నవంబర్ 28లోగా సైంటిఫిక్ సర్వే నివేదికను సమర్పించాలని గత విచారణలో ఎఎస్ఐను కోర్టు ఆదేశించింది. అయితే పురావస్తు శాస్త్రవేత్తలు, సర్వేయర్లు, ఇతర నిపుణులు సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించడానికి మరింత సమయం కావాలని మంగళవారం విచారణలో ఎఎస్ఐ కోరింది. దీంతో విచారణను కోర్టు ఈ నెల 29కి అంటే బుధవారానికి కోర్టు వాయిదా వేసింది. కోర్టు ఆదేశాల మేరకు ఆగస్టు 4 నుంచి జ్ఞానవాపీ మసీదు ప్రాంగణంలో ఎఎస్ఐ సర్వే నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

నేడు ఘనంగా దీక్షా దివస్

ఏర్పాట్లు పూర్తి చేసిన బీఆర్ఎస్

- ప్రతి గ్రామంలోనూ నిర్వహించేందుకు సమాయత్తం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ సాధన కోసం బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ 2009 నవంబర్ 29న చేపట్టిన నిరాహార దీక్షను పురస్కరించుకుని నేడు రాష్ట్ర వ్యాప్తంగా ఆ పార్టీ ఆధ్వర్యంలో దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను ఆ పార్టీ ఇప్పటికే పూర్తి చేసింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ఉద్యమ ప్రస్తావాన్ని, పోరాట ఘట్టాలను ప్రజలకు వివరించాలని ఆ పార్టీ సంకల్పించింది. ప్రతి గ్రామంలోనూ దీక్షా దివస్‌ను పురస్కరించుకుని పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలను చేయాలని ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పిలుపునిచ్చిన విషయం విదితమే. ప్రతి గ్రామంలోనూ సేవాకార్యక్రమాలతో పాటు ఉద్యమ ఘట్టాన్ని వివరించి ప్రజలను చైతన్యపర్చాలని బీఆర్ఎస్ అధిష్టానం పిలుపునిచ్చింది. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ 2009 నవంబర్ 29న చేపట్టిన నిరహారదీక్ష తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిన విషయం విదితమే. ప్రజల్లో ఉద్యమ ఆకాంక్షను మరింత రగిల్చి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భావానికి అది కారణమైంది. అప్పటినుంచి ప్రతీ ఏటా నవంబర్ 29న దీక్షా దివాస్‌ను నిర్వహిస్తున్నారు. ఈ సారి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కు ఒకరోజు ముందు రావడంతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రజల మనస్సును గెలించేందుకు ఆ పార్టీ వివిధ కార్యక్రమాలను చేపట్టనున్నది.

పోస్టల్ బ్యాలెట్‌లో అక్రమాలు

- మధ్యప్రదేశ్ సిఇఒకు కాంగ్రెస్ ఫిర్యాదు
- తిరస్కరించిన అధికారులు

భోపాల్ : మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో పోస్టల్ బ్యాలెట్‌లో అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అనుపమ్ రాజన్‌కు కాంగ్రెస్ నాయకులు మెమోరాండం సమర్పించారు. స్ట్రాంగ్‌రూమ్ నుంచి పోస్టల్ బ్యాలెట్లను బయటికి తీసి బాలాఘాట్ కలెక్టర్ గిరీష్ చంద్ర మిశ్రా, ఇతర అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని, వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు.అయితే కాంగ్రెస్ ఆరోపణలను ఎన్నికల అధికారులు, కలెక్టరేట్ అధికారులు తీవ్రంగా ఖండించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పోస్టల్ బ్యాలెట్ పత్రాలను ప్రతీ రోజు మధ్యాహ్నం 3 గంటలకు తెరిచి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా జాగ్రత్తగా కట్టలుగా ఉంచుతామని తెలిపారు. ఈ ప్రక్రియను అన్ని పార్టీల అధికార పోలింగ్ ఏజెంట్ల సమక్షంలోనే చేస్తామని చెప్పారు.

అయితే ఈ ప్రక్రియను ఎవరో వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో గందరగోళం ఏర్పడిందని అధికారులు వెల్లడించారు. మరోవైపు.. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న డివిజనల్ కమిషనర్ ఈ ప్రక్రియను నిర్వహించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు నోడల్ అధికారి హిమ్మత్ సింగ్‌ను సస్పెండ్ చేశారు. మధ్యప్రదేశ్‌లో ఈ నెల 17న అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. డిసెంబర్ 3న ఫలితాలు వెల్లడించనున్నారు.

బ్లాక్‌మెయిల్ రాజకీయాలు గట్టెక్కించేనా?

- ఓటేయకపోతే కుటుంబంతో సహా చస్తానన్న కౌశిక్ రెడ్డి
- కల్వకుర్తిలో కనికరించాలంటూ బీజేపీ నేత ఆచారి కన్నీళ్లు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎన్నికల ప్రచారంలో బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారు. ఒకవైపు మద్యం, డబ్బు పారిస్తునే...మరోవైపు ఓటర్లను బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. ఓట్లేసి గెలిపిస్తే చెప్పినవి చెప్పినట్టు చేసి చూపిస్తామంటూ ఒకరిద్దరూ రాతపూర్వకంగా ఇస్తున్నారు. తమకు ఓటు వేయాలంటూ ఓటర్ల భావోద్వేగాలతో ఆడుకుంటున్నారు. తాము ఓడిపోతున్నామన్న భయం లేదా ఆందోళనతో ఓటర్ల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని వారిని తమవైపు తిప్పుకునేందుకు కుట్రలు చేస్తున్నారు. అందులో మొదటి వరసలో హుజురాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి ఉన్నారు. తనకు ఓటేయకపోతే తన భార్యాపిల్లలతో చనిపోతామంటూ బహిరంగ వేదిక సాక్షిగా వ్యాఖ్యానించారు.తాను గెలిస్తే జైత్రయాత్ర, ఓడిస్తే శవయాత్ర చేయాలంటూ చెప్పుకొచ్చారు. పాడి కౌశిక్‌రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమవుతున్నాయి. ఇది ఓటర్లు, ముఖ్యంగా యువతను ఆత్మహత్యలకు ప్రేరేపించేలా ఉన్నాయనే చర్చ జరుగుతున్నది. దీంతోపాటు ఓటర్లను ఆయన బహిరంగంగా బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రజలను ప్రభావితం చేసే రాజకీయ నాయకులు ఇలా మాట్లాడటం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమనే చర్చ కొనసాగుతున్నది. ఇప్పటికే ఆయనపై కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన బీజేపీ అభ్యర్థి ఆచారి కూడా ఓటర్ల మనోభావాలను బ్లాక్ మెయిల్ చేస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. బీజేపీ తరుపున ఆయన ఆరుసార్లు పోటీ చేసిన ఆయన స్వల్ప మెజార్టీతో ఓడిపోతున్నారు. ఆచారి ఇక్కడి నుంచి మరోసారి బరిలో దిగారు. అయితే తన ప్రచార వ్యూహాన్ని మార్చారు. వారిని ప్రలోభాలకు గురి చేస్తూనే...ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు తన హావభావాలతో బ్లాక్ మెయిల్ చేస్తున్నారని తెలిసింది. 'నాపై ఎందుకు కక్ష కట్టారు. నేను ఒక పేద కుటుంబం నుంచి వచ్చాను. నాకు ఆస్తిపాస్తులు లేవు. చాలా సార్లు ఓడిపోయాను. ఈసారి ఎలాగైనా గెలిపించాలి' అంటూ సెంటిమెంటు రగిలిస్తున్నారు. ప్రతి కార్నర్ మీటింగ్‌లో ఉపన్యాసం ఇస్తూనే ఓటు వేయాలంటూ కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఆచారి ఏడవడాన్ని బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులను తప్పుపడుతున్నారు. ఐదేండ్లు ప్రజలకు అందుబాటులో ఉండకుండా ఎన్నికల సమయంలో వచ్చి సెంటిమెంటును రెచ్చగొడితే ఓట్లు పడవని వారు తన ఉపన్యాసాల్లో చెబుతున్నారు. పదేండ్లుగా కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా... కల్వకుర్తికి ఆయన రూపాయి కూడా తీసుకరాలేదనే విమర్శలు చేస్తున్నారు. ఆచారి బీసీ కమిషన్ సభ్యుడిగా ఉండటం, ఆ పార్టీకి ఎమ్మెల్సీ ఉండటం అయినా వారు పైస పని చేయడం లేదనే విమర్శలున్నాయి. భూపాలపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గండ్ర సత్యనారాయణ కూడా ఇచ్చిన హామీలు నెరవేరుస్తానని నమ్మకం కలిగించేందుకు ప్రమాణపత్రాలను పంపిణీ చేస్తున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే గండ్ర వెంకట్రామణారెడ్డి మాటలే పరిమితమవుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రమాణపత్రం కలిసొస్తుందో, లేదో వేచి చూడాల్సిందే. జగిత్యాల కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలపై బాండ్ పేపర్లు విడుదల చేశారు.ధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని అమలు చేస్తామని పేర్కొన్నారు.

ఈ రకంగా అభ్యర్థులు తమ విధానాలను చెప్పకుండా ఓటర్లను రకరకాల ప్రలోభాలకు గురి చేయడం పరిపాటిగా మారింది.

'అగ్నివీర్'గా ట్రైనింగ్ తీసుకుంటున్న యువతి ఆత్మహత్య

ముంబయి : అగ్నివీర్‌గా శిక్షణ తీసుకుంటున్న ఓ యువతి హాస్టల్ రూమ్‌లో ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు సమాచారాన్ని పోలీసులు మంగళవారం తెలిపారు. ఆత్మహత్యకు పాల్పడిన యువతి కేరళకు చెందిన అమ్మాయి. ఈమె అగ్నిపథ్ స్కీమ్ కింద అగ్నివీర్‌గా నేవీలో శిక్షణ తీసుకునేందుకు రెండువారాల క్రితం ముంబయి చేరుకుందని పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం ఆమె తన బాయ్‌ఫ్రెండ్‌ని కలిసిందని, వారిద్దరూ గొడవపడ్డారని, ఆ తర్వాత అతను చనిపోతానని ఆమెను బెదిరించినట్టు పోలీసులు తెలిపారు. మరి ఏమైందో ఏమో కానీ.. ఆ యువతి బలవన్మరణానికి పాల్పడింది. మలాడ్ వెస్ట్‌లోని ఐఎన్ఎస్ హమ్లా బేస్‌లోని తాను ఉంటున్న హాస్టల్‌లో రూమ్‌లో తన మృతదేహం లభ్యమైందని పోలీసులు పేర్కొన్నారు.

PITTI ENGINEERING LIMITED
Regd. Office: 6-3-648/401, IV Floor, Padmaja Landmark, Somajiguda, Hyderabad-500082, Website: www.pitti.in, Ph: 040-23312774, Email : shares@pitti.in, CIN: L29253TG1983PLC004141

షేర్ సర్టిఫికెట్లు పోయినవని తెలియజేయు ప్రకటన

కంపెనీ యొక్క దిగువ షేర్‌సర్టిఫికేట్లు పోయినవిగా /తప్పిపోయినవిగా రిపోర్టు చేయబడినది మరియు సదరు షేర్ సర్టిఫికేట్ల యొక్క హోల్డర్లు వాటి డూప్లికేట్ షేర్ సర్టిఫికేట్ల జారీకి కంపెనీని అభ్యర్థించారు. ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 15 రోజుల్లోపు కంపెనీకి చెల్లుబాటగు అభ్యంతరం అందనియెడల, దిగువ పేర్కొన్న వ్యక్తికి ధృవీకరణ లేఖను జారీచేయడానికి కంపెనీ ముందుసాగును. వాటి ధృవీకరణ లేఖ జారీ తరువాత ఒరిజినల్ షేర్ సర్టిఫికేట్స్‌కు సంబంధించి కంపెనీ ద్వారా ఏలాంటి క్లెయింలు అనుమతించబడవు.

షేర్‌హోల్డర్ పేరు	ఫోలియో నెం.	సర్టిఫికేట్ నెం.	వరుస సంఖ్యలు	వాటాల సంఖ్య
రామ్ దులారి గుప్తా (మరణించారు) సారిక గుప్తా	00103248	101036	209001-209200	200
శ్రీనివాస్ రెడ్డి మెతుకుపల్లి (మరణించారు) సుమ రెడ్డి మెతుకుపల్లి	00101124	101124	226601-226800	200

సదరు సర్టిఫికేట్లకు సంబంధించి క్లెయిం/లు కలిగియున్న ఎవరైనా వ్యక్తి, రిజిస్టర్డు ఆఫీస్ వద్ద కంపెనీకి అన్ని మద్దతు పత్రాలతో అతని/ఆమె/వారి క్లెయింను దాఖలు చేయాలి. ఈ నోటీసు ప్రచురణ నుండి 15 రోజుల్లోపు చెల్లుబాటయ్యే మరియు చట్టబద్ధమైన క్లెయిం స్వీకరించనియెడల, పైన జాబితాలోని వ్యక్తికి అన్ని అవసరమైన ఫార్మాలిటీస్‌ను పూర్తిచేసిన తరువాత పోయిన షేర్ సర్టిఫికేట్‌కు బదులుగా ధృవీకరణ లేఖ జారీకి కంపెనీ ముందుకుసాగును మరియు ఏ ఇతర వ్యక్తి నుండి ఏలాంటి తదుపరి క్లెయింలు స్వీకరించబడవు.

For Pitti Engineering Limited
సం/-
మేరీ మోనికా బ్రాగంజా
కంపెనీ సెక్రటరీ & కంప్లియన్స్ ఆఫీసర్ (ఎఫ్‌సిఎస్: 5532)
ప్రదేశం: హైదరాబాద్
తేది: 28 నవంబర్, 2023

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
SHRIRAM Finance
రిజిస్టర్డు ఆఫీసు: శ్రీ టవర్స్, ప్లాట్ నం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032.
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసు: 6వ అంతస్తు (లెవెల్ 2), బిల్డింగ్ నెం.ఈ/2, అరుం క్యాంపస్, జెడ్4/1, టిటిసి, థానే బేలాపూర్ రోడ్, ఘన్సోలి, నవి ముంబయి-400710.

స్వాధీనతా ప్రకటన

[illegible]

ప్రదేశం: మియాపూర్
తేది: 25-11-2023
సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

Bank of Baroda
బ్యాంక్ ఆఫ్ బరోడా, తిలక్‌నగర్ బ్రాంచ్:
డోర్ నెం.2-2-1118/3/బి-11, తిలక్‌నగర్ 'x' రోడ్, హైదరాబాద్, PIN: 500044. Phone: 040-23465138, 23465125.

బంగారు ఆభరణాల బహిరంగ వేలం ప్రకటన

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా దిగువ ఓవర్‌డ్యూ/ ఎన్‌పిఏ గోల్డ్ రుణ ఖాతాలకు సంబంధించి బ్యాంకుకు తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలు బ్యాంక్ ఆఫ్ బరోడా, తిలక్‌నగర్ బ్రాంచ్, హైదరాబాద్ వద్దగల ఆవరణలో 14-12-2023న సా.4.00గం.లకు బహిరంగ వేలంలో విక్రయించబడును. ఫోన్ నెం.7993316572.

రుణగ్రహీత పేరు & చిరునామా	గోల్డ్ లోన్ ఖాతా నెం.	బాకీపడినవి	మార్కెట్ విలువ/ రిజర్వు ధర	స్థూల బరువు (గ్రాముల్లో)
నరేంద్ర కొల్లాని, ఇ.నెం. 2-2-1076/13/1/1, నల్లకుంట, డోమినోస్ పిజ్జా ఎదురుగా, తిలక్‌నగర్, హైదరాబాద్-500013	24200600004610	రూ.10,11,279/- ప్లస్ లెక్కించిన వడ్డీ	Rs. 12,96,110/-	226.00

ఆసక్తిగల వ్యక్తులు బ్యాంక్ ఆఫ్ బరోడా, తిలక్‌నగర్ బ్రాంచ్, హైదరాబాద్ వారి పేరున ధరావత్తు రూ.5000/- డిడి (రీఫండబుల్)తో సహా వేలంలో పాల్గొనవచ్చును. ఎటువంటి కారణాలు తెలుపకుండానే వేలంను ఆమోదించు/ తిరస్కరించు/ వాయిదావేయు/ రద్దుచేయు అధికారం బ్రాంచ్ మేనేజర్ వారికి ఉంటుంది. ఇతర నియమ నిబంధనల కొరకు బ్రాంచ్‌లో సంప్రదించండి.

ప్రదేశం: హైదరాబాద్
తేది: 28-11-2023
సం/- బ్రాంచ్ మేనేజర్, బ్యాంక్ ఆఫ్ బరోడా, తిలక్‌నగర్ బ్రాంచ్

Bank of Baroda
బంజారా హిల్స్ బ్రాంచ్:
చిరునామా: 8-2-681/7/7, రోడ్ నెం.12, బంజారాహిల్స్, హైదరాబాద్-500034

బంగారు ఆభరణాల బహిరంగ వేలం ప్రకటన

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా దిగువ ఓవర్‌డ్యూ/ ఎన్‌పిఏ గోల్డ్ రుణ ఖాతాలకు సంబంధించి బ్యాంకుకు తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాలు బ్యాంక్ ఆఫ్ బరోడా, బంజారాహిల్స్ బ్రాంచ్, హైదరాబాద్ వద్దగల ఆవరణలో 05-12-2023న సా.4.00గం.లకు బహిరంగ వేలంలో విక్రయించబడును. ఫోన్ నెం.040-23303979.

క్ర. సం.	రుణగ్రహీత పేరు & చిరునామా	గోల్డ్ లోన్ ఖాతా నెం.	బాకీపడినవి	స్థూల బరువు (గ్రాముల్లో)	నికర బరువు (గ్రాములు)
1	శ్రీ.సందీప్ జె సి, 8-2-686/16/1/బి, రెపాన్‌బాగ్, ఎన్ బి టి నగర్, రోడ్ నెం.12, బంజారా హిల్స్, హైదరాబాద్.	75800600001179	రూ.49,173.3/- ప్లస్ లెక్కించిన వడ్డీ	30.00	24.00

ఆసక్తిగల వ్యక్తులు బ్యాంక్ ఆఫ్ బరోడా, బంజారాహిల్స్ బ్రాంచ్, హైదరాబాద్ వారి పేరున ధరావత్తు రూ.5000/- డిడి (రీఫండబుల్)తో సహా వేలంలో పాల్గొనవచ్చును. ఎటువంటి కారణాలు తెలుపకుండానే వేలంను ఆమోదించు/ తిరస్కరించు/వాయిదావేయు/ రద్దుచేయు అధికారం బ్రాంచ్ మేనేజర్ వారికి ఉంటుంది. ఇతర నియమ నిబంధనల కొరకు బ్రాంచ్‌లో సంప్రదించండి.

ప్రదేశం: హైదరాబాద్, తేది: 21-11-2023
సం/- బ్రాంచ్ మేనేజర్, బ్యాంక్ ఆఫ్ బరోడా

equitas Small Finance Bank
ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్
(ఇంతకుముందు ఇక్విటాస్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పిలువబడినది)
రిజిస్టర్డ్ కార్యాలయం: నెం.769, స్పెన్సర్ ప్లాజా, 4వ అంతస్తు, ఫేజ్-2, అన్నాసలై, చెన్నై, తమిళనాడు-600002. Ph: 044-42995000, 044-42995050

డిమాండ్ నోటీసు
(SARFAESI చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసు)

[illegible]

రుణగ్రహీత(లు) / హామీదారుడు(లు) పేరు (బ్రాంచ్ పేరు)	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	సెక్యూర్డ్ ఆస్తి యొక్క వివరణ (స్థిరాస్తి)
లోన్ నెం.. 200001416944 1. శ్రీమతి ఎస్.విజయశ్రీ, ... 2. శ్రీమతి ఎస్.విజయలక్ష్మి, ... 3. శ్రీ వెంకటేశ్వర్లు నారాయణ, ... 4. శ్రీ. వెంకటలక్ష్మి భగవాన్ సూరి, ... దగ్గర, బళ్లారి జిల్లా-583101, కర్ణాటక. [illegible]	06.11.2023 & Rs. 56,31,932.45/- as on 03.11.2023 & NPA on 24.09.2023	[illegible] ... జతచేయబడు బిల్డింగ్స్ మరియు నిర్మాణాలతోసహా.

తేది : 06-11-2023
ప్రదేశం : చెన్నై
అధీకృత అధికారి
ఇక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

VIVEK VARDHINI EDUCATION SOCIETY'S
N.S.R. COLLEGE OF EDUCATION
V.V.CAMPUS JAMBAGH, HYDERABAD.T.S. Cell: 9059428926 040-24744091
B.Ed. SPOT ADMISSIONS
04-12-2023. 10.AM, AT COLLEGE CAMPUS NON-REPORTED/DROPOUT VACANCIES

S.No.	H.T.NO.	Name	Gender	Rank	Category
1	2325301957	K VIJAY KUMAR	M	715	REG_ST_OU_GEN
2	2315301290	JADHAV RAM KUMAR	M	945	REG_ST_OU_GEN
3	2315302381	BODIGA NISHA	F	1125	REG_BCB_OU_FEMALE
4	2335102044	MIRZAPUR APOORVA	F	2316	REG_EWS_OU_FEMALE
5	2315301441	VANGALA KEERTHI	F	5139	REG_SC_OU_FEMALE
6	2325102263	PUTTI SAIKIRAN	M	2116	REG_BCA_OU_GEN
7	2315108251	KAVALI PRADEEP	M	3984	REG_SC_OU_GEN
8	2316003073	TANNIRU HARIPRIYA	F	5566	REG_BCB_OU_FEMALE
9	2325201046	DEVUNURI PAVAN KALYAN	M	18167	REG_OPEN_OU_GEN
10	2326001111	KOMPARI HARISH	M	1728	REG_BCB_OU_GEN
11	2315203026	B SANDEEP GOUD	M	3828	REG_BCB_OU_GEN
12	2335102355	VAJJA PRASHANTH	M	5732	REG_OPEN_OU_GEN_NCC
13	2315302329	VELPULA BINDU	F	2684	REG_OPEN_OU_GEN
14	2315301249	SIRIPURAM VINOD KUMAR	M	3522	REG_OPEN_OU_GEN
15	2325401049	KUMMARI VENKATESH	M	6942	REG_BCB_OU_GEN
16	2336001226	JINKIRI SHIVANI	F	12548	REG_OPEN_OU_GEN_PHV

Note: If the above candidates fail to report to the College on or before 03.12.2023, 4 pm Their Admission will be treated as cancelled the same vacancies will be filled under spot admission.
Sd/- Correspondent / Principal

IL&FS | Engineering Services
IL&FS Engineering and Construction Company Limited
CIN: L45201TG1988PLC008624
Regd. Office: D.No.8-2-120/113, B-Block,1st Floor, Sanali Info Park, Road No. 2, Banjara Hills, Hyderabad - 500033
Ph: 040-40409333; Fax: 040-40409444; Email: cs@ilfsengg.com; Web: www.ilfsengg.com

పోస్టల్ బ్యాలెట్ ప్రకటన

ఇందుమూలంగా సభ్యులకు తెలియజేయునది ఏమనగా కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ (ఎంసిఏ సర్క్యులర్లు) మరియు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్& డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 (లిస్టింగ్ రెగ్యులేషన్స్) యొక్క రెగ్యులేషన్ 44 (సమయానుసారంగా సవరించిన ప్రస్తుతం అమలులోవున్న ఏదేని చట్టబద్ధమైన మార్పు(లు), లేదా రీ-ఎన్‌యాక్ట్‌మెంట్‌లతోసహా)చే జారీచేసిన జనరల్ సర్క్యులర్ నెం.లు14/2020 తేది.8 ఏప్రిల్, 2020, 17/2020 తేది.13 ఏప్రిల్, 2020 మరియు 09/2023 తేది.25 సెప్టెంబర్, 2023 మరియు ఇతర సంబంధిత సర్క్యులర్స్ మరియు నోటిఫికేషన్స్‌తో చదవగల సవరించినట్లు కంపెనీస్ (మేనేజ్‌మెంట్ అండ్ అడ్మినిస్ట్రేషన్) రూల్స్, 2014లోని రూల్ 20 మరియు 22తో చదవగల కంపెనీల చట్టం, 2013 (దిచట్టం)లోని సెక్షన్ 108 రియు సెక్షన్ 110 మరియు ఇతర వర్తించు నియామావాలను అనుసరించి ఎలక్ట్రానిక్ మీన్స్ ('రిమోట్ ఇ-ఓటింగ్') ద్వారా మాత్రమేచే 21 నవంబర్, 2023తేది నాటి పోస్టల్ బ్యాలెట్ నోటీసులో పేర్కొన్న తీర్మానాలకు సంబంధించి సభ్యుల ఆమోదం కోసం కటాఫ్ తేది శుక్రవారం, 24 నవంబర్, 2023నాటికి [illegible]

... www.ilfsengg.com ... www.bseindia.com మరియు www.nseindia.com ... https://evoting.kfintech.com ... https://www.ilfsengg.com & https://evoting.kfintech.com ... cs@ilfsengg.com ... https://evoting.kfintech.com ... einward.ris@kfintech.com [illegible]

బోర్డు ఉత్తర్వు మేరకు
For IL&FS Engineering and Construction Company Limited
రజత్ కుమార్ సింగ్
కంపెనీ సెక్రెటరీ & కంప్లియన్స్ ఆఫీసర్
మెంబర్‌షిప్ నెం.ఎఫ్‌సిఎస్ 4016
ప్రదేశం: గురుగ్రామ్
తేది: 28-11-2023



నవతెలంగాణ

అనుదినం... జనస్వరం

సమగ్ర తెలుగు దినపత్రిక

www.navatelangana.com

బుధవారం 29-11-2023

సంపుటి : 9 | సంచిక : 328 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 10 పేజీలు + టాబ్లాయిడ్ 16 పేజీలు | వెల : 6.50

ప్రజాస్వామ్య వేదికలైన చట్టసభలు ప్రశ్నించే గొంతులు లేక వెలవెలపోతున్నాయి. ధనస్వామ్యంతో ఎన్నికలు తంతుగా మారాయి. ఈ చరిత్రను తిరిగిరాయాలి. పేదల పక్షాన పోరాడే సీపీఐ(ఎం) అభ్యర్థుల్ని శాసనసభకు పంపాలి. ఎర్రదండు కదలిక బూర్జువా నేతల వెన్నులో వొణుకు పుట్టించాలి. నిరంకుశ నిజాం మెడలు వంచి, సాయుధ రైతాంగ పోరాటం చేసిన తెలంగాణ గడ్డ నుంచే మార్పుకు శ్రీకారం చుట్టాలి. ఉద్యమాల స్ఫూర్తితో చైతన్యవంతులైన ప్రజలు సీపీఐ(ఎం)ను అక్కున చేర్చుకొని, అండగా నిలవాలి. - బృందాకరత్

CPIM

ప్రశ్నించే గొంతుల్ని గెలిపించండి

బూర్జువా పార్టీల మాయాజాలాన్ని తిప్పికొట్టండి

- వర్షాకాలంలో కప్పల్లా.. పార్టీలు మారుతున్నారు
- మావి రోడ్ షోలు కాదు.. పోరుబాటలు
- లాల్ జెండా ముద్ద బిడ్డ మల్లు లక్ష్మికి ఓటేయండి : సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్

నవతెలంగాణ-మఠంపల్లి

ఇది రోడ్ షో మాత్రమే కాదు.. పోరాటాల షో అని..సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ అన్నారు. ఎన్నికలు వచ్చాయంటే వానాకాలంలో వచ్చే కొత్తకప్పల్లా కప్పదాట్లు వేస్తూ పూటకో పార్టీ మారుతున్నారని, ఎర్రజెండా పట్టుకున్న కార్యకర్తలు, నాయకులు నికరంగా ఉంటారని అన్నారు. లాల్ జెండా ముద్దుబిడ్డ మల్లు లక్ష్మిని గెలిపించాలని పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థి మల్లు లక్ష్మి గెలుపును కాంక్షిస్తూ మంగళవారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన రోడ్ షోలో బృందాకరత్ పాల్గొన్నారు. ఎర్రజెండాలతో ...9లో

సైలెన్స్

- ముగిసిన ఎన్నికల ప్రచారపర్వం
- ఓటరుదే తుది నిర్ణయం
- సోషల్ మీడియాలోనూ ప్రచారం బంద్
- కోడ్ ఉల్లంఘిస్తే కేసులు తప్పవు
- రాష్ట్రవ్యాప్తంగా 144 సెక్షన్: ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ వెల్లడి 9లో..



ఇందిరమ్మ రాజ్యమంటే అరాచకాలే

ఎన్టీఆర్ పార్టీ పెట్టి ఆకలి తీర్చారు

- తెలంగాణకు మోడీ ఏం చేశారని ఓట్లు వేయాలి
- పార్టీల చరిత్రను చూసి ఓట్లు వేయాలని విజ్ఞప్తి
- రాష్ట్ర రాజముద్రలో ఓరుగల్లుకు అగ్రస్థానం
- ఇండ్లు వేసుకున్న వారికి పట్టాలిస్తాం : ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్



నవ తెలంగాణ- గజ్వేల్/ మట్టెవాడ

కాంగ్రెస్‌కు ఓటేస్తే ఇందిరమ్మ రాజ్యం కాదు కదా ఎమర్జెన్సీ వస్తుందని సీఎం, గజ్వేల్ బీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. ఇందిరమ్మ రాజ్యమంటే అరాచకమేనని అన్నారు. పేదలు ఆకలి కేకల మధ్య ...9లో

మేము పాలకులం కాదు.. ప్రజా సేవకులం

నిరంకుశ కేసీఆర్ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలి

- పదేండ్లలో కేసీఆర్ మోసం తప్ప చేసిందేమీ లేదు : మల్కాజిగిరి రోడ్ షోలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంక



నవతెలంగాణ-మల్కాజిగిరి

రాష్ట్రంలో కేసీఆర్ నిరంకుశ ప్రభుత్వానికి ప్రజలు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఏఐసీసీ నాయకులు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి అభ్యర్థి మైనంపల్లి హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ రోడ్‌షోలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. డప్పు దరువులతో, బతుకమ్మ, బోనాలు, వివిధ నృత్యాలతో వేలాది మంది ప్రజలతో ఆనంద్ బాగ్ చౌరస్తా నుంచి మల్కాజ్‌గిరి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రియాంక గాంధీ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు ప్రత్యేక రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేస్తే, కేసీఆర్ కుటుంబం ప్రజలను అడ్డగోలుగా దోచుకుందని అన్నారు. బడుగు బలహీన తరగతుల ప్రజలను మోసం ...9లో

మృత్యుంజయులు!

- 17 రోజులు..41మంది కార్మికులు..
- ఉత్తరాఖండ్ సొరంగం నుంచి సురక్షితంగా బయటకు..
- కార్మికుల కుటుంబాల్లో ఆనందం

9లో వివరాలు



బీరు పొంగింది


- చలికాలంలోనూ తగ్గని సేల్స్
- ఎన్నికల ప్రభావమేనంటున్న పరిశీలకులు

వివరాలు 9లో



కథంతా ఈరోజే...

ప్రచారానికి తెర.. ప్రలోభాలకు ఎర



- బూత్‌ల వారీగా పంపకాలు
- తటస్థులకు గాలం
- ఓటు విలువ రూ.5 వేలు పలుకుతున్న వైనం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రచారం పరిసమాప్తం కావటంతో ఇక 'అసలు కథ' బుధవారం రాత్రి మొదలు కానుంది. గురువారం పోలింగ్‌పై ఇది తీవ్రమైన ప్రభావం చూపే అవకాశముందని విశ్లేషకుల అంచనా. బుధ, గురు వారాల్లో మద్యం దుకాణాలు బంద్ చేయాలంటూ ఈసీ ఆదేశించినా 'అందాల్సిన దంతా' ముందే అందటంతో మందు బాబులకు ఎలాంటి ఢోకా లేదు. ఇక ధన ప్రవాహం కట్టలు తెంచుకోనుంది. పార్టీలన్నీ విచ్చలవిడిగా డబ్బును పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేయగా... వాటిలో ఒక ప్రధాన పార్టీ... తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధమైంది. 'ఎంత ఖర్చయినా ఫరవాలేదు, ఈసారి గెలిచి తీరాలి...' అనే విధంగా... ప్రతీ నియోజకవర్గంలోని ...5లో



ఎన్నికల ప్రేమ

సంపాదకీయం

తెలంగాణ మినహా మిగిలిన నాలుగు (రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మిజోరం) రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఈ నెల 30తో తెలంగాణలోనూ పోలింగ్ ముగియనుంది. ఈ నేపథ్యంలో ఓటర్లను బుట్టలో వేసుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్ అలవికాని హామీలు కుమ్మరించాయి. రాష్ట్రంలో బీఆర్ఎస్ కూడా భారీగానే హామీలు గుప్పించింది. ఈ హామీల అమలుకు డబ్బు ఎక్కడి నుంచి వస్తుందనే దానిపై చర్చలు ఎలా ఉన్నా... రెక్కలు ముక్కలు చేసుకొని ఆరుగాలం కష్టించి పనిచేసే అన్నదాతపై పాలక పార్టీలు నాటకాలు షురూ చేశాయి, జాతీయస్థాయిలో ఇదొక రాజకీయ సమస్యగా మారడంతో ప్రధాన పార్టీలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. వ్యవసాయంపైనా, రైతులపైనా ఇప్పటిదాకా ఎన్నో హామీలు ఇచ్చిన మోడీ ప్రభుత్వం మళ్లీ పాతపాటనే వల్లెవేస్తూ రైతును మళ్లీ అగాధంలోకి నెట్టేందుకు సిద్ధమవుతోంది.

ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రా ల్లో రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ఇస్తా మని చెప్పడమంటే మోడీ, ఆయన పార్టీ చెబుతున్న దాంట్లో వాస్తవం ఎంతుందో అర్థమవుతోంది. ఉచిత విద్యుత్ అవసరం లేదని వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలంటూ విద్యుత్ సంస్కరణలు తెచ్చి రాష్ట్రాలపై ఒత్తిడి చేస్తున్న మోడీ .. రైతుల కోసం ఏదో చేస్తారనుకోవడం భ్రమే అవుతుంది.

తొమ్మిదిన్నరేండ్ల కాలంలో ఏనాడూ రైతుల గురించి బీజేపీ ప్రభుత్వం ఆలోచించలేదు. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో లబ్దిపొందడం కోసం ఎక్కడాలేని ప్రేమను ఒలకబోస్తోంది. స్వామినాథన్ సిఫారసుల ఆధారంగా పంట ఉత్పత్తులకు కనీస మద్దతుధర చట్టం, రుణ విమోచన చట్టం, తదితర డిమాండ్ల సాధనకు రైతుసంఘాలు, కార్మికసంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి 28 వరకు మూడు రోజుల పాటు దేశవ్యాప్త ఆందోళనలు జరిగాయి. మూడు రైతు వ్యతిరేక నల్లచట్టాలను వెనక్కి తీసుకోవాలని ఏడాదిపాటు రైతులు ఢిల్లీలో ఆందోళనలు జరిగినప్పుడు.. ఆ నిరసనలు ప్రపంచాన్ని తాకిన విషయం తెలిసిందే. ఆ పోరాటం మాటల్లో చెప్పలేనిది. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా రైతులు వెనుతిరగలేదు. ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. అయితే ఆ సమయంలో చేసిన ఒప్పందాలను కేంద్రం అమలు చేయలేదు. 'కనీస మద్దతు ధర చట్టం' అమలు చేస్తామని ఇచ్చిన హామీ ఇప్పటివరకు అతీగతీ లేదు. కేసులు ఎత్తివేయలేదు. ఈ సమయంలో మళ్లీ నిరసనలు తీవ్ర స్థాయికి చేరితే రాబోవు సార్వత్రిక ఎన్నికలకు బీజేపీకి పెద్ద దెబ్బే తగిలే ప్రమాదం ఉంది. దాని నష్టనివారణ కోసం రాష్ట్రాల శాసనసభ ఎన్నికలపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది. పీఎం కిసాన్‌సమ్మాన్ నిధి కింద ఇస్తున్న ఆర్థిక సాయాన్ని పెంచుతామని చెప్పడం అందులో భాగమే. వరి ప్రధాన పంటగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో రుణమాఫీపై రెండు పార్టీలు వాగ్దానాలు చేశాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం క్వింటాలు ధాన్యానికి రూ. 2,600ల కనీస మద్దతు ధర ఇవ్వగా దానికంటే ఐదు వందల రూపాయలు ఎక్కువ ఇస్తానని బీజేపీ ప్రకటించింది. గత రెండేండ్లుగా పెండింగులో ఉన్న ధాన్యం సేకరణ బోనస్‌ను కూడా చెల్లిస్తామంటోంది. కాంగ్రెస్ కూడా క్వింటాలు ధాన్యాన్ని రూ.3,200కు కొనుగోలు చేస్తానంటోంది. రాజస్థాన్‌లో స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు కనీస మద్దతు ధరను అమలు చేసేందుకు చట్టాన్ని తీసుకొస్తానని అధికార కాంగ్రెస్ హామీ ఇచ్చింది. బీజేపీ



రైతుల పిల్లలకు ఉచిత విద్య కల్పిస్తామని, గోధు మలపై ఎంఎస్‌పీ కంటే అదనంగా రూ.2,700 బోనస్ ఇస్తానని తెలిపింది. మధ్యప్రదేశ్‌లో క్వింటాలు గోధుమలకు రూ.2,700, ధాన్యానికి రూ. 3,100 ఎంఎస్‌పీ ఇస్తానని చెప్పింది. తెలంగాణ లోనూ మద్దతు ధరపై హామీ ఇచ్చింది. హామీలు ఇవ్వడం తప్పుకాదు. వ్యవసా యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్య తీవ్రత ఏ స్థాయిలో ఉందో రాజకీయ పార్టీలు ఇచ్చిన హామీలే నిదర్శనం. ఇప్పటి దాకా కేంద్రంలో పాలించిన పార్టీలు కానీ, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాషాయ ప్రభుత్వం గానీ రైతులు, వ్యవసాయ గురించి పట్టించుకుంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నది స్పష్టం.

రుణమాఫీపైనా, ఉచితాలపైనా హేళనగా మాట్లాడిన బీజేపీ మ్యానిఫెస్టోల్లో చేర్చిన డిమాండ్లను అమలు చేస్తారనేది గ్యారంటీ ఉందా? కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కానీ, ఆయా రాష్ట్రాల్లో ఉన్న బీజేపీ ప్రభుత్వాలు కానీ రైతులకు చేసింది శూన్యం. స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పి 2014లో అధికారంలోకి వచ్చింది మోడీ ప్రభుత్వం. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న ప్రధాని రైతుకు ఇస్తానని ప్రకటించిన రైతు సాయంలోనే కోత పెట్టారు. ఈ కాలంలో కేంద్రం తీసుకున్న నిర్ణయాలతో రైతు ఆదాయమే పడిపోయింది. కార్పొరేట్ కంపెనీలు ప్రభుత్వ బ్యాంకుల నుంచి తీసుకున్న రూ. 15.32 లక్షల కోట్ల రుణాలను రద్దు చేసిన మోడీ.. రైతుల రుణాలు మాఫీ చేయలేదు. విదేశీ కంపెనీలకు కావలసిన రీతిలో సకల సౌకర్యాలు కల్పిస్తున్న కేంద్రం.. అన్నదాతకు ఇచ్చిన డిమాండ్లను అమలు చేయడం లేదు. డిసెంబర్ 2021లో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని రైతు సంఘాలు పట్టుబట్టినా ఈ రోజు వరకు పట్టించుకోని మోడీ ప్రభుత్వం.. ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ఇస్తామని చెప్పడమంటే మోడీ, ఆయన పార్టీ చెబుతున్న దాంట్లో వాస్తవం ఎంతుందో అర్థమవుతోంది. ఉచిత విద్యుత్ అవసరం లేదని వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలంటూ విద్యుత్ సంస్కరణలు తెచ్చి రాష్ట్రాలపై ఒత్తిడి చేస్తున్న మోడీ .. రైతుల కోసం ఏదో చేస్తారనుకోవడం భ్రమే అవుతుంది.

చైనా కార్లు వద్దు అమెరికన్ వాహనాలు ముద్దంటున్న మోడీ!



ఎం కోటేశ్వరరావు
8331013288

ప్రపంచంలో ఎలక్ట్రానిక్ కార్ల యుద్ధానికి తెరలేచే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే చైనా ఒక వైపు, ఐరోపా సమాఖ్య- అమెరికా మరోవైపు మోహరిస్తున్నాయి. అమెరికా కంపెనీ టెస్లా కార్ల దిగుమతికి మన కేంద్ర ప్రభుత్వంతో ఒక ఒప్పందం కుదిరిందని, వచ్చే ఏడాది నుంచి ఓడల్లో కార్లు దిగనున్నాయని వార్తలు. అధికారికంగా జనవరిలో ప్రకటించవచ్చు. రానున్న రెండు సంవత్సరాల్లో కార్ల తయారీ (విడి భాగాలను తీసుకువచ్చి ఇక్కడ అమర్చటం) కూడా ప్రారంభించే అవకాశం ఉందని కూడా చెబుతున్నారు. ప్రపంచంలో అత్యధిక కార్లను అమ్ముతున్న చైనా బివైడి కంపెనీతో కలిసి కార్ల తయారీని ప్రారంభిస్తామన్న మెఘా ఇంజనీరింగ్ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. టెస్లా రెండు వందల కోట్ల డాలర్ల మేర కార్ల తయారీ కేంద్రానికి పెట్టుబడి పెడుతుందని మన దేశం నుంచి 1,500కోట్ల డాలర్ల విలువగల విడిభాగాలను కొను గోలు చేస్తుందని చెబుతున్నారు. కేంద్ర వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ సెప్టెంబరు నెలలో కాలిఫోర్నియాలోని టెస్లా కంపెనీని సందర్శించి వచ్చిన సంగతి తెలిసిందే. వంద కోట్ల డాలర్ల పెట్టుబడితో హైదరాబాద్‌లో ఏటా పది నుంచి పదిహేను వేల కార్ల తయారీ, ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు చేస్తామని చైనా బివైడి-మెఘా చేసిన ప్రతిపాదనను కేంద్రం పక్కన పెట్టింది. ప్రస్తుతం ఉన్న నిబంధనలు చైనా నుంచి వచ్చే పెట్టుబడులను అనుమతించే అవకాశం లేదని కారణం చెప్పింది. మెఘా కంపెనీ పెట్టుబడిపెడితే సాంకేతిక పరిజ్ఞానం చైనా కంపెనీ అందచేస్తుందని చెప్పినప్పటికీ అంగీకరించలేదు. దీనికి కారణం అమెరికన్ కంపెనీ టెస్లాను అనుమతించేందుకు సముఖంగా ఉండటమే అని చెప్పవచ్చు. మనం ఎలాగూ తయారు చేయలేనపుడు రెండు విదేశీ కంపెనీలు పోటీపడి ధరలను తగ్గిస్తే మన వినియోగదారులకు లాభం, కొన్ని విడిభాగాలు ఇక్కడే తయారీ ద్వారా కొంత మేరకు ఉపాధి కల్పించే అవకాశం ఉన్నప్పటికీ టెస్లావైపే మొగ్గుచూపటం ఏమిటన్న ప్రశ్న ముందుకు వస్తున్నది. చైనాలో స్వంతంగా తయారు చేసే కంపెనీలు ఉన్నప్పటికీ టెస్లాను కూడా అనుమతించిన కారణంగా పోటీబడి అది కూడా తక్కువ ధరలకే అక్కడ కార్లు అమ్ముతున్నది. మెఘా ఇంజనీరింగ్ కంపెనీ ఇప్పటికే చైనా కంపెనీతో కలసి ఎలక్ట్రిక్ బస్సులను తయారు చేస్తున్న సంగతి తెలిసిందే.దానికి లేని అడ్డంకి కార్లకు వచ్చిందంటే 2020లో జరిగిన సరిహద్దు ఘర్షణలు, చైనా వ్యతిరేక కూటమిలో మన దేశం మరింతగా భాగస్వామి కావటమే అని చెప్పవచ్చు.

ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తిలో చైనా జోరు ప్రపంచ మార్కెట్లను దిగ్భ్రాంతికి గురిచేస్తున్నది.సాంప్రదాయ కార్ల నుంచిఎలక్ట్రానిక్ వాహనాలకు మారితే ప్రస్తుతం తమ సంఘంలోని లక్షా యాభై వేల మంది కార్మికుల్లో 35వేల మందికి ఉపాధిపోతుందని అమెరికా యునై టెడ్ ఆటో వర్కర్స్ యూనియన్ తెలిపింది. తమ దేశంలో 2032 నాటికి మూడింట రెండువంతులు ఎలక్ట్రానిక్ కార్ల విక్రయమే ఉంటుందని అమెరికా ప్రకటించగా, 2035 నుంచి కేవలం ఎలక్ట్రిక్ కార్లనే అమ్ముతామని ఐరోపా సమాఖ్య పేర్కొన్నది. ఈ లక్ష్యాలను సాధించటానికి చైనా నుంచి వాహనాల దిగుమతు లను అనుమతించాలా వద్దా అని ఆ దేశాలు మల్లగుల్లాలు పడుతున్నాయి. కేవలం ఎలక్ట్రిక్, ఇంధనంతోనూ నడిచే హైబ్రిడ్ కార్లతో సహా 2022లో ప్రపంచంలో నూటికి 60 చైనాలోనే ఉత్పత్తి చేశారు. చైనాలో ఐదువేల నుంచి 90వేల డాలర్ల వరకు ధర ఉండే 90 రకాల కార్లను అందుబాటులో ఉంచారు. సగటు ధర 53,800 డాలర్లుండగా ఐరోపాలో 94,100 డాలర్లుంది. ఈ ఏడాది చైనాలో మొత్తం కార్ల అమ్మకాల్లో నాలుగో వంతు(80లక్షలు) ఎలక్ట్రిక్ కార్లుండగా, ఐరోపా సమాఖ్య దేశాల్లో 22, అమెరికాలో ఆరు, జపాన్‌లో కేవలం మూడు శాతమే ఉంటాయని అంచనా వేస్తున్నారు.

ఐరోపా సమాఖ్య(ఇయు) 2022లో చైనా నుంచి దిగుమతి చేసుకున్న కార్లు సమాఖ్య మొత్తం ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాల్లో మూడు శాతమే. అవి 2030నాటికి 20శాతానికి చేరతాయని స్థానిక కార్ల కంపెనీలు ఆందోళన చెందుతున్నాయి. చైనా పెద్ద మొత్తంలో సబ్సిడీలు ఇచ్చిన కారణంగా తక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు ఆరోపిస్తూ వాటి మీద విచారణ జరపాలని ఇయు నిర్ణయించింది. దిగుమతి సుంకాల మీద ఒక నిర్ణయం తీసుకొనేందుకు పూనుకుంది. ఇయు నిర్ణయం రక్షణాత్మక చర్యలు తప్ప మరొకటి కాదని వెంటనే చైనా స్పందించింది. అక్కడ ఇస్తున్న సబ్సిడీల సంగతేమిటని ప్రశ్నించింది. ఏ హెూదాతో తమపై విచారణ జరుపుతుందని నిలదీసింది. చైనా నుంచి వస్తున్న దిగుమతులతో స్థానికంగా ఉన్న కార్ల గిరాకీ 20 శాతం తగ్గుతుందని అంచనా. చైనా కస్టమ్స్ సమాచారం ప్రకా రం వర్తమాన సంవత్సరం ఏడునెలల్లో గతేడాది కంటే 113శాతం పెరగ్గా, 2020తో పోల్చితే3, 205 శాతం ఎక్కువ. చైనా ఇస్తున్న సబ్సిడీలు ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు వ్యతిరేకంగా ఉంటే పోరాడాల్సిందేనని జర్మనీ మంత్రితో భేటీ అయిన ఫ్రెంచి ఆర్థిక మంత్రి బ్రూనో లీ మెయరే చెప్పాడు. అయితే కొందరు ఐరోపా వాణిజ్యవేత్తలు దర్యాప్తును వ్యతిరేకిస్తున్నారు. దీంతో చైనా కూడా ఎదురుదాడికి దిగితే తమ ప్రయోజనాలు దెబ్బతింటాయని ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు అనేక దేశాలు చైనా నుంచి చౌకగా వచ్చే కార్లను దిగుమతి చేసుకోవాలని ఉన్నా స్థానిక కార్మికులకు పని లేకుండా పోతుందనే భయం మరోవైపు ఉంది.ప్రపంచంలో ఆటో పరిశ్రమల్లో కార్మికులు కోటీ నలభై లక్షల మంది ఉండగా చైనాలో 40లక్షలు,ఇయులో 25, అమెరికా, మెక్సికో, జపాన్లలో పది లక్షల



మన దేశంలో ఎలక్ట్రానిక్ కార్ల తయారీకి పూనుకుంటే ముడి పదార్థాలు, బ్యాటరీల కోసం చైనా మీద ఆధారపడటం పెరుగుతుందని గ్లోబల్ ట్రేడ్ రిసర్చ్ ఇనీషియేటివ్(గిట్రి) ఈ ఏడాది మార్చి నెలలో తన నివేదికలో పేర్కొన్నది. భారత్‌లో తయారయ్యే వాహనాలకు అవసరమైన వాటిలో 70శాతం వస్తువులను చైనా, ఇతర దేశాల నుంచి సమకూర్చుకోవాల్సి ఉంటుంది. కాలుష్యం, ఉపాధిపై తలెత్తే పర్యవసానాల వంటి 13 అంశాలను గిట్రి గుర్తించింది. ఈ వాహనాల బ్యాటరీలను దిగుమతి చేసుకోవాలి, ధరలు ఎక్కువగా ఉంటాయి, ఆరేడు సంవత్సరాల తరువాత కొత్తవాటిని వేసుకోవాలి, వాటిని రీసైకిల్ చేయాలంటే వెలువడే విషపదార్థాలు సమస్యగా మారతాయి, దీని వలన విద్యుత్ గిరాకీ పెరుగుతుంది, బొగ్గుద్వారా ఉత్పత్తి చేసే విద్యుత్ ప్రక్రియలో కాలుష్యం పెరుగుతుంది.

వంతున ఉన్నారు. గతేడాది ప్రపంచ కార్ల ఎగుమతి విలువ 780 బిలియన్ డాలర్లు కాగా ఇయు 407, జపాన్ 87, అమెరికా 58, దక్షిణ కొరియా 52, మెక్సికో 47 బి.డాలర్ల వాటా కలిగి ఉండగా చైనా 45 బి.డాలర్ల మేరకే ఎగుమతి చేసింది. ఉక్కు రంగంలో 2021లో మిగతా దేశాలను వెనక్కు నెట్టేసినట్లుగా రానున్న రోజుల్లో కార్లలో కూడా చైనా అగ్రస్థానానికి వస్తుందేమోనన్న భయం వెల్లడవుతోంది.

అమెరికాలో పికప్ ట్రక్కుల మీద 25శాతం తప్ప సాధారణ పన్ను 2.5శాతమే, అయితే చైనాతో వాణిజ్యపోరు ప్రారంభించిన డోనాల్డ్ ట్రంప్ చైనా కార్ల మీద 25శాతం విధించగా దాన్ని జోబైడెన్ కొనసాగిస్తున్నాడు. జపాన్‌లో అసలు పన్ను లేదు, పదిశాతం వసూలు చేస్తున్న ఇయు చైనా కార్ల మీద పన్ను పెంచాలని చూస్తున్నది. చైనా కంపెనీలు తక్కువ ధరలకు కార్లను ఎందుకు విక్రయించగలుగుతున్నాయన్నది ప్రశ్న. ఎలక్ట్రిక్ కార్లలో కీలకమైనవి. లిథియం - అయాన్ బ్యాటరీలు. వీటి పరిశోధన-అభివృద్ధికి చైనా ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టింది, ఆ రంగంలో ఉన్నవారికి రాయితీలిచ్చింది. దానికి తోడు వాటి తయారీకి అవసరమైన ముడిపదార్థాలు చైనాలో పుష్కలంగా ఉండటం అక్కడి కంపెనీలకు కలసివచ్చింది. దీంతో స్థానిక వినియోగదారులు ఆకర్షితులౌతున్నారు ప్రపంచంలో వందకార్లు అమ్మితే గతేడాది చైనాలోనే 59 అమ్మారు. ఈ ఊపుతో ప్రపంచ మార్కెట్లకు విస్తరించాలని అక్కడి కంపెనీలు చూస్తున్నాయి. ఐరోపా దేశాల్లో తలెత్తిన కాలుష్యం కారణంగా రోడ్ల మీద ధ్వనితో 40శాతం మంది బ్రిటీష్ పౌరులు అనారోగ్యానికి గురవుతున్నట్లు తేలింది.వాయు కాలుష్యంతో శ్వాస సమస్యలు పెరుగుతున్నాయి. పెట్రోలు, డీజిల్ కార్లతో పోలిస్తే ఎలక్ట్రిక్ కార్ల వలన 17 నుంచి 30శాతం వరకు గ్రీన్‌హౌస్ గ్యాస్ విడుదల తగ్గుతుందని అంచనా. అందుకే 2035నాటికి బ్రిటన్‌లో మొత్తం ఎలక్ట్రిక్ కార్లనే అమ్మాలని నిర్ణయించారు. ఒకవైపు చమురు ఇంధన కాలుష్యం తగ్గుతుందనే సానుకూలత ఉన్నా ప్రతికూలతల గురించి కూడా చర్చ మొదలైంది. హరిత ఇంధనం కోసం ధనికదేశాల ప్రయత్నం పేద దేశాల్లో పర్యావరణ సమస్యలను సృష్టిస్తున్నది.

ప్రస్తుత తీరుతెన్నులను చూస్తే చైనా - ఇతర దేశాల మధ్య కార్ల ధరల యుద్ధం జరిగే సూచన కనిపిస్తున్నది. అమెరికా కంపెనీ టెస్లా దీనికి నాంది పలికింది.దీంతో చైనాలోని కొన్ని రకాల కార్ల ఉత్పత్తిని ఆపివేయాల్సి వచ్చింది.ఈ ఏడాది తొలి ఏడు నెలల్లో దేశీయ మార్కెట్లో 114లక్షల కార్లను విక్రయించగా 20లక్షలు ఎగుమతి చేసింది. విదేశీ ఎగుమతులు 80శాతం పెరగ్గా, స్వదేశీ మార్కెట్ 1.7శాతమే పెరిగినందున ధరల పోటీకి దిగితే చైనా కూడా నష్టపోవచ్చని కొందరు చెబుతున్నారు.గతేడాది డిసెంబరు నాటికి చైనాలో 4.3 కోట్ల కార్ల ఉత్పత్తి సామర్థ్యం ఉందని, ఉన్న సామర్థ్యంలో 2017లో 66.6శాతం వినియోగిస్తే గతేడాది 54.5శాతంగా ఉందని రాయిటర్స్ పేర్కొన్నది. అక్కడ ఆటోపరిశ్రమ మీద ప్రత్యక్షంగా పరోక్షంగా మూడు కోట్ల మంది ఆధారపడి ఉన్నారు. జపాన్ కార్ల పరిశ్రమకు సైతం చైనా సెగతగులుతోంది.టయోటా తదితర కంపెనీలు తమ డిమాండ్ పడిపోకుండా చూసుకుంటున్నాయి. చైనాలో హైబ్రిడ్ కార్లకు మార్కెట్ ఎక్కువగా ఉంది. నిజంగా కార్ల ధర యుద్ధమే తీవ్రమైతే చైనాకు తక్షణమే ఇబ్బంది ఉండదు. ఇప్పటికే సామర్థ్యాన్ని సమకూర్చుకున్నందున పూర్తిస్థాయిలో ఉత్పత్తి వెంటనే జరపవచ్చు. అదే మిగతా దేశాల్లో సామర్థ్యాన్ని పెంచుకొనేందుకు భారీగా పెట్టుబడులను కూడా పెట్టాల్సి వస్తుంది.

మన దేశంలో ఎలక్ట్రానిక్ కార్ల తయారీకి పూనుకుంటే ముడి పదార్థాలు, బ్యాటరీల కోసం చైనా మీద ఆధారపడటం పెరుగుతుందని గ్లోబల్ ట్రేడ్ రిసర్చ్ ఇనీషియేటివ్(గిట్రి) ఈ ఏడాది మార్చి నెలలో తన నివేదికలో పేర్కొన్నది. భారత్‌లో తయారయ్యే వాహనాలకు అవసరమైన వాటిలో 70శాతం వస్తువులను చైనా, ఇతర దేశాల నుంచి సమకూర్చుకోవాల్సి ఉంటుంది.కాలుష్యం, ఉపాధిపై తలెత్తే పర్యవసానాల వంటి 13 అంశాలను గిట్రి గుర్తించింది.ఈ వాహనాల బ్యాటరీలను దిగుమతి చేసుకోవాలి, ధరలు ఎక్కువగా ఉంటాయి, ఆరేడు సంవత్సరాల తరువాత కొత్తవాటిని వేసుకోవాలి, వాటిని రీసైకిల్ చేయాలంటే వెలువడే విషపదార్థాలు సమస్యగా మారతాయి, దీని వలన విద్యుత్ గిరాకీ పెరుగుతుంది, బొగ్గుద్వారా ఉత్పత్తి చేసే విద్యుత్ ప్రక్రియలో కాలుష్యం పెరుగుతుంది. దూరప్రయాణాలకు అనువుగా ఉండవు, ప్రజా రవాణాకు పెద్దగా ఉపయోగపడవు, చైనామీద ఎక్కువగా ఆధారపడటం వంటి అంశాలను పేర్కొన్నది. ఆటో విడిభాగాలను తయారు చేసే ఏడు వందల సంఘటిత రంగ సంస్థలతో పాటు పదివేల అసంఘటిత రంగ సంస్థల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుంది. విడిభాగాలు అమ్మేవారు, లక్షలాది గారేజ్ షాపులు, సర్వీసు సెంటర్ల ఉనికి ప్రశ్నార్థకం అవుతుందని కూడా పేర్కొన్నది. తమ కాలుష్యకారక పరిశ్రమలను రక్షించుకొనేందుకు, ప్రపంచ వాణిజ్యాన్ని చిన్నాభిన్నం చేసేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వైపు మళ్లాలని ఐరోపా దేశాల చెబుతున్నాయి తప్ప ప్రపంచమంతా అలా లేదు.ఎలక్ట్రిక్ స్కూటర్లకు చార్జర్లకు ఒక ప్రమాణం లేదు, అందువలన ప్రతి సంస్థ తనదైన నమూనాను ఇస్తున్నది, దేశమంతటా ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటున్నదని గిట్రి పేర్కొన్నది. •

గంగా - జమునా - తెహజీబ్

1989లో మొదటిసారి హైదరాబాద్‌లో అడుగు పెట్టాను. సెంట్రల్ యూనివర్సిటీలో సీట్ సంపాదించి భయంభయంగా వచ్చాను. బెజవాడలో డిగ్రీ చేసి హైదరాబాద్ మాస్టర్స్‌కి. చిన్న పిల్లాణ్ణేం కాదు గానీ, బెజవాడలో ఎన్నాళ్లున్నా నాకు తెలియని ప్రపంచం చూపించిన ఊరు కాదది. హోటల్‌కి వేళ్తే మనకి తెలిసిన పెసరట్లూ, ఇడ్లీలూ, పుణుగులూ, బజ్జీలూ. తెలుగు తప్పా ఇంకోటి మాట్లాడే అవసరం లేదు. పల్లెటూరి నించి వచ్చి నవాడికి విజయవాడ పెద్ద నగరమే. కానీ అది మంచి ఏ.సీ సినిమా హాళ్ళకీ, సిటీబస్సులకీ పరిమితం. రోటీ కర్రీలూ, పానీ పూరీలూ, బిర్యానీలూ తెలీవు. పనీర్ అనే ఒక పదార్థం ఉందని కూడా తెలీదు, సత్య ప్రమాణకంగా!

హైదరాబాద్‌లో మొదటివారమే అనుకుంటా, మెహిదీపట్నంలో యూనివర్సిటీ బస్‌కి టైం ఉందని బస్ స్టాప్‌లో ఉన్న ఇరానీ రెస్టారెంట్ కి వెళ్ళా. పేరు గుర్తు లేదు, తర్వాత కాలంలో చెప్పలేనన్ని గంటలు గడిపిన చోటు అది. కానీ అప్పటికి ఇరానీ రెస్టారెంట్ కాన్సెప్ట్ కూడా తెలీదు. నలుగురు కూర్చునే టేబుల్ మీద ఓ మూలకి కూర్చుని ఆర్డర్ చెయ్యడం కోసం చూస్తున్నా. ఓ ముగ్గురు అప్పుడే లోపలికి వచ్చి ఇంకెక్కడా చోటు లేక వచ్చి నేనున్న టేబుల్ మీద కూర్చు న్నారు. నేను కూర్చున్న టేబుల్ మీద నన్నడక్కుండా కూర్చోడమే చిరాకు తెప్పించే వ్యవహారం. ఏమన్నా అంటానికి భయం. వాళ్ళు మాట్లాడే హైదరాబాదీ అప్పటికీ అర్థమయ్యే అవకాశమే లేదు. బిక్కచచ్చి చూస్తున్నా.

ఈ లోపు 'ఛోటూ' వచ్చాడు టీ ఆర్డర్ తీసుకోడానికి. నాకు ఒక టీ అని చెప్పా. వాళ్ళు 'నీ ఒక్కనికి చెప్తవా తమ్మీ' అని 'దో చాయ్ దో ఎంప్టీ' గా ఆర్డర్ మార్చేశారు. అసలు అందులో నా అభిప్రాయానికి ఓ అవకాశం కూడా లేదు. అందునా నా ఒక్కడికే టీ చెప్పుకుని ఓ పరమ నీచకార్యానికి తలపడ్డానాయే, నాకు సంస్కారం నేర్పకుండా ఉండే అవకాశం లేదు. ఎవరో తెలీదు, నా పక్కన ఎందుకు కూర్చున్నారో తెలీదు, వాళ్ళతో కలిసి ఎందుకు ఆర్డర్ చెయ్యాలో తెలీదు. భయంభయంగా వచ్చిన టీ తాగేశాక, బిల్ ఎలా కట్టాలో తెలీదు. బస్ ఒచ్చే టైం అవడంతో లేచి డబ్బులు తీసి 'ఎంతండీ' అనడిగా. 'ఒక్కనికిస్తావురా బయ్' అన్నాడు నా వంక వింతగా చూస్తూ. వీళ్ళందరికీ నాతో పెట్టించే కుట్రా ఇదీ అనుకుంటూ, ఇంకా డబ్బులు తియదానికి జేబులో చెయ్యి పెట్టా. 'ఎల్లు తమ్మీ, నీ ఒక్కని చాయ్‌కి మేం ఇయ్యగల్లం' అని నా సమాధానం కోసం కూడా చూడకుండా వాళ్ళ మాటల్లోకి దిగిపోయారు.

వాళ్ళకి తెలియనిదేంటంటే, నాకు అది మొదటి పాఠం, హైదరాబాద్ ఆత్మని పట్టిచ్చే పాఠం. వాళ్ళు హిందువులో, ముస్లిములో నాకు తెలీదు. నేనెవర్నో వాళ్ళకి తెలిసే అవకాశం లేదు. కానీ నాతో మాట్లాడినప్పుడు మార్చిన భాష, నా బిల్లు కట్టిన తీరు, వాళ్ళకి కచ్చితంగా నా గురించిన అవగాహన వచ్చేసింది.

ఓ సంవత్సరమో ఎంతో గడిచిపోయింది. కాస్త అలవాటుపడిపోయా. ఓసారి ఇల్లందునించి హైదరాబాదుకి, ఖమ్మంలో ఏదో రైలు ఎక్కి వచ్చా. ఎనిమిందిటికి రావాల్సిన రైలు చాలా ఆలస్యమయింది. సికింద్రాబాదులో అయిదో నంబర్ ఎక్కి మెహిదీపట్నం చేరేసరికి పదో, పదకొండో దాటింది. యూనివర్సిటీ ఆఖరి బస్ తొమ్మిదిన్నరకి. బి.హెచ్.ఇ.ఎల్ వెళ్ళే ఆర్.టి.సి బస్ కూడా పదింటికనుకుంటా ఆఖరిది. మెహిదీపట్నం నించి హెచ్.సి.యుకి వెళ్ళే అవకాశం లేదు. ఏడుపొక్కటే తక్కువ. నడుచుకుంటూ ఫ్రెండ్‌కి ఫోన్ చేద్దామని ఇరానీ రెస్టారంట్ దగ్గరికి వెళ్తే షటర్ క్లోజ్ చేస్తున్నా డొకాయన. వెళ్ళి బతిమాలా, ఒక్క ఫోన్ చేసుకోనీండీ, యూనివర్సిటీ కెళ్ళలేను, మసాబ్ టాంక్‌లో ఉన్న ఫ్రెండ్ వాళ్ళింట్లో పడుకుంటా అని.

హైదరాబాద్‌లో మెలో డ్రామా ఉండదు (అది బెజవాడ సొంతం). నాకు పేరు తెలీని ఇంకో డ్రామా ఉంటుంది. ఆ మనిషి సరే అని గాని, కాదని గానీ అనలా. విన్నట్టు కూడా రెస్పాన్స్ లేదు. నిశ్శబ్దంగా షట్టర్ మూసేసి. ఓ చేతక్ స్కూటర్ దగ్గరికి నడిచి, దాన్ని స్టార్ట్ చేసి ఒక్కటే మాటన్నాడు. 'పీఛే బైటో'. సింపుల్!

స్కూటర్ వెళ్తున్నప్పుడడిగాడు. 'ఫ్రెండ్ ఇంట్లో ఉంటాడని నమ్మకమేమిటీ' అని.ఫ్రెండ్ ఇంటిదాకా వచ్చి, మా వాడు తలుపు తీశాక, వాడికి నన్ను అప్ప జెప్పి అప్పుడు ఆ మనిషి తన దారిన తాను పోయాడు. ఆ మనిషి ఎవరో, ఆ హోటల్ ఓనరో, పనోడో, హిందువో, ముస్లిమో తెలీదు. నేనెవరూ అని తను అడగలా. మా



ఫ్రెండ్ తలుపు తీయకపోతే ఆ మనిషి నా పూర్తి బాధ్యత తీసుకునే వాడు అని నాకు కచ్చితంగా తెలుసు.

నేను చాలా దేశాలు తిరిగాను, చాలా మంది సహాయాలు పొందాను. అన్నీ నాకు గుర్తున్నాయి. కానీ హైదరాబాద్‌లో ఉండే ఆ కాజువల్, అతి సహజమయిన సహజీవనం ఇంకోచోట నాకు తెలీదు. మొన్నోసారి భావనాని (మా అమ్మాయి) ఓల్డ్ సిటీకి తీసుకెళ్తే 'ఈ చిన్న రెస్టారెంట్లు భలే ఉన్నాయి, కరోనా లేకపోతే వెళ్లుండే వాళ్ళం' అంది. దానికి నేను చెప్పింది ఒకటే, 'నీ వల్ల కాదు ఈ వాతావరణంలో ఇమడడం. 'నా స్పేస్ ', 'ప్రైవసీ', 'నేను' లాంటివి వదల గలిగినప్పుడే ఇక్కడ కారు దిగు అని.'

ఈ నగరంలోనే మత కలహాలూ కూడా జరిగాయి ఆ రోజుల్లో. బాబ్రీ తర్వాత అన్నీ మూసేస్తే సవాలక్ష కష్టాలు పడి ఇళ్ళకు చేరాం. కానీ చిత్రమేమిటంటే, అందరం ఒకటే నమ్మేవాళ్ళం. మతకలహాలన్నీ రాజకీయ హత్యలేనని. ముఖ్యమంత్రి మారాల్సొచ్చినప్పుడల్లా హత్యలు జరిగేవి అని అందరికీ తెలిసిన సంగతే. ఎన్నిసో కాల్డ్ మత కలహాలు జరిగినా సామాన్య జనాల మధ్య నమ్మకాలు పోలేదు అని నేను చెప్తే నమ్మడానికి నువ్వు హైదరబాదీ అవ్వాల్సిందే! ఉదాహరణకి, అహ్మదాబాదోళ్ళు ఎన్ని జన్మలెత్తినా ఈ సంగతి అర్థం చెసుకోలేని నష్టజాతకులు. ఇప్పుడు ఈ హైదరాబాద్ మీద సర్జికల్ స్ట్రైక్ చేస్తారట. ఎవర్రా మీరు? మీరు ఉద్ధరించాలనుకున్న మతమే మీకు అర్థం కాలేదు. హైదరాబాద్ మీకు ఎప్పటికీ అర్థం కాదు.

నిజం చెప్పొద్దూ, ఇంతకు ముందు ఉన్న నమ్మకం ఇప్పుడు పోతోంది. హింస గెలుస్తోంది. కల్మషం గెలుస్తోంది. విషం ఉత్తరాది నించి కిందకి దిగుతోంది. హైదరాబాద్ డిఎన్ఎలో ఉన్న సహజమైన ప్రేమ దీన్ని తట్టుకుని నిలబడగలదా? చూడాలి. నాకు మూడు ప్రాంతాల మీద నమ్మకం, హైదరాబాద్‌లోని ప్రేమ, చెన్నయ్‌లోని మేధ, కేరళలోని సైద్ధాంతిక నిబద్ధత. ఈ దేశానికి మిగిలిన ఆఖరి మూడు ఆశలు అవి.

ఉత్తరాదినించి వచ్చిన ఈ దండయాత్రని ఈ మూడూ ఆపగలవా? •

- అక్కిరాజు భట్టిప్రోలు (ఫేస్‌బుక్ నుంచి)

రాష్ట్రాల అభివృద్ధిలో మనమెక్కడ?

తలసరి ఆదాయం, రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదలను చెప్పుకోవడమేగాక విద్య, వైద్య రంగం, రవాణా, శాంతి-భద్రతలలో అభివృద్ధి రావాలి. కానీ తెలంగాణ, కేరళ, గుజరాత్ రాష్ట్రాలను పరిశీలించినప్పుడు అభివృద్ధి అంటే ఏమిటో అర్థమవుతుంది. నవంబర్ 30న జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో రాష్ట్ర అభివృద్ధిని విశ్లేషించి అభివృద్ధి చేసేవారిని శాసన సభకు పంపించాలి. భ్రమలకు లోనై అభివృద్ధి నిరోధకులకు శాసన సభలకు పంపించడం ద్వారా ఎలాంటి ఫలితాన్ని ఆశించలేం. ఎన్నికలలో పోటీ చేస్తున్న సీపీఐ(ఎం) పార్టీ అభ్యర్థులను గెలిపించాలి.

గత 9 సంవత్సరాల నుండి జరిగిన అభివృద్ధి వల్ల దేశంలోని 29 రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలోకి వచ్చిందని పాలక పార్టీ నిరంతర ప్రచారం చేస్తున్నది. రూ.1.25 లక్షల తలసరి వార్షిక ఆదాయం నుండి రూ.3.12 లక్షలకు పెరిగినట్లు, తద్వారా రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.14 లక్షల కోట్లకు పెరిగి దేశంలోనే 7వ ర్యాంకుకు చేరినట్లు ఉత్సాహంగా ప్రకటించారు. రాష్ట్ర ఆదాయం పెరగడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఏటా పెరుగుతున్న ధరలను బట్టి రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుతుంది. వ్యవసాయం, పారిశ్రామిక రంగం, సేవారంగాలలో ఉత్పత్తి, ఉత్పాదకత పెరగాలి. కానీ, గత సంవత్సరం జరిగిన ఉత్పత్తికి ధరలు పెరగడం వల్ల పెరిగిన రాష్ట్ర స్థూల ఉత్పత్తిని లెక్కకట్టరాదు. వ్యవసాయ రంగంలో గత 3 సంవత్సరాలుగా అనుకూల వాతావరణాలు సంభవించడంతో పంటల వృద్ధి జరిగింది. 2014 నుండి 2018 వరకు కరువుల వల్ల ఉత్పత్తి పెరగలేదు. కానీ, 2018 నుండి 2022-23 మార్చి వరకు అనుకూల వాతావరణం సంభవించడంతో ఉత్పత్తి అనేక రెట్లు పెరిగింది. పారిశ్రామికంగా గత ఉత్పత్తిపై తగ్గింది. అనేక పరిశ్రమలు మూతపడ్డాయి. పారిశ్రామిక నిరుద్యోగుల సంఖ్య పెరిగింది. గతంలో ఉన్న పరిశ్రమల సంఖ్య తగ్గింది. సేవారంగంలోని పరిశ్రమలు కరోనా వల్ల చాలావరకు మూతపడ్డాయి. పట్టణాల్లో నిరుద్యోగం పెరిగింది. ప్రయివేట్ ఉద్యోగాలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, హోటల్ పరిశ్రమలు, వ్యాపారాలు, సినిమాలు, చిన్న పరిశ్రమలు లక్షల సంఖ్యలో మూతపడ్డాయి. పట్టణాల్లో నిరుద్యోగం పెరగడంతో గ్రామాలకు వలసలు వెళ్ళారు. అంతకు ముందే గ్రామాలలో ఉన్న నిరుద్యోగానికి వీరు తోడైనారు. మొత్తం రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య 30 లక్షలకు చేరినట్లు ప్రచారం జరుగుతున్నది. కానీ, ప్రభుత్వం 17 లక్షల మంది నిరుద్యోగులు మాత్రమే ఉన్నట్లు చెప్తున్నది. గత 10 సంవత్సరాలలో ఖాళీ ఉద్యోగాలను భర్తి చేయడంలో విఫలం కావడమే గాక, ఉపాధి కల్పనలో పూర్తిగా వెనుకబడింది. రాష్ట్రంలోని 42 ప్రభుత్వశాఖలకు ప్రణాళికలు రూపొందించకుండానే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వార్షిక ప్రణాళికలు, లక్ష్యాలు, కార్యక్రమాలు నిర్ణయించుకోవడం వలన ఉత్పత్తి, ఉత్పాదకత క్రమపద్ధతిలో పెరుగుతుంది. వ్యవసాయరంగంలో గత మూడేండ్లుగా ఎలాంటి ప్రణాళికలు లేవు. రైతులు మార్కెట్‌లో ఉన్న ధరల బట్టి పంటలు పండిస్తున్నారు. రాష్ట్ర సాగు విస్తీర్ణంలో 80శాతం వరి, పత్తి పంటలే వేస్తున్నారు. తృణధాన్యాలు, కూరగాయలు, పప్పులు, నూనెలు, హార్టికల్చర్ పంటల విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ఆహారోత్పత్తుల్లో మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణ నేడు పప్పులు, నూనెలు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, దిగుమతులు చేసుకుంటున్నాం. అవసరానికి మించి ఉత్పత్తి అవుతున్న వరి ధాన్యం, పత్తి అమ్మకంలో రైతులకు కనీస మద్దతు ధరలు లభించక పెట్టుబడికి నష్టపోతున్నారు. దీనికి తోడు వ్యవసాయ ఉపకరణాల పెరుగుదలకు అనుగుణంగా కనీస మద్దతు ధరలు పెరగకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ప్రస్తుతం సాగులోనున్న 20 లక్షల మంది కౌలు రైతులు ప్రభుత్వ విధానాల వల్ల తమ రెవెన్యూ హక్కులు కోల్పోయారు. పారిశ్రామిక ఉత్పత్తుల దిగుమతులు రాష్ట్రానికి భారీగా పెరిగాయి. విద్యుత్‌తో పనిచేసే పరికరాలు, విద్యుత్‌యేతర పరికరాల దిగుమతులు భారీగా సాగుతున్నాయి. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ కంపెనీలు పెద్దఎత్తున వచ్చినప్పటికీ అంతకన్న ఎక్కువ మంది నిరుద్యోగులు ఉత్పత్తి అవుతున్నారు. నిరుద్యోగుల పరిస్థితి గమనించి సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉద్యోగుల వేతనాలను తగ్గించడమో లేక ఉద్యోగాల నుండి తొలగించడమో జరుగుతున్నది. ఉత్పత్తి పరిశ్రమలు మూతపడుతున్నాయి. భవన నిర్మాణ రంగం, రియల్ ఎస్టేట్, పారిశుధ్యం, తాగునీరు, రహదారుల నిర్మాణం తదితర పనులకు ఆధునీకరణ యాంత్రీకరణ పెరగడంతో అంతకుముందున్న ఉద్యోగాలు ఊడిపోయాయి.



సారంపల్లి మల్లారెడ్డి
9490098666

ప్రభుత్వానికి బడ్జెట్ ఆదాయం రావడానికి మద్యం, భూ రిజిస్ట్రేషన్ చార్జీలు పెద్దఎత్తున పెంచారు. రాష్ట్ర బడ్జెట్ రూ. 2,90,296 కోట్లు (2023-24) కాగా, ఇందులో రూ. 40 వేల కోట్లు మద్యం నుండి (అడ్డాపన్ను, అమ్మకపు పన్నులు కలిపి) రాగా రూ.20 వేల కోట్లు రిజిస్ట్రేషన్ ద్వారా వస్తున్నది. రెవెన్యూ గ్రాంట్‌లు, నాన్ ట్యాక్స్ రెవెన్యూ (పన్నేతర ఆదాయం) ఆదాయంలో 20 శాతానికి మించి రావడం లేదు. మద్యం షాపులవారు గ్రామాల్లో బెల్ట్‌షాప్‌లను వేల సంఖ్యలో స్థాపించడం వల్లనూ, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ ప్రోత్సాహం వల్ల మద్యం అమ్మకాలు విస్తృతంగా పెరుగుతున్నాయి. ఫలితంగా నేరాలసంఖ్య కూడా పెరుగుతున్నది. 2018లో 1,26,058 నేరాలు జరుగగా 2021లో 1,58,809 నేరాలు జరిగినట్లు పోలీసు శాఖ నివేదికలో తెలిపారు. ఇందులో 80 శాతం నేరాలకే ఎఫ్ఐఆర్‌ను రిజిష్టర్ చేశారు. దళితులపై ఇసుక మాఫీయా దాడులు, కుల దుహంకార హత్యలు, బాలికల అమ్మకాలు, కుల బహి ష్కరణలు (బానిస సమాజ నేరాలు) పెరుగుతున్నాయి. ఫ్రెండ్లీ పోలీసు, షీటీంలు, సీసీ కెమెరాలు ఎన్ని ఉన్నప్పటికీ నేరాలను అదుపు చేయలేక పోతున్నారు. చాలా నేరాలు పాలకుల ఒత్తిడితో రిజిష్టర్ కాకుండానే రద్దు చేస్తున్నారు. రక్షణ లేని పరిస్థితి పెరుగుతున్నది.

అభివృద్ధికి ప్రధాన సూచికలు ఏమిటి ?

రాష్ట్రాభివృద్ధికి ప్రధాన సంకేతం విద్య, వైద్య సౌకర్యం అభివృద్ధి, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారి సంఖ్య తగ్గడాన్ని గమనంలోకి తీసుకుంటారు. పదేండ్లు గడిచినా విద్యరంగంలో మన అభివృద్ధి 66.4 శాతం నుండి 72.8 శాతానికి పెరిగినప్పటికీ మహిళల అక్షరాస్యతలో 53.7శాతం దాటలేదు. సమాజాభివృద్ధికి అత్యంత కీలకమైన విద్యాభివృద్ధిపై ప్రణాళిక లేకపోవడంతో ప్రాప్తకాలజ్ఞతగా అభివృద్ధి జరగమే తప్ప ప్రత్యేక పథకం ద్వారా అభివృద్ధి జరగడం లేదు. వంద శాతం అక్షరాస్యతతో కేరళ ఏనాడో ప్రథమ స్థానంలోకి వచ్చింది. మహిళల అక్షరాస్యతలో కేరళ 97.4 శాత సాధించింది. దేశంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారి సంఖ్యలో రాష్ట్రం 10వ స్థానంలో ఉంది. దారిద్ర్య నిర్మూలనలో కేరళ మొదటి స్థానంలో ఉంది. కుడుంబశ్రీ పేర గ్రామీణ ప్రాంతాలలోని మహిళలందరికీ ఉపాధి కల్పించారు. వారికి నైపుణ్య చొరవ కల్పించడానికి క్లాసులు పెట్టి బోధిస్తున్నారు. మన రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాలు ఉన్నప్పటికీ వాటి వలన ఆదాయం పొందుతున్నవారు నామమాత్రంగానే ఉన్నారు. ఈ సంఘాలను ఆకట్టుకుని అధిక వడ్డీలకు డబ్బులిచ్చి మహిళలను ఆత్మహత్యలకు గురిచేసే విధంగా మైక్రో ఫైనాన్స్ సంస్థలకు బలవుతున్నారు. కనీస వేతనాల అమలు లేకపోవడం వల్ల నిత్యావసర సరుకులు కొనలేని స్థితికి రాష్ట్ర ప్రజలు నెట్టపడ్డారు. కేరళలో కనీస వేతనం రూ.24,060 అమలు జరుగగా దిన

కేరళ - తెలంగాణ - గుజరాత్ నమూనా

వివరం	కేరళ	తెలంగాణ	గుజరాత్
జనాభా (కోట్లలో)	3.58	3.82	7.16
విద్య (శాతం)	100	72.8	96
మహిళల అక్షరాస్యత (శాతం)	97.4	53.7	73.5
సగటు వయస్సు (సంవత్సరాలు)	77	70.1	70
శిశు మరణాల రేటు (1000)	6	23	25
పేదరికం (ర్యాంకు)	1	10	14
దినకూలి (రూ.)	758	320	243
కనీస వేతనం (రూ.)	24,060	8,000	9,455
బడ్జెట్ వ్యయం (2023-24) రూ.కోట్లు	1,76,089	2,90,296	2,70,270
రెవెన్యూ లోటు (2023-24) (రూ.కోట్లు)	- 23,942	+4,882	+9,038
రాష్ట్ర స్థూల ఉత్పత్తి (ల.కో)	11.3	14	22.61
పారిశుధ్యం	99	30	74



కూలీ రూ.758లు ఇస్తున్నారు. జీవన ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నది. ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షా ప్రాతినిధ్యం వహిస్తున్న గుజరాత్ రాష్ట్రం కూడా ఏ ఒక్క అంశంలోనూ కేరళలో అధిగమించలేదు. అయినా గుజరాత్ మోడల్ అంటూ ప్రచారం చేస్తున్నారు. తెలంగాణలో బాగా అభివృద్ధి చెందినట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఆర్థికవేత్తలు విమర్శనాత్మకంగా అనేక నివేదికలు రూపొందించారు. అయినా వాటిని పాలకులు పట్టించుకోవడంలేదు. దళితులు, గిరిజనులు, బీసీలు, మైనార్టీలకు, మహిళలకు కేటాయించిన బడ్జెట్ నిధులు ఉప ప్రణాళిక నిధులు 60శాతం కూడా ఖర్చు కావడంలేదు. ప్రస్తుతం కేటాయించిన నిధులేగాక అదనపు నిధులు కేటాయించి వ్యయం చేయాలి. అప్పుడే ఈ రంగాలలోని ప్రజలు అభివృద్ధి అవుతారు.

తలసరి ఆదాయం, రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదలను చెప్పుకోవడమేగాక విద్య, వైద్య రంగం, రవాణా, శాంతి-భద్రతలలో అభివృద్ధి రావాలి. కానీ తెలంగాణ, కేరళ, గుజరాత్ రాష్ట్రాలను పరిశీలించినప్పుడు అభివృద్ధి అంటే ఏమిటో అర్థమవుతుంది. నవంబర్ 30న జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో రాష్ట్ర అభివృద్ధిని విశ్లేషించి అభివృద్ధి చేసేవారిని శాసన సభకు పంపించాలి. భ్రమలకు లోనై అభివృద్ధి నిరోధకులకు శాసన సభలకు పంపించడం ద్వారా ఎలాంటి ఫలితాన్ని ఆశించలేం. ఎన్నికలలో పోటీచేస్తున్న సీపీఐ(ఎం) పార్టీ అభ్యర్థులను గెలిపించాలి. ప్రజల తరపున శాసన సభలో మాట్లాడడానికి, ప్రశ్నించడానికి, సమస్యల పరిష్కారానికి కృషి చేసే వారు చట్టసభల్లో ఉండాలి. అప్పుడే రాష్ట్రాభివృద్ధిని చూడగలుగుతాం. •

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	62,560	-	-
22 క్యారెట్లు	57,350	-	-
కిలో వెండి	81,500	-	-



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 84
రిటైల్ (లైవ్)	రూ. 106
స్కిన్‌తో	రూ. 154
స్కిన్‌లెస్	రూ. 175

బీఆర్ఎస్, బీజేపీలపై ప్రజా వ్యతిరేకత

ఆకాంక్షలు నెరవేర్చలేదని ఆగ్రహం

- ప్రభుత్వ విద్య, వైద్యం విధ్వంసంతో జీవితాలు ఛిద్రం
- కాంగ్రెస్, సెక్యులర్ శక్తుల వైపు మొగ్గు
- ఓటర్ చైతన్య యాత్ర ముగింపు కార్యక్రమంలో నాయకులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్, బీజేపీలపై ప్రజా వ్యతిరేకత ఎక్కువగా ఉందని జాగో (మేలుకో) తెలంగాణ, తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక (టీఎస్‌డీఎఫ్) నాయకులు తెలిపారు. జాగో తెలంగాణ, టీఎస్‌డీఎఫ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 26న హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్ నుంచి ప్రారంభమైన ఓటరు చైతన్య యాత్ర 28 జిల్లాల్లోని 64 నియోజకవర్గాల్లో 198 సమావేశాలు నిర్వహించింది. మంగళవారం యాత్ర ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాకు యాత్ర విశేషాలను వెల్లడించారు.

జాగో (మేలుకో) తెలంగాణ కన్వీనర్ ఆకునూరి మురళి మాట్లాడుతూ యాత్రలో కొన్ని చోట్ల బీఆర్ఎస్‌కు చెందిన పోగరుబోతులు అడ్డగించేందుకు ప్రయత్నిస్తే ప్రజలు వారిని నిలవరించారని తెలిపారు. కేసీఆర్ కుటుంబం, మంత్రులు, ఎమ్మెల్యేల అవినీతిని, భూకబ్జాలు ఇసుక, లిక్కర్ దందాలు, వేల కోట్ల రూపాయలను ప్రజలు గుర్తించారని తెలిపారు. 35 లక్షల మంది నిరుద్యోగులు, 26 లక్షల మంది ఇల్లు రానివారితో పాటు విద్యాభ్యాసం చేస్తున్న 60 లక్షల మంది విద్యార్థుల తల్లిదండ్రులు, దళిత బంధు రాని దళితులు, ఐటీడీఏ ధ్వంసం చేసినందుకు గిరిజనులు బీఆర్ఎస్ పట్ల వ్యతిరేకంగా ఉన్నారని తెలిపారు. అదే విధంగా 20 లక్షల మంది కౌలు రైతులు, 40 లక్షల మంది చిన్న, సన్నకారు రైతుల కుటుంబాలకు తమకు మేలు జరగలేదనే భావనలో ఉన్నారని తెలిపారు.

జాగో (మేలుకో) తెలంగాణ చైర్మెన్ జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ మతోన్మాద బీజేపీని, అవినీతి బీఆర్ఎస్‌లను ఓడించాలని పిలుపునిచ్చారు. నాయకులు కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, జనసేన పార్టీ కేవలం బీజేపీ ఆదేశాలతో బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. కూకట్‌పల్లిలో బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు బీజేపీ జన సేనకు టికెట్ కేటాయించిందని చెప్పారు. అదే విధంగా ఎంఐఎం జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు బరిలో నిలిచిందన్నారు. ప్రొఫెసర్ పద్మజా షా మాట్లాడుతూ, మద్యం ఏరులై పారుతున్న తీరు పట్ల బీఆర్ఎస్‌పై గ్రామీణ మహిళలో తీవ్ర వ్యతిరేకత కనిపించిందని చెప్పారు. ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలపై నమ్మకం లేనికేసీర్ మూటలతో గెలిచేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో ప్రతి 25 ఏండ్లకు ఒక ఉద్యమం ప్రారంభమైందని తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, ప్రత్యేక తెలంగాణ పోరాటం, నక్సలైట్ ఉద్యమం, తిరిగి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం వచ్చిందని గుర్తుచేశారు. ప్రస్తుతం జాగో తెలంగాణ ఉద్యమం ప్రారంభమైందని చెప్పారు. దళిత బహుజన ఫ్రంట్ నాయకులు శంకర్ మాట్లాడుతూ దళిత బంధు ఇవ్వకపోవడం, మూడెకరాల భూమి పంచకపోవడం, భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించకపోవడంతో దళితులు బీఆర్ఎస్‌ను ఓడించాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. స్త్రైబాబా మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు వక్ఫ్ ఆస్తులను కబ్జా చేశారని ముస్లింలు గ్రహించారనీ, వారిలో అత్యధికులు బీఆర్ఎస్‌ను వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. సోగరా బేగం మాట్లాడుతూ గత ఎన్నికల్లో కాంగ్రెస్‌లో గెలిచి బీఆర్ఎస్‌లోకి వెళ్లిన 12 మంది ఎమ్మెల్యేలకు డిపాజిట్లు రాకుండా ఓడించాలని ప్రజలను కోరారు. కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావును గెలిపించాలని కోరారు.

> బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ విద్య, వైద్యం విధ్వంసమై సామాన్యులపై భారం పడి చితికిపోయారనీ, అందుకే ప్రజలు బీఆర్ఎస్‌ను ఓడించాలని
>
> **విద్య, వైద్యం విధ్వంసం ... అందుకే అలా డిసైడ్ అయ్యారు...**
>
> నిర్ణయించుకున్నట్టు సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.గోవర్ధన్ తెలిపారు. రైతుబంధు వేసినా.... మద్యం అమ్మకాల పేరుతో తిరిగి లాక్కుంటున్నారనే భావనలో మహిళలున్నారని చెప్పారు. ఈ కార్యక్రమానికి జాగో (మేలుకో) తెలంగాణ కమిటీ సభ్యులు నైనాల గోవర్ధన్ అధ్యక్షత వహించగా, హన్మేష్, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు ఆగదు :దాసోజు శ్రవణ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం కేసీఆర్ కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు రైతుబంధు ఆగదని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ తెలిపారు. కేసీఆర్ స్వదస్తూరితో రైతుబంధు భరోసా పత్రాన్ని ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుబంధు, రైతు రుణమాఫీ, రైతు బీమా, గిట్టుబాటు ధరలు, పుష్కలంగా సాగునీరు, 24 గంటల ఉచిత కరెంట్, కల్తీ లేని విత్తనాలు, రైతు వేదికలు.. ఇలా అద్భుతమైన రీతిలో రైతులకు అండగా ఉంటూ వారి జీవితంలో వెలుగులని నింపి వ్యవసాయాన్ని పండగలా మార్చిన ఏకైక నాయకుడు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అని కొనియాడారు. రైతుల జీవితాలు బాగుపడుతుంటే చూసి ఓర్వలేని రాబందు రెడ్డిగా మారిన రెవెంత రెడ్డి, కాంగ్రెస్ పార్టీ, బిజేపీతో కుమ్మక్కై ఎన్నికల కమీషన్‌పై ఒత్తిడి తెచ్చి నిలిపివేయించారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మొత్తానికే రైతుల పాలిట శాపంగా మారిందని ఆరోపించారు. 24 గంటల కరెంట్ ఇస్తున్న కేసీఆర్‌ని కాదని 3 గంటలు కరెంట్ చాలని రైతుల జీవితాలనీ, వ్యవసాయాన్ని మళ్ళీ అయోమయం లోకి నెట్టేసే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు నిలిపేయాలనే కుట్రను రేవంత్ రెడ్డి చేస్తున్నారని ఆరోపించారు. ఒకసారి భూయజమానికీ, మరోసారి కౌలురైతుకు ప్రతి ఎకరాలకు రూ.15 వేలు ఇస్తామని మ్యానిఫెస్టోలో పెట్టి వారి మధ్య పంచాయితీ పెట్టాలని చూస్తున్నారని తెలిపారు. రైతులు, కౌలు రైతులు ఘర్షణ పడుతున్నందున నిలిపేస్తామని చెప్పే ఫ్యూడల్ మనస్తత్వం రేవంత్ రెడ్డిదని దుయ్యబట్టారు. రైతుబంధు పథకాన్ని ఆపాలని కుట్ర చేస్తున్న కాంగ్రెస్, రేవంత్ రెడ్డికి కర్రుకాల్చి వాత పెట్టాలని ఆయన కోరారు.

బీజేపీకి బీ-టీమ్ ఎంఐఎం

- కేసీఆర్, ఒవైసీపై ఒక్క కేసైనా పెట్టారా..
- కేంద్రం తెచ్చిన చట్టాలకు మద్దతు ఇచ్చారు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- నాంపల్లి బజార్‌ఘాట్‌లో సభకు ఆటోలో వచ్చిన రాహుల్



నవతెలంగాణ- సుల్తాన్‌బజార్

బీజేపీకి ఎంఐఎం బీ టీమ్‌గా పని చేస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్‌ను దెబ్బ తీయాలనే ఉద్దేశంతోనే మజ్లిస్ పోటీ చేస్తోందన్నారు. ఎంఐఎం అభ్యర్థులు ఎక్కడ పోటీ చేయాలో బీజేపీ నిర్ణయిస్తుందని ఆరోపించారు. హైదరాబాద్ నాంపల్లిలోని బజార్ ఘాట్‌లో నిర్వహిం చిన ఎన్నికల సభకు రాహుల్‌గాంధీ ఆటోలో వచ్చారు. భద్రతా వాహనాలను ముందు పంపించి ఓ సామాన్యుడి మాదిరిగా ఆటోలో సభా వేదిక వద్దకు చేరుకున్నారు.

అనంతరం రాహుల్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఇప్పటివరకు నిరంకుశ ప్రభుత్వం ఉందని, డిసెంబర్‌లో ప్రజల ప్రభుత్వం వస్తుందన్నారు. కాళేశ్వరం మొదలుకొని అన్ని ప్రాజెక్టుల్లోనూ అవినీతి రాజ్యమేలిందన్నారు. భారత్ జోడో యాత్ర ద్వారా ప్రేమతో కూడిన దేశాన్ని నిర్మించేందుకు చేసిన ప్రయత్నానికి ఎంతో ఆదరణ లభించిందని తెలిపారు. ఈడీ, సీబీఐ, ఐటీ పేరుతో 24 గంటలు అధికారులను, ఏజెన్సీలను తన వెంటే ఉంచి దేశంలోని వివిధ రాష్ట్రాల్లో తనపై 24 కేసులు నమోదు చేశారని చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఆర్ఎస్ఎస్ కలిసి దేశంలో కోపం, ద్వేషాన్ని పెంపొందించి మతతత్వ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు.

కేంద్రం ప్రభుత్వం అసదుద్దీన్ ఒవైసీ, సీఎం కేసీఆర్‌పై ఏదైనా కేసు పెట్టిందా? విచారణ జరిపారా.. ఉంటే చూపించమని ప్రశ్నించారు. వీరంతా బీజేపీకి మద్దతుదారులుగా ఉంటూ రైతు చట్టాలు, నోట్ల రద్దు, జీఎస్టీ విషయంలో కలిసి కట్టుగా మద్దతు ఇచ్చినట్టు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి లక్ష కోట్ల ఖర్చును చూపించి తెలంగాణ ప్రజల డబ్బులు దండుకున్న వ్యక్తి కేసీఆర్ అని ఆరోపించారు. ధరణి పోర్టల్ ద్వారా 20 లక్షల మంది భూములను లాక్కున్న ఘనత కేసీఆర్‌దేనన్నారు. ప్రజల నుంచి లాక్కున్న డబ్బులు మొత్తం త్వరలో కట్టిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాదులో మెట్రో, ఎయిర్‌పోర్ట్, ఐటీసీటీ నిర్మించింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని చెప్పారు. నాంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి మాట్లాడుతూ... ఎంఐఎం ముస్లింల అభివృద్ధి కోరుకోవడం లేదన్నారు. నాంపల్లిలో ఓటమి భయంతో ప్రతి ఇంటికీ ఒవైసీ తిరుగుతున్నారని చెప్పారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే నాంపల్లిని అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు.

కథంతా ఈరోజే...

(మొదటిపేజీ తరువాయి)

తటస్థ ఓటర్లను తన బుట్టలో వేసుకునేందుకు కోటాను కోట్లను అది గుమ్మరించనుందని సమాచారం. వీలైతే రూ.2 వేలు లేదంటే రూ.5 వేల వరకైనా పంపిణీ చేయటం ద్వారా వారి ఓట్లను తన ఖాతాలో వేసుకునేందుకు ఆ పార్టీ వ్యూహం రచించిందని తెలుస్తోంది. మరోవైపు చీరెలు, సారెలు, కుంకుమ భరిణెలు, ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు షరా మామూలుగా జిల్లాలు, అక్కడి నుంచి నియోజకవర్గాలకు ఇప్పటికే తరలిపోయాయి. బుధవారం నాటికి సంబంధించిన పంపకాలకు అదనంగా ఈసారి రెండు రోజుల ముందు కూడా అవన్నీ పూర్తయ్యాయి. ముందు జాగ్రత్తగా మంగళవారం నాడే వార్డుల వారీగా నగదు, మద్యం పంపకాలు జరిగాయి. ఖమ్మంతోపాటు పలు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గాల్లో సైతం ఓటుకు రూ.2వేల చొప్పున పంపిణీ చేసినట్టు వినికిడి. గ్రామాల్లో కుటుంబాలు, సంఘాల వారీగా..పట్టణాల్లో అపార్టుమెంట్లు, కాలనీల వారీగా ఈ పంపకాలు పూర్తయినట్టు సమాచారం. ఈ రకంగా ప్రచార పర్వం పరిసమాప్తం కావటంతో రాజకీయ పార్టీలన్నీ ఇప్పుడు పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టాయి. వివిధ పార్టీల గెలుపోటములను ఇది కూడా తీవ్ర ప్రభావం చూపనుంది.

గెలుపెవరిది ?

సంక్షేమ పథకాలపై గులాబీ ఆశ

- ఆరు గ్యారంటీలపై హస్తం ధీమా
- చేతులెత్తేసిన బీజేపీ
- రైతుబంధు ఎవరి కొంప ముంచనుంది
- అంతు పట్టని జనం నాడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఎన్నికలు యుద్ధ రంగాన్ని తలపిస్తున్నాయి. సూటిపోటి మాటలు ఘాటైన విమర్శల నేపథ్యంలో ఉద్వేగ భరితమైన వాతావరణం నెలకొంది. తమ మ్యానిఫెస్టోలను ఏ కరువు పెడుతూనే ఒకరిపై ఒకరు మాటల తూటాలను పేల్చుకున్నారు. షెడ్యూల్ ప్రకటించినప్పటినుంచి రాజకీయ పార్టీలు గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. సంక్షేమ పథకాలపై అధికార బీఆర్ఎస్ పార్టీ ఆశలు పెట్టుకుంటే, ఆరు గ్యారెంటీలు, ప్రభుత్వ వ్యతిరేక ఓటుపై హస్తం ధీమాగా ఉంది. బీసీ ముఖ్యమంత్రి, ఎస్సీ వర్గీకరణ అంటూ కొంత హడావిడి చేసిన బీజేపీ తాజాగా చేతులెత్తేసిందని వార్తలు వినిపిస్తున్నాయి. ముచ్చటగా మూడోసారి అధికారం దక్కించుకొని హ్యాట్రిక్ కొట్టాలని బీఆర్ఎస్, పూర్వ వైభవం తీసుకురావాలని కాంగ్రెస్ నేతలు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి కాలికి బలపం కట్టుకుని రాష్ట్రం చుట్టి వచ్చారు. సభలు, సమావేశాలు, రోడ్‌షోల ద్వారా ప్రచారాన్ని హోరెత్తించారు.. ప్రత్యేక హెలికాప్టర్లను ఏర్పాటు చేసుకుని నేతలు సుడిగాలి పర్యటనలు చేశారు. ఎన్నికల చివరి క్షణంలో రైతుబంధు రూపంలో వచ్చిన పీఠముడి ఎవరి కొంపముంచనుందో తెలియని పరిస్థితి నెలకొంది. డబ్బు, అధికారం, కులం, తదితర అంశాలు ప్రాతిపదికగా హోరాహోరీగా సాగుతున్న ఎన్నికల సంగ్రామంలో ఓటర్లు ఎవరిని కనికరిస్తారో డిసెంబర్ 3న తేలనుంది. ఈ ఎన్నికల్లో సీపీఐ(ఎం) 19 స్థానాల్లో పోటీ చేస్తున్నది. బూర్జువా పార్టీలకు భిన్నంగా ప్రచారం నిర్వహించింది.

96 సభల్లో పాల్గొన్న కేసీఆర్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌అక్టోబర్ 15 నుంచి నవంబర్ 28 సాయంత్రం ప్రచారం ముగిసే సరికి 96 ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్నారు. ప్రత్యర్థి పార్టీలకు సవాళ్లు విసురుతూ తనదైన శైలిలో ఓటర్లను ఆకర్షించారు. 60 ఏళ్లలో జరగని అభివృద్ధి పదేళ్లలో చేసి చూపించామని ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వాలకు తమ ప్రభుత్వ పాలనకు తేడా గుర్తించాలని ప్రతి సభలో కేసీఆర్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తమదైన శైలిలో ప్రచారాన్ని పరుగెత్తించారు.

అగ్ర నేతనే అండగా అన్నీ తానై నడిపిన రేవంత్

టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ లను ప్రజలకు వివరిస్తూ, పదేళ్లలో బీఆర్ఎస్ పార్టీ తెలంగాణకు చేసిందేమిలేదని తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. అసంతృప్తులను బుజ్జగిస్తూ, ప్రచారంలో అభ్యర్థులకు తగిన సూచనలు, సలహాలు ఇస్తూ అన్ని తానై నడిపించారు. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ నాలుగు సార్లు రాష్ట్రంలో పర్యటించారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు ఒక అవకాశం ఇవ్వాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగ యువత, విద్యార్థులు, మహిళలతో రచ్చబండ మీటింగ్‌లు పెట్టి తనదైన శైలిలో ఓటర్లను ఆకట్టుకున్నారు. ప్రియాంక గాంధీ సభలు, సమావేశాలు, రోడ్‌షోలతో ప్రజలతో మమేకమయ్యారు. ప్రజల నుంచి కూడా కాంగ్రెస్ ప్రచార సభలకు మంచి స్పందన లభించినట్టు తెలుస్తోంది. ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, డీకే శివకుమార్, మాణిక్ ఠాగూర్ తదితర కాంగ్రెస్ పాలిత రాష్ట్రా ముఖ్యమంత్రులు తమ వాగ్ధాటితో ఓటర్లను ఆకర్షించారు. కర్ణాటక సక్సెస్ ఫార్ములాను తెలంగాణలో అమలు చేసేందుకు కాంగ్రెస్ అస్త్ర శస్త్రాలను సంధించింది.

చేతులెత్తేసిన బీజేపీ

తెలంగాణలో పాగా వేసేందుకు భారతీయ జనతా పార్టీ బీసీ ముఖ్యమంత్రి, ఎస్సీ వర్గీకరణ నినాదాన్ని ఎత్తుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మూడు భారీ బహిరంగ సభలతో పాటు పలు రోడ్ షోలు నిర్వహించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జాతీయ అధ్యక్షుడు నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తదితర నేతలు ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు అస్త్ర శస్త్రాలు సంధించారు. దక్షిణాదిలో కాంగ్రెస్ బలపడితే పార్లమెంట్ ఎన్నికలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని భావించిన బీజేపీ చివరి క్షణంలో చేతులెత్తేసి బీఆర్ఎస్‌కు లోపాయికారిగా మద్దతు ప్రకటించినట్లు తెలుస్తోంది. ఎన్నికలకు రెండు రోజుల ముందు రైతుబంధు రూపంలో వచ్చిన చిక్కుముడి కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మెడకు చుట్టుకుంది. కాంగ్రెస్ ఫిర్యాదుతోనే ఎన్నికల కమిషన్ రైతు బంధును ఆపిందని బీఆర్ఎస్ అంటే, మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యలతోనే రైతుబంధు ఆగిపోయిందని కాంగ్రెస్ ఎదురు దాడికి దిగింది. రైతుబంధు ఆగడానికి మీరంటే మీరు కారణమని కాంగ్రెస్ బీఆర్ఎస్‌లు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నాయి.

ఈ నేపథ్యంలో రైతుబంధు ఉపద్రవం ఎవరి కొంపముంచనుందో అనే భయం రెండు పార్టీల్లో నెలకొంది. మరో 24 గంటల్లో పోలింగ్‌ల ప్రారంభం కానుండగా గెలుపు తమదంటె తమదని, సర్వేలన్నీ తమకే అనుకూలంగా ఉన్నాయని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మైండ్ గేమ్ ఆడుతున్నాయి. 80 శాతం ఓటింగ్ దాటితే అధికార పార్టీకి నష్టమని, అంతకంటె తక్కువగా నమోదయితే కాంగ్రెస్‌కు నష్టమనే వాదన కూడా తెరపైకి వస్తోంది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు, పోల్ మేనేజ్ మెంట్ కూడా గెలుపోటములను ప్రభావితం చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. తాజా రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో జనం నాడి అంతుపట్టకుండా ఉంది.

ఉలిక్కిపడ్డ భద్రాచలం ఏజెన్సీ

- ఎన్నికలు బహిష్కరిస్తూ లారీని దగ్ధం చేసిన మావోయిస్టులు
- బీఆర్ఎస్, బీజేపీలకు ఓటేయొద్దని విస్తృత ప్రచారం



నవతెలంగాణ-చర్ల

ఎన్నికలకు 36 గంటల ముందు రాష్ట్రం లో మావోయిస్టులు అలజడి సృష్టించారు. ఈ ఎన్నికలను బహిష్కరిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం పూసుగుప్ప అటవీ ప్రాంతంలో ఓ లారీని మావోయిస్టులు దగ్ధం చేశారు. ఈ ఘటనతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. చర్లకు చెందిన కిషోర్ అనే వ్యక్తికి చెందిన ఏపీ 37 టీవి 6568 నెంబర్ గల లారీని ధాన్యం అన్ లోడింగ్ నిమిత్తం పూసుగుప్పకు వెళ్తున్న సమయంలో ఈ సంఘటన జరిగింది. లారీలో ఉన్న ధాన్యాన్ని కిందకు దింపించి లారీ ట్యాంకర్ పగల గొట్టి డీజిల్ పోసి లారీని మావోయిస్టులు తగుల బెట్టారు. రెండు సీఆర్పీఎఫ్ క్యాంపులకు మధ్యలో ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న సీఆర్పీఎఫ్ బెటాలియన్ జవాన్లు ముమ్మర తనిఖీలు చేస్తూ అడవిని జల్లెడ పడుతున్నారు. పోలీస్ అధికారులు పరిస్థితిని సమీక్షిం చారు. అటవీ ప్రాంతంలో భయానక వాతావరణం నెలకొంది. కాగా నాలుగు రోజుల క్రితమే ఎన్నికలను బహిష్కరించాలంటూ బీఆర్ఎస్, బీజేపీలకు ఓటు వేయొద్దని మావోయిస్టులు బ్యానర్లు కట్టి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

మీరు నా గుండెకు చాలా దగ్గరగా ఉంటారు

- మార్పు కోసం కాంగ్రెస్‌కు ఓటేయండి
- తెలంగాణ ప్రజలకు సోనియా గాంధీ సందేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రియమైన సోదర సోదరీమణులారా అంటూ తెలంగాణ ప్రజలకు ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ మంగళవారం ఓ వీడియో సందేశం పంపారు. 'నేను మీ దగ్గరకు రాలేకపోతున్న. కానీ మీరు నా గుండెకు చాలా దగ్గరగా ఉంటారు. నేను ఈ రోజు మీకు ఒక విషయం చెప్పాలనుకుంటున్న. తెలంగాణ అమరవీరుల స్వప్నాలు పూర్తి అవడం చూడాలనుకుంటున్న. నేను మనస్పూర్తిగా కోరుకుంటున్న దొరల తెలంగాణను ప్రజల తెలంగాణగా మనమందరం కలిసి మార్చాలి. మీ కలలు సహకారమవ్వాలి. మీకు మంచి ప్రభుత్వం లభించాలి. నన్ను సోనియమ్మ అని పిలిచి నాకు చాలా గౌరవం ఇచ్చారు. ఈ ప్రేమ, అభిమానాలకు నేను ఎప్పటికి మీకు రుణపడి ఉంటాను. తెలంగాణ సోదరులు, అమ్మలు, బిడ్డలకు నా విన్నపం. మార్పు కోసం కాంగ్రెస్‌కు ఓటేయండి. మార్పు కావాలి.కాంగ్రెస్ రావాలి' సందేశంలో పేర్కొన్నారు.

ఇందిరమ్మ రాజ్యం కోసం...కాంగ్రెస్‌ను గెలిపించండి
తెలంగాణ ప్రజలకు రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

'60 సంవత్సరాల పోరాటం..వందలాది తెలంగాణ బిడ్డల త్యాగాల పునాదుల మీద ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం.తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్‌ను పదేండ్లుగా సీఎంను చేస్తే, తెలంగాణ రాష్ట్రాన్ని పూర్తిగా విధ్వంసం చేసి.. మూడోసారి ఏలాలని కోరుకుంటున్నరు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో ఒక మార్పు తీసుకొచ్చి, రాష్ట్రాన్ని పునర్నించుకోవడానికి మీరందరూ నడుం బిగించాలి. 30 లక్షల మంది తెలంగాణ నిరుద్యోగ యువకులు...ఏ ఆకాంక్షల కోసం తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నరో అవి నెరవేర్చుకోవడానికి, సంపూర్ణంగా కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికి, సోనియమ్మ నాయకత్వంలో ఏర్పడబోయే ఇందిరమ్మ రాజ్యమే మన సమస్యలకు పరిష్కారం.మీరందరూ కదిలి వచ్చి కాంగ్రెస్ పార్టీని గెలిపించాల్సిందిగా కోరుకుంటున్నాను'.అంటూ టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.ఇదిలా ఉండగా 63 నియోజకవర్గాలు, 87 సభల్లో రేవంత్ పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనకు చరమగీతం పాడుదాం

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మోసపూరిత వాగ్దానాలతో పదేండ్లపాటు రాష్ట్ర ప్రజలను విద్యార్థులు, నిరుద్యోగులను మోసం చేసిన బీఆర్ఎస్ పార్టీని గద్దెదించే సమయం ఆసన్నమైందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాలని విద్యార్థులు, యువకులకు వారు పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు డబ్బుల ద్వారా ప్రజలను కొనడానికి సిద్ధమయ్యారని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనేక ప్రలోభాలకు తెర లేపుతున్నారనీ, ఉద్యోగాలివ్వకుండా ప్రశ్నాపత్రాలు లీకేజీ చేసి 30 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలను చిన్నాభిన్నం చేశారని విమర్శించారు. విద్యార్థుల చదువులకు నిధులివ్వకుండా, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకుండా వారి జీవితాలతో చెలగాటమాడారని తెలిపారు. బీఆర్ఎస్‌కి ఓటు వేస్తే మళ్లీ ఐదేండ్లు మోసపోతామని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

నేడు, రేపు వైన్ షాపులు బంద్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల నేపథ్యంలో నేడు రేపు మద్యం షాపులు, బార్లు, బార్ అండ్ రెస్టారెంట్లను మూసి వేయనున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 28 సాయంత్రం 5 గంటల నుంచి 30 సాయంత్రం 5 గంటల వరకు లిక్కర్ షాపులు తెరుచుకోవు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం విక్రయాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్టు అబ్కారి శాఖ ప్రకటించింది.. అక్రమ మద్యం తరలింపుపై ఎక్సైజ్ శాఖ, పోలీసుల సమన్వయంతో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తోంది.. ఎక్కడికక్కడ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలు తనిఖీ చేస్తూ సరైన పత్రాలు లేని మద్యంను సీజ్ చేస్తున్నారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో డిసెంబర్ 3న ఉదయం 6 గంటల నుంచి లెక్కింపు పూర్తయ్యే వరకూ ట్రై కమిషనరేట్ల పరిధిలో మద్యం దుకాణాలు, బార్లను మూసి వేయనున్నారు. స్టార్ హోటళ్లు, పబ్బులు, క్లబ్బుల్లోనూ మద్యం సరఫరాను అనుమతించరు. ఎన్నికల ముగిసేవరకు నగరంలో144 సెక్షన్ విధిస్తున్నట్టు సీపీ సందీప్ శాండిల్య తెలిపారు. ఐదుగురికి మించి గుమ్మిగడితే చర్యలు తప్పవని. బార్లు, వైన్ షాపులు, పబ్బులు మూసివేయాలని సీపీ ఆదేశాలు జారీ చేశారు

నేడు, రేపు విద్యాసంస్థలకు సెలవు

- ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బుధ, గురువారాల్లో విద్యాసంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. ఈ మేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్‌తోపాటు అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల పోలింగ్ జరగనున్న విషయం తెలిసిందే. హైదరాబాద్ నగరంతోపాటు రాష్ట్రంలోని పలు విద్యాసంస్థల్లో పోలింగ్ కేంద్రాలను ఎన్నికల కమిషన్ అధికారులు ఏర్పాటు చేశారు. బుధవారం ఆయా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని అధికారులు తరలించనున్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో పోలింగ్ కేంద్రాలున్న అన్ని విద్యాసంస్థలకూ బుధ, గురువారాల్లో రెండు రోజులపాటు సెలవులు వర్తించనున్నాయని తెలిపారు.

బీఆర్ఎస్‌కే మా మద్దతు..

- తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మోతుకూరి యాదయ్య మంగళవారం ఒక ప్రకటనలో తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో సుమారు 6 లక్షల మంది విద్యార్థులు గురుకులాల్లో విద్యను అభ్యసిస్తున్నారనీ, 12 లక్షల మంది తల్లిదండ్రులు ఓటర్లు ఉన్నారని వీరంతా బీఆర్ఎస్‌కు మద్దతు తెలపాలని కోరారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు 268 మాత్రమే ఉన్న గురుకులాల సంఖ్య ప్రస్తుతం 1,056కు పెరిగిందని తెలిపారు.రాబోయే రోజుల్లో నియోజక వర్గానికొక గురుకులం ఏర్పాటు చేస్తామంటూ సీఎం కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో ఆ పార్టీకి మద్దతివ్వాలని విజ్ఞప్తి చేశారు.

చంద్రబాబుకు సుప్రీం నోటీసు

డిసెంబర్ 8లోగా కౌంటర్ దాఖలు చేయండి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

టీడీపీ అధినేత ఎన్.చంద్రబాబు నాయుడుకి అత్యున్నత న్యాయస్థానం నోటీసులు ఇచ్చింది. బెయిల్ రద్దు పిటిషన్‌పై డిసెంబర్ 8లోగా రాత పూర్వకంగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. అలాగే స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో 17 ఏపై తీర్పు వచ్చిన తరువాత చంద్రబాబు బెయిల్ రద్దు కేసు వింటామని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుకు హైకోర్టు బెయిల్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బేలా ఎం. త్రివేది, జస్టిస్ సతీష్ చంద్రశర్మలతో కూడిన ధర్మాసనం విచారించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ వాదనలు వినిపిస్తూ చంద్రబాబుకు హైకోర్టు విధించిన బెయిల్ షరతులను పొడిగించా లని కోర్టును కోరారు. అలాగే "ఈ కేసు గురించి పబ్లిక్ డొమైన్‌లో ఎటువంటి ప్రకటన చేయకూడదు" అని అన్నారు. వెంటనే చంద్రబాబు తరఫు న్యాయ వాది సిద్దార్థ అగర్వాల్ జోక్యం చేసుకుని అత్యున్నత న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న అంశాలపై ఆ శాఖ అధికారులు ఇప్పటికీ బహిరంగ ప్రకటనలు చేస్తూనే ఉన్నారని తెలిపారు. "స్కిల్ కేసుపై బహిరంగంగా మాట్లాడకుండా ఉండటానికి మాకు అభ్యంతరం ఏమీ లేదు. కాని అదే షరతు రెండు వైపులా వర్తింపజేయాలి" అని పేర్కొన్నారు. దీనికి సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ తీవ్ర అభ్యంతరం తెలిపారు. "షరతు నిందితుడికి వర్తిస్తుంది.అది ప్రభుత్వానికి వర్తించదు" అని అన్నారు. విచారణ వాయిదా వేయకుండా నోటీసులు జారీ చేయాలని రోహత్గీ కోరారు. "ప్రతివాదికి నోటీసు జారీ చేయాలి. 40 పేజీల బెయిల్ ఆర్డర్‌లో మెరిట్‌పై నిర్ధారణలు ఉన్నాయి. నేను బెయిల్ ఆర్డర్‌లో కనుగొన్న వాటిని చూపించాలి. ఇది 300 కోట్ల ప్రజా నిధుల నుండి మళ్లించిన కేసు" అని రోహత్గీ, ధర్మాసనానికి తెలిపారు. నోటీసు జారీ చేయాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అభ్యర్థనను కోర్టు అంగీకరించడమే కాకుండా, ఈ కేసు నుండి ఉత్పన్నమయ్యే సబ్ జ్యూడీస్ విషయాల గురించి పబ్లిక్ డొమైన్‌లో మాట్లాడకుండా చంద్ర బాబు నాయుడుకు బెయిల్ షరతును కొనసాగించాలని ఆదేశించింది. అయితే, రాజకీయ ర్యాలీలు, సమావేశాలు నిర్వహించడం, పాల్గొనడంపై నిషేధం విధించే ఇతర బెయిల్ షరతును విధించేందుకు ధర్మాసనం నిరాకరించింది.

ఈ షరతులను ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులో విధించింది. అయితే చంద్రబాబుకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయబడినప్పుడు షరతును పొడిగించలేదు.సంక్షిప్త విచారణ ముగింపులో జస్టిస్ బేలా ఎం. త్రివేది ఇలా అన్నారు "నోటీస్ జారీ చేస్తాం. డిసెంబరు 8న కౌంటర్ దాఖలు చేయాలి. నవంబర్ 3న హైకోర్టు విధించిన అన్ని షరతులు బహిరంగ ర్యాలీలు, సమావేశాలను నిర్వహించడం, పాల్గొనడం మినహా కొనసాగుతాయి. డిసెంబర్ 11న తదుపరి విచారణ జరుపుతాం" అని పేర్కొన్నారు.

కలెక్టర్లకు ఈడీ నోటీసులు చట్ట విరుద్ధం

- మద్రాసు హైకోర్టు

చెన్నై: అక్రమ ఇసుక తవ్వకాలకు సంబంధించిన కేసులో జిల్లా కలెక్టర్లకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నేరుగా సమన్లు జారీ చేయడాన్ని మద్రాసు హైకోర్టు తప్పుపట్టింది. ఈడీ నోటీసులపై మూడు వారాలపాటు స్టే విధిస్తూ తీర్పు వెలువరించింది.

తమిళనాడులో అక్రమ ఇసుక తవ్వకాలకు సంబంధించి నగదు అక్రమ చెలామణి నిరోధక చట్టం కింద రాష్ట్ర మానవ వనరుల విభాగం కార్యదర్శితోపాటు అరియలూర్, వెల్లూర్, తంజావూర్, కరూర్, తిరుచ్చిరాపల్లి కలెక్టర్లకు ఈడీ నోటీసులు జారీ చేసింది. ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించిన వివరాలను స్వయంగా కలెక్టర్లు దర్యాప్తు సంస్థకు అందజేయాలని నోటీసుల్లో పేర్కొంది.

ఈ నోటీసులపై ఆరుగురు అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. మంగళవారం దీనిపై జస్టిస్ ఎస్ఎస్ సుందర్, జస్టిస్ సుందర్ మోహన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపి ఈడీ నోటీసులపై మూడు వారాలపాటు స్టే విధించింది. ఈడీ కేసు విచారణను కొనసాగించవచ్చని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేకుండా కలెక్టర్లకు సమన్లు జారీ చేయడం చట్ట విరుద్ధమన్న తమిళనాడు ప్రభుత్వ వాదనతో ద్విసభ్య ధర్మాసనం ఏకీభవిస్తున్నట్లు తెలిపింది.

తదుపరి విచారణను డిసెంబరు 21కి వాయిదా వేసింది. విచారణ పేరుతో దర్యాప్తు సంస్థ కలెక్టర్లకు సమన్లు జారీ చేయడం ఏకపక్ష నిర్ణయమని, జిల్లా కలెక్టర్లకు నేరుగా సమన్లు జారీ చేసే అధికారం ఈడీకి లేదని తమిళనాడు ప్రభుత్వం వాదించింది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ సహాయాన్ని కోరే అధికారం మాత్రమే ఈడీకి ఉందని తెలిపింది.

బీజేపీని తరిమికొట్టాలి

కార్మిక, కర్షక మహాపడావ్ విజయవంతం

- గొంతెత్తిన కార్మిక, రైతులకు అభినందనలు
- భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తాం : రైతు, కార్మిక సంఘాల నేతలు

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

ప్రజలను, దేశాన్ని రక్షించడానికి బీజేపీని అధికారం నుంచి తరిమి కొట్టాలని 'కిసాన్ మజ్దూర్ మహాపడావ్' పిలుపు నిచ్చింది. మోడీ సర్కార్ కార్మిక, రైతు, ప్రజా, దేశ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా మూడు రోజుల మహాపడావ్ విజయవంతమైంది. ఈ చారిత్రాత్మక మహాపడావ్‌ను విజయవంతం చేసినందుకు కార్మికులు, రైతులకు కార్మిక, రైతు సంఘాలు అభినందనలు తెలిపాయి. అనేక రాష్ట్రాల్లో 'కిసాన్ మజ్దూర్ మహాపడావ్' ప్రజా ఉద్యమంగా మారింది. రాజ్‌భవన్‌కు చేరుకుని ఆయా గవర్నర్‌లకు మెమోరాండం, చార్టర్ ఆఫ్ డిమాండ్‌లను సమర్పించడం తో మహాపడావ్ పోరాటం ముగిసింది.

రైతు, కార్మిక నేతలపై కేసులు నమోదు చేసి, ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి, మూడు రోజుల పాటు మహాపడావ్‌ను విజయవంతం చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర సెక్టోరల్ ఫెడరేషన్లు/సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా సంయుక్త వేదిక 26 నుంచి 28 వరకు మూడు రోజుల పాటు విజయవంతంగా జరిగిన మహాపడవ్‌లో లక్షల మంది పాల్గొన్నారు. అలాగే వివిధ ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. అనేక మంది మేధావులు, కళాకారులు, రచయితలు, ప్రముఖులు మహాపడవ్‌కు సంఘీభావం తెలిపారు. సీపీఐ(ఎం)తో పాటు వివిధ పార్టీలు కూడా మహాపడవ్‌కు మద్దతు ఇచ్చాయి. దీంతో మహాపడవ్ రాజకీయ ప్రాముఖ్యతను సూచిస్తుంది.

అండమాన్ నికోబార్ రాజధాని పోర్ట్ బ్లెయిర్, త్రిపురలోని అగర్తల, పాండిచ్చేరితో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల రాజధాని నగరాల్లో రాజ్ భవన్ (గవర్నర్ కార్యాలయం)ల ఎదుట మూడు రోజుల పాటు మహాపడావ్ నిర్విరామంగా జరిగింది. మూడు రోజులు ఆందోళనా కేంద్రాల వద్దే వంటావార్పు చేసుకొని, తాత్కాలిక గుడారాలు ఏర్పాటుచేసుకొని రాత్రుళ్ళు కూడా అక్కడే బసచేశారు.

స్వామినాథన్ కమిషన్ ఫార్ములా ప్రకారం రైతు ఉత్పత్తులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) నిర్ణయించాలని, ఢిల్లీ సరిహద్దుల్లో 13 నెలల పాటు రైతులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలనీ, ఆందోళనలో అమరులైన రైతులకు పరిహారం ఇవ్వాలనీ, దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. లఖింపూర్ ఖేరీ హత్యలు, హోంశాఖ సహాయ మంత్రి రాజీనామా, విద్యుత్ సవరణ



బిల్లు ఉపసంహరణ, నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవడం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను నిలిపివేయడం, కార్పొరేట్ దోపిడీకి ముగింపు, మంజూరైన పోస్టుల భర్తీ, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడం, పెరిగిన ధరలను ఉపసంహరించు కోవడం నిత్యావసర వస్తువులపై, నాణ్యమైన, ఉచిత విద్య, ఆరోగ్య సేవలు, నీరు, ప్రాథమిక పౌర సౌకర్యాలు మొదలైన డిమాండ్ల సాధనకు మహా పడావ్ జరిగింది.

ఈడీ, సీబీఐ, ఎన్ఐఏ వంటి ప్రభుత్వ సంస్థల సహాయంతో యూఏపీఏ, దేశద్రోహ చట్టం వంటి నీచమైన చట్టాలను దుర్వినియోగం చేస్తూ ప్రభుత్వాన్ని విమర్శించి నందుకు రచయితలు, మేధావులు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, ప్రతిపక్ష సభ్యులను టార్గెట్ చేస్తుందని విమర్శించింది. చారిత్రాత్మక రైతు పోరాటంపై వాస్తవాల ను ప్రచురించిన న్యూస్‌క్లిక్ మీడియా ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ, హెచ్ఆర్ మేనేజర్ అమిత్ చక్రవర్తిలను కేంద్ర ప్రభుత్వం జైలుకు పంపిందని విమర్శించింది. ఇది భయానక వాతావరణాన్ని సృష్టించడం, ప్రజాస్వామ్య ప్రక్రియలను విధ్వంసం చేయడం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొంది. ప్రజల డిమాండ్లపై మరింత భారీ, ఐక్య పోరాటాలు చేస్తామని రైతు, కార్మిక సఘాలు హెచ్చరించాయి.

మహాపడవ్ కార్యక్రమాలను సమీక్షించిన అనంతరం స్వతంత్రంగా, సమన్వయంతో తదుపరి దశ ఆందోళనలను నిర్ణయిస్తామని (కేంద్ర కార్మిక సంఘాలు) సీటీయూఎస్, ఎస్‌కేఎం నాయకులు తెలిపారు.

ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగిన ఆందోళనలో సీఐటీయూ అధ్యక్షురాలు కె.హేమలత మాట్లాడుతూ నయా ఉదారవాద విధానాల వ్యవస్థాగత సంక్షోభం నుంచి దేశ ఆర్థిక వ్యవస్థను రక్షించాలని కార్మికులు, రైతులు కోరుతున్నారని అన్నారు. మన జాతీయ సంపదను సృష్టించి, జాతీయ ఆర్థిక వ్యవస్థను నడుపుతున్న సామాన్య ప్రజల చేతుల్లో ఎక్కువ డబ్బు పెట్టాలన్నారు. వేతనాలు పెంచడం, ప్రభుత్వ నిధులతో సామాజిక భద్రతా చర్యలను విస్తరించడం, విశ్వవ్యాప్తం చేయడం, వ్యవసాయ ఇన్‌పుట్‌లతో సహా రైతులకు సబ్సిడీ, ప్రభుత్వ యాజమాన్యంలోని మండీలు, తగిన ఎంఎస్పి మొదలైన ఇతర చర్యలు రైతుల కష్టాలను పరిష్కరించడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్జిత్ కౌర్, ఏఐసీసీటీయూ ప్రధాన కార్యదర్శి రాజీవ్ దిమ్రి, ఏఐకేఎస్ కోశాధికారి కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల్లో తపన్ సేన్ (సీఐటీయూ), అశోక్ సింగ్ (ఐఎన్టీయూసీ), ఏఆర్ సింధు (సీఐటీయూ), ఆర్ కె శర్మ (ఏఐయూటీయూసీ), షణ్ముగమ్ (ఎల్పీఎఫ్), మనలి (ఎస్ఈడబ్ల్యూఏ), ఆశోక్ ఘోష్ (యూటీయూసీ), ఇందుప్రకాష్ మీనన్ (టీయూసీసీ), ఎస్‌కేఎం నేతలు అశోక్ ధావలే, విజూ కృష్ణన్, హన్నన్ మొల్లా, రాకేష్ టికాయిత్, దర్శన్ పాల్, జోగిందర్ సింగ్ ఉగ్రహాన్, సునీలం, అవిక్ సాహా తదితరులు పాల్గొన్నారు.





ఒకరికి ఒకరు

- బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే..
- అవినీతిలో కూరుకుపోయిన కేసీఆర్ ప్రభుత్వం
- రాష్ట్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి : జహీరాబాద్ రోడ్ షోలో ప్రియాంక గాంధీ

నవతెలంగాణ-జహీరాబాద్

బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒక్కటేనని.. ఎల్లవేళలా ఒకరికొకరుగా ఉంటూ సహకరించుకుంటూ వస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు ప్రియాంక గాంధీ అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో మంగళవారం నిర్వహించిన రోడ్ షోలో ఆమె పాల్గొన్నారు. అనంతరం బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీకి బిల్లులు పాస్ చేసుకునేందుకు అవసరమున్న ప్రతిసారీ బీఆర్ఎస్ అన్ని రకాలుగా సహకరించిందన్నారు. నేడు బీఆర్ఎస్, ఎంఐఎం నాయకులపై ఎక్కడైనా ఏవైనా దాడులు జరుగుతున్నాయా అని ప్రశ్నించారు. పూర్తిస్థాయిలో అవినీతిలో కూరుకుపోయిన ఈ ప్రభుత్వాన్ని పారదోలాల్సిన బాధ్యత ప్రజలదేనని తెలిపారు. దేశంలో లౌకికతత్వాన్ని కాపాడేందుకు రాహుల్ గాంధీ జోడో యాత్ర నిర్వహించి చరిత్ర సృష్టించారన్నారు. నేడు దేశంలో అత్యధిక ధనికమైన పార్టీల్లో బీజేపీ, బీఆర్ఎస్ ఉన్నాయని, అన్ని డబ్బులు వారికి ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. ప్రధాని మోడీకి సన్నిహితులైన అదానీకి రూ.16 వేల కోట్ల బ్యాంకు రుణాన్ని మాఫీ చేశారని.. ఇది ఎందుకోసం చేశారన్నారు. ప్రస్తుతం ధర్మం, జాతీయతపై ఎన్నికలు నడుస్తున్నాయని.. ఈ ఎన్నికల్లో ప్రజలు ధర్మం వైపు నిలబడాలని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్‌ది ఫామ్‌హౌస్ పాలన అని.. దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇలా పాలించలేదన్నారు. యువకుల ఆత్మబలిదానాల వల్ల తెలంగాణ వచ్చిందని.. కానీ నేడు యవకులకు ఉద్యోగాలు మాత్రం రాలేదన్నారు. ఛత్తీస్‌గఢ్, కర్నాటక, రాజస్థాన్‌ల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని.. అక్కడి ప్రజలకు తాము ఇచ్చిన సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఒక్కసారి అక్కడి పాలన గురించి తెల్సుకుని తెలంగాణలోనూ కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత.. స్థానికంగా షుగర్ ఫ్యాక్టరీ ఏర్పాటుతోపాటు నిమ్జ్ రైతుల సమస్యలను పరిష్కారం చేస్తామన్నారు. సభలో కర్నాటక మంత్రి భీమన్న కండ్రే, రెహమాన్, పార్లమెంటు పరిశీలకులు డాక్టర్ విజువల్ రెడ్డి, అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖర్, ఎంపీపీ గిరిధర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుద్యోగంలో టాప్ 2లో ఆ రాష్ట్రాలు

- మా కంటే ఎక్కువ ఉద్యోగాలిచ్చినట్టు నిరూపించండి..
- రాజకీయాల నుంచి తప్పుకుంటా.. :ఎమ్మెల్సీ కవిత



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిరుద్యోగం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో టాప్-2లో బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలే ఉన్నాయని ఎమ్మెల్సీ కవిత అన్నారు. దేశంలోనే తెలంగాణలో ఎక్కువగా ఉద్యోగాలు బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్ ఒక్క ఉద్యోగం ఎక్కువ కల్పించినా తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని, లేకుంటే రాహుల్‌గాంధీ రాజకీయాలను వదిలేస్తారా అని సవాల్ విసిరారు. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ(సీఎంఐఈ) సంస్థ చేసిన సర్వేలో బీజేపీ పాలిత హర్యాన రాష్ట్రం నిరుద్యోగంలో మొదటి స్థానంలో ఉందని, కాంగ్రెస్ పరిపాలిస్తున్న రాజస్థాన్ రెండో స్థానంలో ఉన్నట్టు తెలిపారు. వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఉద్యోగాలు కల్పించకుండా.. ఇక్కడికి వచ్చి ఏదేదో చెబుతున్నారని, యువతీయువకులు గమనించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ పాలించిన మధ్యప్రదేశ్‌లో నిరుద్యోగ యువత 40 లక్షల మంది వరకు ఉంటే.. ఏడాది కాలంలో భర్తీ చేసిన ఉద్యోగాల సంఖ్య కేవలం 21 అని చెప్పారు. గూగుల్‌లో సీఎంఐఈ అని సర్చ్ చేస్తే అన్ని వివరాలు తెలుస్తాయని తెలిపారు. కర్నాటకలో సైతం 2.60 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్టు ఆ రాష్ట్ర ప్రభుత్వమే వెల్లడించినట్టు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ప్రజల విశ్వాసం కోల్పోయారని, అందుకే బాండ్ పేపర్ పేరుతో కొత్త నాటకానికి తెరతీశారని విమర్శించారు. జీవన్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, దామోదర రాజనరసింహ, భట్టి విక్రమార్క వంటి పెద్ద నాయకులు కూడా బాండ్ పేపర్ రాసివ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందంటే ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ ఎంత విశ్వాసం కోల్పోయిందో చెప్పడానికి ఒక ఉదాహరణ అని అన్నారు. కర్నాటక ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ ఇదే డ్రామా చేసిందని విమర్శించారు.

బీఆర్ఎస్ చేతిలో మరోసారి మోసపోవద్దు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ చేతిలో మరోసారి మోసపోవద్దని బీజేపీరాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సూచించారు. మంగళ వారం హైదరాబాద్‌లోని హోటల్ కత్రియాలో ఆయన మీడియాతో మాట్లా డారు. 30న ప్రజాస్వామ్యానికి సంబంధించిన పండుగ జరుగబోతున్న దన్నారు. ప్రజలంతా కుటుంబ, అవినీతి పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ చేతిలో మోసపోవద్దనీ, నక్కలాగా కూర్చుని వేచి చూస్తున్న కాంగ్రెస్ మాయలో పడొద్దని కోరారు. రాష్ట్రంలో తమ పార్టీకి రోజురోజుకీ ఆదరణ పెరుగుతున్నదని చెప్పారు. రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీకి అవగాహన లేక మాట్లాడుతున్నారని విమర్శించారు. బీజేపీ కనుసన్నల్లో మజ్లిస్ ఎలా పనిచేస్తుందని ప్రశ్నించారు. మజ్లిస్‌ను పెంచిపోషించిందీ, దారుసలాంను ఆ పార్టీకి కట్టబెట్టిందీ కాంగ్రెస్ పార్టీనే అని విమర్శించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మజ్లిస్ గుండాయిజాన్ని సమర్థించబోమన్నారు. ప్రాజెక్టుల పేరుతో పెద్ద ఎత్తున ప్రజా ధనాన్ని దోపిడీ చేసిన బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ గెలిస్తే ఆర్థిక విధ్వంసం జరుగుతుందన్నారు.

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను ప్రజలు నమ్మట్లేదు : లక్ష్మణ్

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను రాష్ట్ర ప్రజలెవ్వరూ నమ్మట్లేదని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. మంగళవారం హోటల్ కత్రియాలో ఆయన మీడియాతో మాట్లాడారు. మోడీ, అమిత్‌షా, నడ్డా పర్యటనలకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందన్నారు. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహాన్ని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. కేసీఆర్ అబద్ధపు మాటల్ని వినివిని ప్రజలు విసిగి వేసారిపోయారని తెలిపారు. వేలం పాట మాదిరిగా పోటీ పడి పథకాలను ప్రకటిస్తున్నారని విమర్శించారు. ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలకు సంభందించిన ఆమోదయోగ్యమైన హామీలనే బీజేపీ ఇచ్చిందన్నారు. కర్నాటక ప్రజల సొమ్ముతో తెలంగాణలో ఎన్నికల ప్రకటనలు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. కర్నాటక కాంగ్రెస్‌కు ఏటీఎంగా మారిందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు ఎప్పుడూ 60 సీట్లు దాటలేదనీ, ఏపీ ప్రాంతం ఎమ్మెల్యేలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేదని చెప్పారు.

మిజోరం ఎందుకు వెళ్లలేదు

- బీజేపీ జాతీయ నేతలకు అశోక్ గెహ్లోట్ ప్రశ్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం ఉంటే మిజోరం ఎందుకు వెళ్ళలేదని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ బీజేపీ అగ్రనేతలను ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఢిల్లీలో సర్కారు ఆటోమోడ్‌లో నడుస్తోందన్నారు. తెలంగాణలో ఆరు గ్యారంటీలు బాగున్నాయనీ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతోందని తెలిసి బీఆర్ఎస్, బీజేపీలు కలిసి పోయాయయని విమర్శించారు. రాజస్తాన్‌లో పేపర్ లీకు కేసులో బాధ్యులపై కఠినంగా వ్యవహరించామని తెలిపారు. ఎన్నికల్లో గెలవడానికి ప్రతిపక్షాలపై బీజేపీ ఈడీని ప్రయోగిస్తున్నదని విమర్శించారు. అవినీతిలో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉందని గెహ్లోట్ ఎద్దేవా చేశారు.

కొంత అసంతృప్తి.. అలకలు వాస్తవమే..

అయినా గులాబీ ప్రభంజనం ఖాయం..!

- జనంలో పాజిటివ్ వైబ్రేషన్ : బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ - సిరిసిల్ల/కామారెడ్డి

"నీళ్లు.. కరెంట్.. కొలువుల కోసం పోరాడి తెలంగాణను తెచ్చుకున్నాం. సాధించింది చాలా వుంది.. సాధించాల్సిది ఇంకా వుంది అంతా.. పొరపాట్లు జరగలేదని అనట్లేదు. మేమూ మనుషులమే.. కొంత అసంతృప్తి.. కొన్ని అలకలు వున్న మాట వాస్తవమే సరిదిద్దుకుంటాం. ఈసారి అన్నీ పూర్తి చేసుకుంటాం.. మూడోసారి గులాబీ ప్రభంజనం ఖాయం.. కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టడం పక్కా..!" అని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు.

సిరిసిల్ల, కామారెడ్డిలో కేటీఆర్ మంగళవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. "వందల సభలు.. రోడ్ షోలు.. హాల్ మీటింగ్స్‌లో కోట్ల మందిని నేరుగా కలుసుకున్నాం.. వాళ్ల మనసు తెలుసుకున్నాం.. ఆదిలాబాద్ నుంచి ఆలంపూర్ దాకా, బాసర నుంచి భద్రాచలం దాకా ప్రజలు వెల్లువలా తరలివచ్చారు.

జనంలో ఒక పాజిటివ్ వైబ్రేషన్ కనిపించింది" అన్నారు. కొత్త రికార్డులు నెలకొల్పడం.. చరిత్ర సృష్టించడం కేసీఆర్‌కు కొత్తకాదు..! ప్రజల ఆశీర్వాదం.. అభిమానంతో సౌత్ ఇండియాలో మూడోసారి సీఎంగా అరుదైన ఘనత సాధించబోతున్నారన్నారు. ఈ రెండ్రోజులు రెట్టించిన ఉత్సాహంతో పని చేయాలని పార్టీ శ్రేణులను



కోరారు. ఫేక్ న్యూస్‌లను..ఫేక్ ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. రాష్ట్ర ఏర్పాటు సమయంలో టీఆర్ఎస్ పాత్ర, కేసీఆర్ కృషి, నాటి పరిస్థితులను, నేడు సాధించిన ప్రగతిని గుర్తించి ఆలోచించి ఓటు వేయాలని కోరారు.

కాంగ్రెస్ కొత్త పార్టీ కాదు మనం.. చెత్త బుట్టలో విసిరేసిన పార్టీ..! తెలంగాణను 50 ఏండ్లు ఏడిపించిన పార్టీ అని విమర్శించారు. తెలంగాణను వున్న ఏకైక గొంతుక కేసీఆర్.. ఆ గొంతును నొక్కేయాలని చూస్తున్నారు.. కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే అని కేటీఆర్ అన్నారు. ఓటు వేసేముందు ఒకటికి వందసార్లు ఆలోచించాలని కోరారు. మా బలం..మా బలగం తెలంగాణ ప్రజలేనన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, నాస్కాబ్ చైర్మెన్ కొండూరి రవీందర్‌రావు, టెక్స్‌టైల్ కార్పొరేషన్ చైర్మెన్ గూడూరి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడ దోచుకోవడానికేముంది..

కామారెడ్డి భూముల్లో దోచుకోవడానికి ఏమైనా లంకె బిందెలు ఉన్నాయా.. ప్రతిపక్షాలు ప్రతిసారీ కేసీఆర్ భూములు దోచుకోవడానికి కామారెడ్డికి వస్తున్నారని చెప్తున్నాయి.. దోచుకోవాల్సిన అవసరం ఏముందని కామారెడ్డి రోడ్‌షోలో కేటీఆర్ అన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి బాధ్యత తాను తీసుకుంటానన్నారు. ప్రజలు కేసీఆర్‌కు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కేసీఆర్ కామారెడ్డి వస్తే పరిశ్రమలు.. విద్యాసంస్థలు వస్తా యన్నారు. ఇక్కడి భూములకు ధరలు పెరుగుతా యని, రైతులకు మేలు జరుగుతుంద న్నారు. అభివృద్ధి చేసేవారిని గుర్తించి ఓటువేయా లని కోరారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గంప గోవర్ధన్, నాయకులు నిట్టు వేణుగోపాల్ పాల్గొన్నారు.

అటు ప్రచారపర్వం, ఇటు వ్యూహరచన

- ఎన్నికల్లో అన్నీ తానై పార్టీని నడిపించిన కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు అన్నీ తానై పార్టీ శ్రేణులను ముందుకు నడిపించారు. ముఖ్యమంత్రి తర్వాత అత్యధిక సభలు, రోడ్‌షోలతో ప్రజలతో మమేకమయ్యారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి సాగిన 60 రోజుల ప్రచారంలో 70 రోడ్ షోలు, 30 సభలు, 30కి పైగా ప్రత్యేక ఇంటర్వ్యూలు,150కి పైగా టెలికాన్ఫరెన్స్‌లతో బీఆర్ఎస్ ప్రచారాన్ని హోరెత్తించారు. అందరం కలిసి సాధించుకున్న తెలంగాణలో కలిసి ముందడుగు వేద్దామని పిలుపునిచ్చారు. ఇప్పటికే అన్ని రంగాల్లో గొప్ప ప్రగతి సాధించామని వివరిస్తూనే, సాధించాల్సింది ఇంకా ఉందని భవిష్యత్ విజన్‌ను ఆవిష్కరించారు. తెలంగాణ ఎవరి చేతిలో ఉంటే పదిలంగా ఉంటుందో ఆలోచించి ఓటువేయాలని కేటీఆర్ ఇచ్చిన పిలుపు ప్రతిఒక్కరిని ఆకట్టుకుంది. పాజిటివ్ దక్పథంతో ప్రజల్లో సానుకూల అభివద్ధి ఎజెండాతో సాగిన ప్రచారపర్వమంతా ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితుల్లో సరికొత్త ట్రెండ్ సష్టించింది. ఒకవైపు తెలంగాణ భవిష్యత్తుకు భరోసా ఇచ్చే ఏకైక పార్టీ భారత రాష్ట్ర సమితి మాత్రమే అని ప్రజలకు గణాంకాలతో సహా వివరించారు. ప్రతిపక్షాల తప్పులు, వారి డొల్ల వాదనలను ఎప్పటికప్పుడు ప్రజాక్షేత్రంలో ఎండగట్టారు. 14 ఏళ్ల ఉద్యమ ప్రస్థానంలో, 10 ఏళ్ల ప్రగతి ప్రస్థానంలో తమ వెంట నడిచిన తెలంగాణ సమాజం వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ పార్టీని ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

బీసీలను వంచించిన బీజేపీ, బీఆర్ఎస్

- బీసీ హక్కుల సాధన సమితి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీసీలను వంచించిన బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని బీసీ హక్కుల సాధన సమితి పిలుపునిచ్చింది. కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావుకు మద్దతు ప్రకటించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఓటర్లను కోరింది. ఈ మేరకు బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీ కులగణన చేపట్టకుండా పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టకుండా మోడీ అన్యాయం చేస్తున్నారని విమర్శించారు.

క్షేత్రస్థాయి ఉద్యోగుల ఓటు ఎటువైపో?

అణచివేత ధోరణితో సర్కారుపై తీవ్ర అసంతృప్తి

అదే బాటలోనే స్కీం వర్కర్లు.. ఆందోళనలో రాష్ట్ర సర్కారు

- ప్రజల్ని ప్రభావితం చేయడంలోనూ వారిది కీలక పాత్ర
- వారిని తమవైపు తిప్పుకునే పనిలో ప్రతిపక్ష పార్టీలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామస్థాయి ఉద్యోగులు, స్కీం వర్కర్లు రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారా? జీతాలు పెంచాలి..సమస్యలు పరిష్కరించాలి అడిగిన పాపానికి కేసీఆర్ సర్కారు వ్యవహరించిన తీరుపై కసితో రగిలిపోతున్నారా? ఒకప్పుడు అధికార పార్టీ గెలుపు కోసం తమ వంతు కృషి చేసిన వారే..ప్రస్తుత ఎన్నికల్లో తిరగబడబోతున్నారా? అంటే.. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలు అవుననే చెబుతున్నాయి. మెజార్టీ క్షేత్రస్థాయి ఉద్యోగులు, కార్మికుల నుంచి అదే మాట వినిపిస్తున్నది. వేధింపులు..అణచివేతలు..తీసివేతలు..పోరాటాల తర్వాత ఎంతో కొంత మేర మేలు జరిగినప్పటికీ ప్రభుత్వం తమ పట్ల వ్యవహరించిన తీరుపై వారు గుర్రుగా ఉన్నారు. సమస్యలు పరిష్కరించాలని ఫీల్డు అసిస్టెంట్లు సమ్మెలోకి వెళ్తే సర్కారు నిర్దాక్షిణ్యంగా తీసేసింది. వేడుకోవడాలు..విన్నపాలు..అంతిమంగా పోరాటాలతో ఎన్నికల ఏడాదిలో గొడవెందుకని సర్కారు దిగొచ్చి విధుల్లోకి తీసుకున్నది. 33 నెలల సుదీర్ఘ పోరాటం తర్వాత ఉద్యోగంలోకి తీసుకోవడంపై వారు పైకి సంతోషం ప్రకటిస్తున్నప్పటికీ లోలోన రగిలిపోతున్నారు.

సర్కారు తమ పట్ల దారుణంగా వ్యవహరించదనే భావనలో వారున్నారు. తమపై 'అవినీతిపరులు' అనే ముద్రవేసి వేర్వేరు శాఖల్లోకి బదిలీ చేయడంపై వీఆర్వోలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. వీఆర్ఏలను పర్మినెంట్ చేసినప్పటికీ..ఆ విషయంలో ఇంకా స్పష్టతనివ్వకపోవడంపై వారూ అసంతృప్తితో ఉన్నారు. పంచాయతీ కార్యదర్శులు తీవ్ర పనిభారంతో తల్లడిల్లుతున్న పరిస్థితి క్షేత్రస్థాయిలో కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. గ్రామ పంచాయతీ కార్మికులు కూడా అదే స్థితిలో ఉన్నారు. సంఖ్యా పరంగా ఫీల్డు అసిస్టెంట్లు, వీఆర్ఏలు, వీఆర్వోలు, గ్రామపంచాయతీ కార్మికులు, గ్రామకార్యదర్శులు లక్ష లోపే ఉన్నారు. వారి కుటుంబ ఓట్లను లెక్కిస్తే ప్రతి మూడులక్షలకుపైనే ఉంటారు. అంటే నియోజకవర్గానికి సగటున 2500 మంది దాకా ఉన్నారు. ఈ ఉద్యోగులంతా క్షేత్రస్థాయిలో ప్రజలను కూడా ప్రభావితం చేయడంలో కీలకంగా మారే అవకాశముంది. ప్రభుత్వంపై తమకున్న అసంతృప్తితో నియోజకవర్గంలో ఒక్కొక్కరు కనీసం 20, 30 ఓట్లను ప్రభావితం చేసినా 10 వేల నుంచి 20 వేల ఓట్ల మేర ప్రభావం పడే అవకాశం ఉంది. ఇప్పటికే వరుసగా రెండు



సార్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీపై ప్రజల్లో సహజంగానే కొంతమేర అసంతృప్తి ఉంది. ఈసారి హోరాహోరిగా ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఏ పార్టీ అభ్యర్థి అయినా 5 వేల నుంచి 10 వేల ఓట్లతోనే గెలిచే అవకాశముంది. ఈ పరిస్థితుల్లో ఆ ఉద్యోగుల పాత్ర కీలకం కానున్నదనే చర్చ నడుస్తున్నది.

అదే బాటలో స్కీం వర్కర్లు

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసేది స్కీం వర్కర్లే. రాష్ట్రంలో మూడు లక్షల మందికిపైగా ఉన్నారు. అందులో అంగన్‌వాడీలు, ఆశాలు, మధ్యాహ్నభోజన కార్మికులు, ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్నారు. 119 నియోజకవర్గాల్లో సగటున చూస్తే ఒక్కో నియోజకవర్గంలో 2500మంది స్కీం వర్కర్లు ఉన్నారు. వీరంతా ఆయా నియోజకవర్గాల ఓటర్లే. ప్రజలతో నిత్యం సంబంధాలున్న వారే. వీరి సమస్యలను పరిష్కరించే విషయంలో సర్కారు మొండి వైఖరి అవలంబించడం పట్ల స్కీం వర్కర్లు సైతం ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉన్నారు. వీరి ఓట్లు ఎటు బదిలీ అవుతాయన్నది కూడా ఇప్పుడు ప్రశ్నార్థకంగా ఉంది. అధికార పార్టీ గెలుపోటములపై ఈ ఓట్లు ప్రభావం చూపే అవకాశముంది.

బీఆర్ఎస్‌ను చిత్తుచిత్తుగా ఓడించాలి

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను గెలిపించాలి

- చాడ, జస్టిస్ చంద్రకుమార్, అజీజ్‌పాషా, పాశం యాదగిరి పిలుపు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యమ ఆకాంక్షలను పాతరేసి నిరంకుశ విధానాలను అవలంబిస్తున్న బీఆర్ఎస్‌ను ఈ అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా, కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, జస్టిస్ చంద్రకుమార్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్ మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ పదేండ్ల కాలంలో సీఎం కేసీఆర్ ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చలేదని విమర్శించారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని చెప్పారు. రాష్ట్రంలో ఆత్మగౌరవ పరిపాలనలేదన్నారు. సీఎంను మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసే పరిస్థితి లేదని అన్నారు. రాష్ట్రంలో పదేండ్లుగా నిరంకుశ పరిపాలన సాగుతోందన్నారు. ప్రజలు మార్పు కావాలని కోరుకుంటున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయంగా నష్టపోతామని తెలిసినా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం కట్టాల్సిన అవసరముందన్నారు. ఆ పార్టీ గెలిస్తే ప్రజా ప్రభుత్వం ఏర్పడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ ఆకాంక్షలను కేసీఆర్ ప్రభుత్వం అమలు చేయలేదని చెప్పారు. రాష్ట్రంలో 2.70 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయనీ, వాటిని భర్తీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని రూ.5.30 లక్షల కోట్ల అప్పుల్లోకి తీసుకుపోయారని అన్నారు. రూ.1.30 లక్షల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే కుంగిపోయిందనీ, గతంలో కట్టిన నిజాంసాగర్, నాగార్జున సాగర్ లాంటి ప్రాజెక్టులు చెక్కుచెదరలేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరుగుతున్నా ఈడీ, ఐటీ దాడులు ఎందుకు జరగడం లేదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావును, మిగతా 118 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓట్ నీట్ గ్యారంటీ సంస్థ అధ్యక్షురాలు సౌగ్రబేగం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నరసింహ, ఎస్ బాలమల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో పెరుగుతున్న మరణాలు !

భద్రతా చట్టాన్ని బలోపేతం చేయాలని దేశాలను కోరిన ఐఎల్ఓ నివేదిక

న్యూఢిల్లీ : పని ప్రదేశాల్లో సంభవించే ప్రమాదాలు, తలెత్తే వ్యాధుల కారణంగా ప్రతి ఏటా అంతర్జాతీయంగా దాదాపు 30లక్షల మంది కార్మికులు చనిపోతున్నారని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) రూపొందించిన కొత్త నివేదిక పేర్కొంది. వీటిలో 63శాతానికి పైగా మరణాలు ఆసియా-పసిఫిక్ ప్రాంతం నుండే సంభవిస్తున్నాయని తెలిపింది. సుదీర్ఘమైన (వారానికి 55గంటలకు పైగా) పనిగంటలు వుండడం అన్నింటికంటే పెద్ద మరణ కారణంగా వుంది. 2016లో ఈ కారణంగానే దాదాపు 7.45లక్షల మంది చనిపోయారు. పనిచేసే ప్రదేశాల్లో తలెత్తే కలుషిత వాయువులు, పొగలు, ఇతర విష పదార్థాల వల్ల ఏడాదికి 4.5లక్షల మంది చనిపోతున్నారు. ఇది రెండో కారణంగా వుంది. ఇక మూడో కారణంగా, పనిచేసే సమయంలో సంభవించే గాయాలతో 3.63లక్షల మంది మరణిస్తున్నారు.

'ఏ కాల్ ఫర్ సేఫర్ అండ్ హెల్తీయర్ వర్కింగ్ ఎన్విరాన్‌మెంట్స్' శీర్షికతో వెలువడిన నివేదికను 'భద్రత, పని ప్రదేశంలో ఆరోగ్యంపై జరుగుతున్న 23వ ప్రపంచ మహాసభలో చర్చించనున్నారు. ఈ అంశంపై జరిగే అతిపెద్ద అంతర్జాతీయ మహాసభల్లో ఇదొకటి. సిడ్నీలో సోమవారం ఈ సభ ప్రారంభమైంది. ప్రమాదకరమైన వృత్తుల్లో గాయాల రేటుపై గల డేటాను ఆ నివేదిక ఉటంకించింది. అంతర్జాతీయంగా మూడు రంగాలు అత్యంత ప్రమాదకరమైనవిగా వున్నాయని, అవి మైనింగ్ మరియు క్వారీయింగ్, నిర్మాణ రంగం, ఇతర సదుపాయాల కల్పనా రంగాలని నివేదిక పేర్కొంది.

భారత్ తరపున ఇఎస్ఐసి డైరెక్టర్ జనరల్ రాజేంద్ర కుమార్ పాల్గొన్నారు. మొత్తంగా 187 దేశాల్లో 79 దేశాలు ఇప్పటివరకు ఐఎల్ఓ వృత్తిపరమైన భద్రతా, ఆరోగ్య ఒప్పందాన్ని ధృవీకరించాయని ఆ నివేదిక పేర్కొంది. మరో 62దేశాలు వృత్తిపరమైన భద్రత, ఆరోగ్య ఒప్పందానికి చట్రపరిధిని రూపొందించే ఒప్పందాన్ని ధృవీకరించాయి. కాగా, భారత్ ఈ రెండు ఒప్పందాలనూ ధృవీకరించలేదు. ఉత్తరకాశీ సొరంగం ప్రమాదం జరిగిన నేపథ్యంలో ఈ రెండు ఒప్పందాలను ఆమోదించి, ధృవీకరించాల్సిందిగా సిఐటియు కోరింది.

పైన పేర్కొన్న రెండు ఒప్పందాల కీలక సూత్రాలకు అనుగుణంగా, జాతీయస్థాయిలో వృత్తిపరమైన ప్రదేశాల్లో సమర్ధవంతమైన భద్రతా వ్యవస్థ వుండాలని నివేదిక దేశాలను కోరింది. సురక్షితమైన, భద్రతతో కూడిన ఆరోగ్యకరమైన పని వాతావరణం కల్పించడం ప్రాథమిక హక్కని ఆ నివేదిక స్పష్టం చేసింది. పని సంబంధిత మరణాల్లో మెజారిటీ భాగం అంటే 26లక్షల వరకు పని సంబంధిత వ్యాధుల కారణంగా చనిపోతున్నారు, మరో 3.3 లక్షల మంది పని ప్రదేశాల్లో ప్రమాదాల కారణంగా చనిపోతున్నారు. 2000, 2020 మధ్య కాలంలో చర్మ సంబంధిత కేన్సర్ వ్యాధి 37శాతం పెరిగిందని పేర్కొంది. పనిచేసే సమయాల్లో క్రోమియం తాకిడి రెట్టింపు అయిన కారణంగా 2000-2016 మధ్య కాలంలో ఊపిరితిత్తుల కేన్సర్లు బాగా పెరిగాయని పేర్కొంది. అలాగే కాలుష్యకారక వాయువులు పీల్చడం వల్ల 20శాతం వరకు మరణాలు సంభవించాయని తెలిపింది. ఈ పరిస్థితులను నివారించేందుకు గానూ సురక్షితమైన, ఆరోగ్యకరమైన పనివాతావరణం కల్పించాల్సిన తక్షణావశ్యకత వుందని ఐఎల్ఓ నివేదిక స్పష్టం చేసింది. సమిష్టి బేరసారాల హక్కును కూడా గుర్తించాలని, అనేక రూపాల్లో అమలవుతున్న నిర్బంధంగా లేదా బలవంతంగా పని చేయించుకోవడాన్ని నిర్మూలించాలని నివేదిక కోరింది.

బీఆర్ఎస్ కోడ్ ఉల్లంఘనను అడ్డుకోండీ

కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

న్యూఢిల్లీ : సైలెంట్ పిరియడ్‌లో (28 సాయంత్రం 5 నుంచి పోలింగ్ ప్రారంభమయ్యే వరకు) బీఆర్ఎస్ పార్టీ మోడల్ కోడ్‌ను ఉల్లంఘనను అడ్డుకోవాలని సీడబ్ల్యూసీ సభ్యులు, రాజ్యసభ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ)ని కోరారు. బీఆర్ఎస్ పార్టీ లోగో, రంగు, సింబల్‌తో ఓటర్లను ప్రభావితం చేయాలని చూస్తోందని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ అభిషేక్ మను సింఘ్వీ, సల్మాన్ ఖుర్షీద్, అజయ్ మాకెన్, అజోయ్ కుమార్, గుర్దీప్ సింగ్ సప్పల్, ప్రణవ్ ఝా, వినీత్ పునియాలతో కూడిన బృందం ఎన్నికల సంఘం అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం నిర్వచన్ సదన్ ముందు సింఘ్వీ మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ప్రచార గడువు ముగిసిన తరువాత బీఆర్ఎస్ పార్టీ గుర్తు, రంగులతో ఓటర్లను ప్రభావితం చేయాలని చూస్తుందన్నారు. వాస్తవానికి సైలెన్స్ పిరియడ్‌లో ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ ఓటర్లను ప్రలోభ పెట్టొద్దన్నారు. కానీ బీఆర్ఎస్ కార్యకర్తలు గులాబీ రంగు టీషర్టులు, చీరలు ధరించి రాష్ట్రంలో సందడి చేయాలని యోచిస్తున్నట్టు తమ వద్ద నిసెతీష్ఠుస్పష్టమైన సమాచారం ఉందన్నారు. ఇందుకు సంబంధించి తమ పార్టీ శ్రేణుల సమాచారం ఇచ్చారన్నారు. పార్టీ రంగు, లోగో, చిహ్నాన్ని ధరించి పరోక్షంగా ప్రచారం చేసే అవకాశం ఉందన్నారు. తెలంగాణ లోఎన్నికల నియమావళి ఉల్లంఘనకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఈసీఐ అధికారను కోరారు. అలాగే ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీపై వచ్చిన ఫిర్యాదుపై స్పందిస్తోన్న ఈసీఐ, బీజేపి నేతలపై అందిన ఫిర్యాదులను స్పందించడం లేదన్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు లక్ష్యంగా మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ ప్రచారం సమయంలో ప్రధాని మోడీ, హౌం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఫిర్యాదులు చేశారు.

సుప్రీంలో మంత్రి మల్లారెడ్డికి ఊరట

న్యూఢిల్లీ : తెలంగాణ మంత్రి మల్లారెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. తెలంగాణ ఎన్నికల్లో సీహెచ్ మల్లారెడ్డి సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో తప్పులున్నాయంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాలు సవాల్ చేస్తూ కందాడి అంజిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారించింది. 2014, 2018, 2023 ఎన్నికల్లో మల్లారెడ్డి సమర్పించిన వేర్వేరు అఫిడవిట్లలో విద్యాపరమైన అంశాలు భిన్నంగా ఉన్నాయని పిటిషనర్ ఆరోపించారు. రిటర్నింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలన్న విజ్ఞప్తిని తెలంగాణ హైకోర్టు తోసిపుచ్చింది. దీంతో అంజిరెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అంజిరెడ్డి తరపు



అడ్వొకేట్ ఆన్‌రికార్డ్స్ ఆనంద్ దిలీప్ వాదనలు వినిపిస్తూ.. అఫిడవిట్‌లో విద్యా పరమైన అర్హతల్లో 2014లో కళాశాల పేరు, 2018, 2023ల్లో తేడాగా ఉందని, వయసు కూడా తప్పుగా ఉందని ఆరోపించారు. ఆర్వోకు ఫిర్యాదు చేసినా, హైకోర్టుకు వెళ్లినా ఆశించిన ఫలితం రాలేదని తెలిపారు. అఫిడవిట్‌లో వెరిఫైడ్ ఎట్, డేట్ అనే కాలమ్స్ కూడా మల్లారెడ్డి పూర్తి చేయలేదని, ఎన్నికల కమిషన్‌ను ప్రజల్ని తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. రిట్ దాఖలు చేయకూడదని, ప్రజా ప్రాతినిధ్య చట్టం ద్వారా వెళ్లాలని హైకోర్టు చెప్పిందని ధర్మాసనం దష్టికి తీసుకొచ్చారు. ఆనంద్ దిలీప్ వాదనల్ని కేవియేటర్ మల్లారెడ్డి తరపు సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి, రమేష్ అల్లంకిలు తోసిపుచ్చారు. మల్లారెడ్డి రెండు అఫిడవిట్లు దాఖలు చేశారని పిటిషనర్ ఒక అఫిడవిట్ చూసి వివరాలు లేవని భావించారని కోర్టు దష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఈ కేసులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని హైకోర్టు తీర్పును సమర్థిస్తూ పిటిషన్ కొట్టివేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్ సస్పెండ్

రీసెర్చ్ స్కాలర్ ఆత్మహత్యపై కమిటీ నివేదిక

చెన్నై : రీసెర్చ్ స్కాలర్ ఆత్మహత్యకు ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్ అశీష్ కుమార్ సేన్ పూర్తిగా బాధ్యుడని విచారణ కమిటీ నివేదిక ఇవ్వడంతో యాజమాన్యం ఆయన్ను సస్పెండ్ చేసింది. ఈ ఏడాది మార్చి 31న మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ వద్ద పిహెచ్‌డి స్కాలర్ అయిన 31 ఏళ్ల సచిన్ కుమార్ జైన్ ఆత్మహత్య చేసుకున్నారు. దీనిపై జైన్ సోదరుడు భవేష్ జైన్ ఐఐటి మద్రాస్ డైరెక్టర్ వి కామకోటికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాసిన ఆరు పేజీల లేఖలో పిహెచ్‌డి గైడ్, మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ చీఫ్ ప్రొఫెసర్ అశీష్ కుమార్ సేన్ వేధింపుల కారణంగానే తన సోదరుడు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆరోపించారు. అలాగే తోటి విద్యార్థులు కూడా సచిన్ కుమార్ ఆత్మహత్యపై దర్యాప్తు జరపాలని కోరారు. దీంతో మాజీ డిజిపి జి తిలగవతి అధ్యక్షత ఐదుగురు బృందంతో విచారణ కమిటీని నియమించారు. విచారణ జరిపిన ఈ కమిటీ ప్రొఫెసర్ అశీష్ కుమార్ వేధింపుల కారణంగానే సచిన్ ఆత్మహత్యకు పాల్పడ్డారని నిర్ధారించింది. సచిన్ రీసెర్చ్ ఐదేళ్లలో పూర్తి కావాల్సి ఉందని, అయితే అశీష్ కుమార్ చర్యల వలన ఎనిమిదేళ్లు అయినా పూర్తికాలేదని కమిటీ గుర్తించింది.



భావితరాల అభివృద్ధికి

సీపీఐ(ఎం)కు ఓటేద్దాం

- 100 ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ

నవతెలంగాణ-గార్ల

నిరంతరం కార్మికులు, కర్షకుల హక్కుల కోసం పోరాటాలు నిర్వహించే ఎర్రజెండా పార్టీకి ఓటు వేసి భావితరానికి అభివృద్ధి బాటలు వేద్దామని సీఐటీయూ రాష్ట్ర నాయకులు వంగూరి రాములు, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దుగ్గి కృష్ణ అన్నారు. ఇల్లందు నియోజకవర్గంలో సీపీఐ(ఎం) అభ్యర్థి గెలుపును కోరుతూ ఆపార్టీ ఆధ్వర్యంలో 100 ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డబ్బు సంచులతో సంతలో పశువుల్లా ఓటర్లను కొనుగోలు చేసి గెలిచాక అభివృద్ధి పేరుతో సొంత లాభం కోసం పార్టీలు మారుస్తున్న వారిని చిత్తుచిత్తుగా ఓడించాలని తెలిపారు. దళితుడిని సీఎం చేస్తానని, మూడు ఎకరాల భూమి, దళిత బంధు ఇస్తామని దళితులకు సీఎం కేసీఆర్ దగాచేశారన్నారు. కార్పొరేట్‌లకు దేశ సంపదను దోచిపెడుతున్న బీజేపీని, సుదీర్ఘ కాలం పాటు దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించి ప్రజలను పట్టించుకోని కాంగ్రెస్ పార్టీలకు గుణపాఠం చెప్పాలన్నారు. కాగా, గార్ల నుంచి ప్రారంభమైన ర్యాలీ 20 గ్రామాల మీదుగా సాగింది. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు పాలడుగు సుధాకర్, సీపీఐ(ఎం) నాయకులు కందునూరి శ్రీనివాస్, కందునూరి కవిత, భూక్య హరి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ను మార్చిన అధికారులు

- ఎన్నికలను బహిష్కరిస్తామని తండావాసుల ఆగ్రహం

నవతెలంగాణ చిలిపిచేడ్



మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలోని టోప్యా తండా గ్రామపంచాయతీలో గతంలో 85వ ఎన్నికల బూత్ ఏర్పాటు చేశారు. దాంతో వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా వారి తండాలోనే ఇప్పటివరకు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా, 85వ బూత్ గౌతాపూర్‌కు తరలించడంతో ఓటు వేసేది లేదంటూ మంగళవారం యువకులు పెద్ద ఎత్తున గ్రామపంచాయతీ వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 85వ బూత్‌లో 400 మంది ఓటర్లు ఉన్నట్టు తెలిపారు. ఇప్పటివరకు లేని ఇబ్బందులు ఈ ఎన్నికలకు ఎందుకు వచ్చాయని ప్రశ్నిస్తున్నారు. ఓటు వేసేది లేదంటూ ఈ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎన్నికల ఆఫీసర్, తహసీల్దార్ ముసాదిక్‌ను వివరణ కోరగా టోప్యా తండాకు గౌతపూర్‌కు 100 మీటర్ల దూరం లేదని, వెయ్యి మంది ఉంటేనే బూత్ ఏర్పాటు చేస్తారని తెలిపారు. తండావాసులు గతంలోనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే బూత్ ఏర్పాటు చేసే వాళ్లమన్నారు. ప్రస్తుతం గౌతాపూర్ గ్రామంలోనే ఓటు వేయాలని తెలిపారు.

12,343 సమస్యాత్మక ప్రాంతాల్లో భారీ బందోబస్తు

రంగంలోకి స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సెస్

- రాష్ట్రవ్యాప్తంగా అదుపులోకి రౌడీషీటర్లు
- దాదాపు లక్షమంది పోలీసులతో ఎన్నికల బందోబస్తు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల ప్రచార పర్వానికి మంగళవారం తెరపడడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించడానికి పోలీసు ఉన్నతాధికారులు నడుం బిగించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 12,343 అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో ఇప్పటి నుంచే భారీ ఎత్తున పోలీసు బలగాలను మొహరించారు. ఎన్నికల ప్రక్రియకు భంగం కలిగించే శక్తులపై ఇంటలిజేన్స్ వ్యవస్థతో డేగ కన్ను వేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలనుసారం ఎన్నికల నిబంధనలకు ఎక్కడా కూడా అవాంతరాలు రాకుండా స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లను రంగంలోకి దింపారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని 1600 మంది రౌడీషీటర్లతో పాటు ఇతర పోలీసు కమిషనరేట్లు, జిల్లాల్లోని రౌడీషీటర్లను ముందస్తు చర్యగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు. వీరిని 30వ తేదీ పోలింగ్ ప్రక్రియ ముగిశాక విడిచిపెట్టేలా డీజీపీ హెడ్ క్వార్టర్ నుంచి ఆదేశాలు వెళ్లాయి. మరోపక్క రాష్ట్ర సరిహద్దుల్లోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాన్ని అనుకుని ఉన్న భద్రాది కొత్తగూడం జిల్లా చర్ల మండలంలో మావోస్టులు ఒక బియ్యపు లోడ్ లారీని అడ్డగించి తగలబెట్టడం పోలీసులు ఉన్నతాధికారులను ఆందోళనకు గురిచేసింది. రాష్ట్రంలో జరిగే ఎన్నికల ప్రక్రియకు మావోస్టులు ఎలాంటి అవాంతరాలు కలగకుండా సమర్థవంతంగా నిర్వహిస్తామన్న అధికారులకు నక్సల్స్ ఈ చర్య కొంత మింగుడుపడనివ్వడం లేదు. దీంతో ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో మావోస్టుల కదలికలను అడ్డుకోవడానికి హుటాహుటిన అధికారులు అదనంగా గ్రౌండ్స్ బలగాలను తరలించారు. ఇదిలావుంటే హైదరాబాద్ పాతబస్తీతో పాటు నల్గొండ, భువనగిరి, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మతకలహాలు తలెత్తకుండా చూడడానికి ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌లతో అధికారులు రంగంలోకి దింపారు. అలాగే వివిధ రాజకీయ పక్షాల మధ్య కక్ష్యలు తలెత్తి ఘర్షణలు చోటుచేసుకుంటాయనే అనుమానాలు ఉన్న ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్‌లను ఆయా జిల్లాల ఎస్పీలు, నగర పోలీసు కమిషనర్లు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే లైసెన్స్‌డ్ గల ఆయుధాలను స్వాధీనం చేసుకున్న పోలీసు అధికారులు, స్వాధీనం చేయని మరికొన్ని ఆయుధాల కోసం గాలిస్తున్నారు. సమస్యలు తలెత్తుయన్న ప్రాంతాల్లో ముందస్తుగా 144సెక్షన్ డీజీపీ హెడ్ క్వార్టర్స్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు విధించారు. అలాగే అత్యంత కీలకమైన 354 ప్రాంతాల్లో విధించిన సీసీ కెమెరాల ద్వారా డీజీపీ హెడ్ క్వార్టర్ నుంచి పరిస్థితులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఈ సందర్భంగా డీజీపీ అంజనీకుమార్ నగర పోలీసు కమిషనర్లు, జిల్లాల ఎస్పీలతో ముగిసిన ప్రచార పర్వంపై సమీక్ష నిర్వహించారు. అలాగే పోలింగ్ కేంద్రాలకు తరలించే ఏవీఎంల వద్ద తగిన బందోబస్తు ఏర్పాటు చేయడంతో అవి సురక్షితంగా పోలింగ్ కేంద్రాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మణిపూర్‌లో నష్టపరిహార

ప్రక్రియలో జోక్యం వద్దు

- పౌర సంస్థలను ఆదేశించాలని కోరిన ఎస్‌సీ ప్యానెల్

న్యూఢిల్లీ : మణిపూర్ జాతుల మధ్య రేగిన హింసలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వమిస్తున్న రూ.10లక్షల నష్టపరిహారాన్ని 38 కుటుంబాలు తిరస్కరించిన నేపథ్యంలో ఈ ప్రక్రియలో జోక్యం చేసుకోకుండా పౌర సంస్థలను ఆదేశించాలని సుప్రీం కోర్టు నియమించిన ప్యానెల్ కోరింది. బాధిత కుటుంబాలను ఒప్పించేందుకు ఒకపక్క జిల్లా యంత్రాంగం ప్రయత్నిస్తుండగా, మరోపక్క ఎక్స్‌గ్రేషియా మొత్తాలను ఆమోదించాల్సిందిగా 38కుటుంబాలను కోర్టు ఆదేశించాలని ప్యానెల్ కోరింది. జమ్మూ కాశ్మీర్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి గీతా మిట్టల్ నేతృత్వంలోని కమిటీ తన నివేదికను అక్టోబరు 21న సుప్రీంకు అందచేసింది. ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ డిసెంబరు 4న ఈ కేసుపై విచారణ జరపనుంది. రాష్ట్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం, అక్టోబరు 7 నాటికి 175 మరణాలు నమోదు కాగా, 169కేసుల్లో మృతులను గుర్తించారు. వీటిలో 81 మృతదేహాలను బాధిత కుటుంబాలు క్లెయిమ్ చేశాయి.

నిర్మల్‌లో బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తల ఘర్షణ

రాళ్లు రువ్వుకొని, కర్రలతో దాడులు చేసుకున్న వైనం

పోలీసుల ప్రవేశంతో సద్దుమణిగిన ఘటన

నవతెలంగాణ-నిర్మల్



నిర్మల్ జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ కాలనీలో మంగళవారం బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజు కావడంతో ఉదయం బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విశ్వనాథ్‌పేట్, వైఎస్ఆర్ కాలనీలో ప్రచారానికి వెళ్లారు. అప్పటికే బీఆర్ఎస్ నాయకులు అక్కడ ప్రచారం చేస్తూ ఎదురయ్యారు. దీంతో ఒకరికి ఒకరు వ్యతిరేకంగా నినాదాలు చేసుకున్నారు. ఇది ఇరుపక్షాల మధ్య వాగ్వాదానికి దారితీసింది. ఘర్షణ ముదిరి రాళ్లు రువ్వుకొని, కర్రలతో దాడి చేసుకునే వరకు వెళ్లింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికెళ్లి వారిని చెదరగొట్టారు. కాలనీలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. ఓటమి భయంతోనే బీజేపీ ఈ దాడి చేసిందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆరోపించారు. తమకు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు ఓ ప్రణాళిక ప్రకారం దాడులకు దిగారని బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రతి ఆరోపణలు చేశారు.

బిజినెస్

తొలి యూపీఐ చెల్లింపునకు 4 గంటలు ఆగాల్సిందే..!

- రూ.2వేల పైబడిన మొత్తాలకు నిబంధన



న్యూఢిల్లీ : డిజిటల్ చెల్లింపుల్లో సైబర్ మోసాలను అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం కొత్త ఆలోచన చేస్తోందని సమాచారం. ఇద్దరు వ్యక్తుల మధ్య తొలి ఆన్‌లైన్ లావాదేవీకి నాలుగు గంటల వ్యవధి తర్వాతనే చెల్లింపులు జరిగేలా కొత్త నిబంధన ప్రవేశపెట్టనుంది. రిటైల్ లావాదేవీల్లో ఇబ్బంది లేకుండా రూ.2,000 కంటే ఎక్కువ మొత్తం చెల్లింపులకు మాత్రమే కొత్త నిబంధనను వర్తింపు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఓ కథనంలో తెలిపింది. సైబర్ మోసాలను అరికట్టేందుకు ఇది దోహదం చేయనుంది. కొత్తగా యుపిఐ ఖాతా ప్రారంభించినప్పుడు మొదటి 24 గంటల్లో కేవలం రూ.5,000 చెల్లింపునకు మాత్రమే అవకాశం ఉన్న విషయం తెలిసిందే.

రూ.1 లక్ష కోట్లు పెరిగిన అదాని స్టాక్స్ విలువ



ముంబయి : అదాని గ్రూపు కంపెనీల షేర్లు పరుగులు పెట్టాయి. అదాని సంస్థలపై వచ్చిన ఆర్థిక ఆరోపణల విచారణలో సెబీ విశ్వసనీయతను ప్రశ్నించడానికి ఎటువంటి కారణం కనడడటం లేదని సుప్రీంకోర్టు పేర్కొనడంతో మంగళవారం ఆ కంపెనీల స్టాక్స్ భారీగా పెరిగాయి. అదానికి చెందిన 10 లిస్టెడ్ కంపెనీల స్టాక్స్ విలువ ఒక్క పూటలోనే రూ.1.05 లక్ష కోట్ల మేర పెరిగి రూ.11..31 లక్షల కోట్లకు చేరింది. గడిచిన ఏడాదిన్నరలో ఒక్క రోజులో ఈ స్థాయిలో లాభపడటం ఇదే తొలిసారి. కాగా.. భారత స్టాక్ మార్కెట్లకు రెండు రోజుల వరుస నష్టాల నుంచి ఉపశమనం లభించింది. బిఎస్ఇ సెన్సెక్స్ 204 పాయింట్లు లేదా 0.31 శాతం పెరిగి 66,174 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 95 పాయింట్ల వృద్ధితో 19,890 వద్ద ముగిసింది. బిఎస్ఇలో మిడ్‌క్యాప్ సూచీ 0.30 శాతం, స్మాల్ క్యాప్ సూచీ 0.06 శాతం చొప్పున రాణించాయి.

ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ 98.14 క్లెయింల సెటిల్‌మెంట్

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 98.14 శాతం క్లెయింలను సెటిల్‌మెంట్ చేసినట్లు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ వెల్లడించింది. ప్రయివేటు రంగ జీవిత బీమా సంస్థలలో క్లెయిమ్ సెటిల్‌మెంట్ నిష్పత్తిలో తమ సంస్థనే అగ్రస్థానంలో ఉందని పేర్కొంది. 2023 జూన్ త్రైమాసికంలో 97.9 శాతం క్లెయిమ్‌లను సెటిల్‌మెంట్ చేసినట్టు తెలిపింది. ఖాతాదారులు, వారి కుటుంబాలకు చేసిన వాగ్దానాలను నెరవేర్చడంలో సంస్థ నిబద్ధతకు ఇది నిదర్శనమని పేర్కొంది.

ఐఫోన్ కేసుల తయారీకి టాటా భారీ నియామకాలు



న్యూఢిల్లీ : ఐఫోన్ కేసుల తయారీ విస్తరణకు టాటా గ్రూపు వేలాది మంది ఉద్యోగుల నియామకాలకు కసరత్తు చేస్తుందని సమాచారం. హోసూర్‌లో తన ఐఫోన్ కేసింగ్ తయారీ ప్లాంట్ సామర్థ్యాన్ని రెట్టింపు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం 500 ఎకరాల్లో 15,000 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఉద్యోగుల సంఖ్యను 25,000 నుంచి 28,000 వరకూ పెంచడానికి టాటా ఎలక్ట్రానిక్స్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ యోచిస్తోంది. నూతనంగా సమీకరించిన ఐఫోన్ అసెంబ్లింగ్ ప్లాంట్ సామర్థ్యాన్ని వినియోగించుకుంటూ.. ఈ రంగంలో మరింత రాణించడానికి ప్రణాళికలు రూపొందిస్తుందని రిపోర్టులు వస్తున్నాయి.

రూ.63వేల చేరువలో బంగారం ధర

న్యూఢిల్లీ : బంగారం ధర రూ.63వేల చేరువలో ఉంది. మంగళవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల పసిడి ధర రూ.100 పెరిగి రూ.62,750కి చేరిందని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ పేర్కొంది. కిలో వెండి ధర మాత్రం యథాతథంగా రూ.78,200గా నమోదయ్యింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక్క ఔన్స్ పసిడి ధర 4 డాలర్లు పెరిగి 2,014 డాలర్లుగా పలికింది. కాగా.. చెన్నయ్‌లో 10 గ్రాముల బంగారం ధర రూ.63,050కి చేరి ఆల్‌టైం రికార్డ్‌ను దాటాయి. అభరణాలకు ఉపయోగించే 22 క్యారట్ల బంగారం ధర రూ.57,800గా నమోదయ్యింది.

పిల్లల ఆరోగ్యంపై అవగాహన పెంపు

- ఫ్యూచర్ ఫుడ్ ఫౌండేషన్, కంట్రీ డిలైట్ జట్టు



హైదరాబాద్ : పిల్లల ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి, ఫ్యూచర్ ఫుడ్ ఫౌండేషన్, కంట్రీ డిలైట్ జట్టు కట్టాయి. రెండు సంస్థలు కలిసి రూపొందిస్తున్న క్యాంపెయిన్‌లో పాఠశాలకు వెళ్లే పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి సంబంధించిన పోషకాహారం, వ్యాయామం, విశ్రాంతి అంశాలపై అవగాహన పెంచనున్నట్లు పేర్కొన్నాయి. మంగళవారం హైదరాబాద్‌లో ఇరు సంస్థలు కలిసి నిర్వహించిన రౌండ్‌టేబుల్ చర్చ, సమావేశంలో 20 మందికి పైగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులకు 8-5-1-0 ఆరోగ్య నియమావళిని సిఫార్సు చేశాయి. ప్రతిరోజూ కనీసం ఎనిమిది గంటలు నిద్రపోవాలని, రూల్ ఆఫ్ 5లో సమతుల్య ఆహారం, ఒక గంట వ్యాయామం, నియమం '0' ఎలాంటి అనారోగ్యకరమైన ఆహారాలను తినకూడదని, ఆహారం వృధా చేయటాన్ని సహించరాదని, మొబైల్, టివి చూసే సమయాన్ని తగ్గించుకోవాలని ఫుడ్ ఫ్యూచర్ ఫౌండేషన్ సిఇఒ పవన్ అగర్వాల్, కంట్రీ డిలైట్ సహ వ్యవస్థాపకుడు చక్రధర్ తదితరులు సూచించారు.



సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన సందీప్‌కుమార్

హైదరాబాద్ : తెలంగాణ కామారెడ్డి జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయుడు బెండి వాసుదేవరావు కుమారుడు బెండి సందీప్ కుమార్ సివిల్ సర్వీస్ 2022 రిజర్వు లిస్టులో ఎంపికయ్యారు. సందీప్ కుమార్ కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలో ప్రాథమిక విద్య, మెదక్‌లో సిద్ధార్థ్ మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతి నుంచి పదో తరగతి వరకు, నారాయణ విద్యాసంస్థలో ఇంటర్మీడియట్, జేఎన్‌టీయూ హైదరాబాదు క్యాంపస్‌లో బీ.టెక్, ఎం.టెక్ చదివారు. తల్లి భారతి గ్రాడ్యుయేషన్, హిందీ పండిట్ టీచర్ ట్రైనింగ్ చేశారు. సందీప్‌కుమార్ సివిల్ సర్వీస్‌కు ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు, బంధువులు సంతోషం వ్యక్తంచేశారు.

కమ్యూనిస్టులను చట్టసభకు పంపుదాం...

రాష్ట్రంలో ఎన్నికల ప్రచార ఘట్టం ముగిసింది. ఎర్రన్నలులేని శాసనసభ ఎలా ఉంటుందో మనందరం చూసాం. 2018లో ఒక్క కమ్యూనిస్టు ఎమ్మెల్యేను కూడా మనం గెలిపించుకోకపోవడం మన రాష్ట్ర ప్రజల దురదృష్టం. ఎన్నికయిన పార్టీలకు మితిమీరిపోయిన అధికార పిచ్చి. అధికారం మీద ఉన్న మోజు ప్రజా సమస్యల పరిష్కారంపై లేకపాయె.

చట్టసభల్లో కమ్యూనిస్టులు ఎంత అవసరమో గత ఐదేండ్లలో జరిగిన తెలంగాణ రాష్ట్ర శాసనసభల్లో చూశాం. వారు మీద వీరు.. వీరి మీద వారు ఆరోపించుకోవడం తప్ప ప్రజా సమస్యల జాడే సభలో లేకపాయె. అలాంటి నాయకులను ఎన్నుకోవడం నిజంగా మన దురదృష్టం. ఇప్పటికైనా ప్రజలు మేల్కొని కమ్యూనిస్టుల అవశ్యకతను తెలుసుకొని వారిని చట్టసభకు పంపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 2018లో చేసిన తప్పే పునరావృతం చేస్తే.. ఆ సభల్లో ఎర్రన్నల అవసరాన్ని గుర్తు చేసుకోవడం... వారు ఉంటే బాగుండు అనుకోవడం తప్ప చేసేదేమీ ఉండదు....

ప్రజలకు - ప్రభుత్వాలకు వారథులు.. ప్రజా పోరాటాలకు సారథులు

కమ్యూనిస్టులను చట్ట సభకు పంపితే.. ప్రజల తరఫున ప్రతినిధులుగా వారుంటారు. ఇతర పార్టీల వారు ఉండరా అంటే ఉంటారు. కానీ, వారి సొంత లాభం కోసం, కాంట్రాక్టుల కోసం, స్వార్థ రాజకీయాల కోసం చర్చించడానికే సమయం సరిపోదు. ఇలాంటి సమయంలో కమ్యూనిస్టులను చట్ట సభలోకి పంపించటం అత్యవసరం. ప్రజా సమస్యలను ప్రభుత్వానికి వినిపించే వారధులుగా, అది వినిపించుకోకపోతే ఆ సమస్యల పట్ల ప్రజా పోరాటాలు నిర్వహించే సారథులుగా కమ్యూనిస్టులు ఎప్పుడూ ఉంటారు. ఇందుకు ఉదాహరణలు చాలా ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా కార్మికులకు ఎనిమిది గంటల పనివిధానం కోసం రక్తం చిందించిన చరిత్ర ఎర్రజెండాది. ఒకటేమిటి ప్రపంచంలో ఎర్రజెండా చేసిన పోరాటంలో అపజయం పొందిన పోరాటం లేదు. వెనకడుగు వేసిన చరిత్రా లేదు.

మన రాష్ట్రంలో సైతం అనేక పోరాటాలూ.. విజయాలూ ఉన్నాయి. గూడు లేని పేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పోరాటాలను అణచివేయాలని ప్రభుత్వం ఎంతో ప్రయత్నించింది. కానీ అక్కడ ఉంది ఎర్రజెండా నాయకులు. వారు ఎక్కడా వెనక్కి తగ్గలేదు. మీవెంటే మేమంటూ... నెత్తురు చిందించయినా పేదలకు భూమి దక్కేవరకూ కొట్లాడతామని పేదలకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వారి వీపులను పోలీసులకు అప్పగించారు. కేసుల పాలయ్యారు. విజయం సాధించారు. పేదల కోసం సీపీఐ(ఎం) రాష్ట్ర వ్యాప్తంగా బస్సు జాత నిర్వహించింది. దిగొచ్చిన ప్రభుత్వం.. ఎట్టకేలకు వారికి పక్కా ఇండ్లు కట్టిస్తామని హామీ ఇచ్చింది. ఇక్కడ విశేషమేమంటే.. పోరాటం చేసిన ఒక్క కమ్యూనిస్టు నాయకుడూ సెంటు భూమి కూడా ఆశించలేదు. ఇంతకంటే చెప్పడానికి ఏం కావాలి. ఈసారైనా సరే ప్రజలు మేల్కొని ఎర్రజెండా నాయకులకు ఓటేసి గెలిపించాలి.

అవకాశమివ్వండి మార్చి చూపిస్తారు..

కేరళలో ఉచిత విద్య, వైద్యం, నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన, లింగ సమానత్వం కేరళలో అగ్రస్థానంలో ఉంది. ఇందుకు కారణం అక్కడ కమ్యూనిస్టుల పాలనే. అక్కడ కుల మతాలకు తావులేదు. అందుకే తెలంగాణలో చట్ట సభలో కమ్యూనిస్టులకు అవకాశమిస్తే.. కూడు, గుడ్డ, నీడతోపాటు.. విద్య, వైద్యం తదితర అనేకమైన సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. అందుకే సుత్తి, కొడవలి, చుక్కా గుర్తుకు ఓటేద్దాం.. వారిని చట్ట సభకు పంపుదాం.



రెముడాల క్రాంతి రణదీవే కుమార్.
- 7993778211

కమ్యూనిస్టులను గెలిపించు కోకపోవడం మన తప్పిదమే

కమ్యూనిస్టుల సుదీర్ఘ ప్రయాణంలో నాటి వీర తెలంగాణ సాయుధ పోరాటం నుంచి మొదలుకొని వారు చేసిన త్యాగాలు అన్నీ ఇన్నీ కావు. ఎక్కడ చూసినా ఫలానా కమ్యూనిస్టు నాయకుడు భూములు పంచాడంటారు తప్ప... భూములు పెంచుకున్నాడన్న దాఖలాలు ఎక్కడా లేవు.నిజాం, రజాకార్ల, భూస్వాముల మెడలువంచిన కమ్యూనిస్టులు.. భూములను పేదలకు పంచిన చరిత్ర ఈ తెలంగాణది. అలాగే దేశవ్యాప్తంగా గ్రామీణులకు అతి ముఖ్యమైన ఉపాధి హామీ, దళిత, గిరిజనులు, ఆర్థికంగా బలపడటానికి ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ చట్ట రూపు దాల్చటంలో కమ్యూనిస్టులదే కీలకపాత్ర




222 సరిపోలేదు. మాక్స్‌వెల్ (104 నాటౌట్) మళ్లీ మ్యాడ్‌నెస్ చూపించాడు. 223 పరుగుల భారీ ఛేదనలో 134/5తో ఆస్ట్రేలియా ఓటమి అంచుల్లో నిలువగా.. మాక్స్‌వెల్ వదల్లేదు. 47 బంతుల్లోనే శతకం సాధించిన మాక్స్‌వెల్ 8 సిక్సర్లు, 8 ఫోర్లతో అరాచకం సృష్టించాడు. మాక్స్‌వెల్ అద్వితీయ ఇన్నింగ్స్‌తో మూడో టీ20లో ఆసీస్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఐదు మ్యాచుల సిరీస్‌లో సజీవంగా నిలిచింది. రుతురాజ్ గైక్వాడ్ (123 నాటౌట్) అజేయ సెంచరీతో తొలుత భారత్ 222/3 పరుగులు చేసింది.

మాక్స్‌వెల్ ఛేదించాడు

- 223 టార్గెట్ ఊదేసిన ఆసీస్
- రుతురాజ్ శతకం వృథా

మూడో టీ20లో ఆస్ట్రేలియా గెలుపు



నవతెలంగాణ-గువహటి

పరుగుల వరద పారిన గువహటి టీ20లో ఆస్ట్రేలియా ఉత్కంఠ విజయం సాధించింది. ఆఖరు బంతి థ్రిల్లర్‌లో భారత్‌పై 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌లో 1-2తో ఆశలు నిలుపుకుంది. 223 పరుగుల రికార్డు ఛేదనలో గ్లెన్ మాక్స్‌వెల్ (104 నాటౌట్, 48 బంతుల్లో 8 ఫోర్లు, 8 సిక్సులు) అజేయ సెంచరీతో చెలరేగాడు. చివరి 12 బంతులకు 43 పరుగులు అవసరమైన దశలో కెప్టెన్ మాథ్యూ వేడ్ (28 నాటౌట్, 16 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) తోడుగా అద్భుతం చేశాడు. అక్షర్ పటేల్ వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్లో వేడ్ చెలరేగగా.. ఆఖరు ఓవర్లో మాక్స్‌వెల్ మోత మోగించాడు. వికెట్ల వెనకాల ఇషాన్ కిషన్ వైఫల్యం భారత్‌ను గట్టి దెబ్బతీసింది. ట్రావిశ్ హెడ్ (35, 18 బంతుల్లో 8 ఫోర్లు) పవర్‌ప్లేలో ఆసీస్‌కు ధనాధన్ ఆరంభాన్ని అందించాడు. హార్డీ (16), ఇంగ్లిశ్ (10), స్టోయినిస్ (17), డెవిడ్ (0) నిష్క్రమణతో ఆసీస్ ఓ దశలో 134 పరుగులకే 5 వికెట్లు చేజార్చుకుంది. భారత్ గెలుపు లాంఛనమే అనుకున్న తరుణంలో మాక్స్‌వెల్ మ్యాడ్‌నెస్ చూపించాడు. 20 ఓవర్లలో 5 వికెట్లకు ఆసీస్ 225 పరుగులు చేసింది. ఇక, తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 222 పరుగులు చేసింది. ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ (123 నాటౌట్, 57 బంతుల్లో 13 ఫోర్లు, 7 సిక్స్‌లు) అజేయ సెంచరీతో చెలరేగగా.. సూర్యకుమార్ యాదవ్ (39), తిలక్ వర్మ (31 నాటౌట్) రాణించారు. భారత్, ఆసీస్ నాల్గో టీ20 శుక్రవారం రాయ్‌పూర్‌లో జరగనుంది.

గైక్వాడ్ సెంచరీ :

టాస్ నెగ్గిన ఆసీస్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. కానీ భారత్‌కు ఈసారి ఆశించిన ఆరంభం దక్కలేదు. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (6), ఇషాన్ కిషన్ (0) త్వరగా అవుటయ్యారు. పవర్‌ప్లేలో రెండు వికెట్లు చేజార్చుకున్న భారత్ 43 పరుగులే చేసింది. కెప్టెన్ సూర్య కుమార్ (39) తనదైన శైలిలో ఇన్నింగ్స్‌కు వేగం జోడించాడు. రెండు సిక్సర్లు, ఐదు ఫోర్లతో ఆకట్టుకునే ఇన్నింగ్స్ నమోదు చేశాడు. సూర్య సైతం నిష్క్రమించినా.. తిలక్ వర్మ (31 నాటౌట్) గైక్వాడ్‌కు జత కలిశాడు. పది ఓవర్లలో భారత్ 80/2తో నిలిచింది. ఇక్కడ నుంచి మొదలైన రుతురాజ్ దండయాత్ర ఇన్నింగ్స్ ఆఖరు బంతి వరకు కొనసాగింది. 9 ఫోర్లతో 32 బంతుల్లో అర్థ సెంచరీ సాధించిన గైక్వాడ్.. శతకాన్ని శరవేగంగా అందుకున్నాడు. సిక్సర్ల మోత మోగించి 52 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశాడు. గైక్వాడ్ దెబ్బకు ఆసీస్ బౌలర్లు బేజారిపోయారు. ఇన్నింగ్స్ 18వ ఓవర్లో ఆరోన్ హార్డీపై మూడు సిక్సర్లు, ఓ ఫోర్‌తో 25 పరుగులు పిండుకున్నాడు. అంతకముందు అతడు వేసిన ఓవర్లోనూ మూడు బౌండరీలతో మెరిశాడు. ఇక చివరి ఓవర్లో గ్లెన్ మాక్స్‌వెల్‌కు చుక్కలు చూపించాడు. మూడు సిక్సర్లు, రెండు ఫోర్లతో దండెత్తిన రుతురాజ్ ఏకంగా 30 పరుగులు పిండుకున్నాడు. రుతురాజ్ మెరుపులతో చివరి మూడు ఓవర్లలో భారత్ 67 పరుగులు పిండుకుంది. మరో ఎండ్‌లో తిలక్ వర్మ ఆశించిన షాట్లు ఆడలేకపోయాడు. అయినా, రుతురాజ్‌కు చక్కగా స్ట్రయిక్‌రొటేట్ చేసి మెప్పించాడు. ఆసీస్ బౌలర్లలో రిచర్డ్‌సన్, బెహన్‌డార్ఫ్, హార్డీ ఒక్కో వికెట్ తీశారు. బెహన్‌డార్ఫ్ నాలుగు ఓవర్లలో 12 పరుగులే ఇచ్చి బెరా అనిపించాడు.

శీతల్ దేవి వరల్డ్ నం.1
ప్రపంచ ఆర్చరీ ర్యాంకింగ్స్



న్యూఢిల్లీ : పారా ఆర్చర్ శీతల్ దేవి చరిత్ర సృష్టించింది. ప్రపంచ ఆర్చరీ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం కైవసం చేసుకుంది. ఆసియా పారా క్రీడల్లో రెండు స్వర్ణాలు సహా మూడు మెడల్స్ గెలుపొందిన శీతల్ దేవి.. మహిళల కాంపౌండ్ పారా ఆర్చరీ విభాగంలో వరల్డ్ నం.1గా నిలిచింది. రెండు చేతులు లేకపోయినా.. కాళ్లతో బాణాన్ని ఎక్కుపెట్టే శీతల్ దేవి పతక వేటలో ఎన్నడూ గురి తప్పలేదు. 230 పాయింట్లు సాధించిన శీతల్ దేవి.. ఈ ఏడాది ఉత్తమ యూత్ అథ్లెట్ ఆఫ్ ది ఇయర్ అవార్డును సైతం అందుకుంది.

ఆఫ్రికా నుంచి నమీబియా
2024 ఐసీసీ టీ20 ప్రపంచకప్



దుబాయ్ : ఐసీసీ 2024 టీ20 ప్రపంచకప్‌కు నమీబియా అర్హత సాధించింది. ఆఫ్రికా రీజియన్ క్వాలిఫయర్‌లో వరుసగా ఐదో విజయం సాధించిన నమీబియా వరుసగా మూడో సారి పొట్టి ప్రపంచకప్‌లో ఆడనుంది. మంగళవారం జరిగిన అర్హత టోర్నీ మ్యాచ్‌లో టాంజానియపై నమీబియా 58 పరుగుల తేడాతో విజయం సాధించింది. 2021 ప్రపంచకప్‌లో సూపర్12 దశకు చేరుకున్న నమీబియా.. 2022 ప్రపంచకప్‌లో తొలి దశ నుంచే నిష్క్రమించింది. ఆఫ్రికా నుంచి అర్హత సాధించేందుకు జింబాబ్వే సైతం ఆశలు సజీవంగా నిలుపుకుంది.

మనోళ్లకు రెండో స్థానం
ప్రపంచ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్



కౌలాలంపూర్ : భారత డబుల్స్ జోడీ సాత్విక్, చిరాగ్‌లు ప్రపంచ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానం సాధించారు. చైనా మాస్టర్స్ టోర్నీలో ఫైనల్స్‌కు చేరిన భారత స్టార్స్ రన్నరప్‌గా నిలిచారు. ఈ ప్రదర్శనతో మూడు స్థానాలు ఎగబాకిన చిరాగ్, సాత్విక్‌లు వరల్డ్ నం.2గా నిలిచారు. అక్టోబర్ 10న ప్రపంచ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం దక్కించుకున్న ఈ జోడీ.. ఆ తర్వాత డెన్మార్క్, జపాన్ మాస్టర్స్‌లో పేలవ ప్రదర్శనతో శిఖర స్థానం కోల్పోయింది. ఇప్పుడు రెండో స్థానంతో మళ్లీ వరల్డ్ నం.1కు చేరువైంది.

వంద రోజుల వేడుకలా ఉంది : మహేష్‌బాబు



రణ్‌బీర్ కపూర్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'యానిమల్'. రష్మిక మందన్న కథానాయిక. ఈ చిత్రాన్ని భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ టి-సిరీస్, ప్రణయ్ రెడ్డి వంగా భద్రకాళి పిక్చర్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మించాయి.

ఈ చిత్రం డిసెంబర్ 1న హిందీ, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం వంటి 5 భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రీరిలీజ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్శిటీలో నిర్వహించింది. హీరో మహేష్‌బాబు, దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి ముఖ్య అతిథులుగా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది. మహేష్ బాబు మాట్లాడుతూ, "యానిమల్'కు మీరు ఇంతగా ఆదరణ చూపిస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా ట్రైలర్ చూశా.. మెంటలొచ్చేసింది. ఇంత ఒరిజినల్ ట్రైలర్ నేను ఇప్పటివరకూ చూడలేదు. సందీప్ చాలా యూనిక్, ఒరిజినల్ ఫిల్మ్ మేకర్. అడ్వాన్స్ బుకింగ్స్‌లో ఈ సినిమా సెన్సేషన్ క్రియేట్ చేసిందని విన్నా. ఇది ప్రీ రిలీజ్ ఈవెంట్‌లా లేదు. వందరోజుల వేడుకలా ఉంది' అని అన్నారు.

'ఫార్ములాని పక్కన పెట్టి సినిమా చేయగలనని నిరూపించిన దర్శకుడు సందీప్ వంగా. ఈ టీజర్ వచ్చిన వెంటనే ఈ సినిమాని ఖచ్చితంగా చూడాలనిపించింది' అని దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి అన్నారు. రణ్‌బీర్ కపూర్ మాట్లాడుతూ,'నేను నటుడిని అయితే నీ తండ్రి పాత్ర చేస్తానని అనిల్‌కపూర్ అనేవారు. ఆ కల ఈ సినిమాతో నిజమైంది' అని తెలిపారు. 'రాజమౌళి మనందరికీ స్ఫూర్తి. మహేష్ బాబు ఈ వేడుకకు రావడం చాలా అనందంగా ఉంది. యానిమల్ ఇప్పటివరకూ చూడని తండ్రీకొడుకుల బెస్ట్ లవ్ స్టొరీ. ప్రతి ఫ్రేం మిమ్మల్ని ఎంటర్టైన్ చేస్తుంది. రణ్‌బీర్‌కపూర్, అనిల్ కపూర్, రష్మిక, బాబీ ఇలా అద్భుతమైన తారాగణం తమ గొప్ప పెర్ఫార్మెన్స్‌లతో అలరిస్తారు. డిసెంబర్ 1న అందరూ థియేటర్స్‌కి వచ్చి ప్రతి ఫ్రేంని ఎంజాయ్ చేయండి' అని తెలిపారు.

కంటెంట్ ఉంటే ఏ సినిమానైనా ప్రేక్షకులు ఆదరిస్తారు

కంచర్ల ఉపేంద్ర హీరోగా, సావిత్రి కృష్ణ హీరోయిన్‌గా ఆర్యన్ సుభాన్ ఎస్.కె. దర్శకత్వంలో ఎస్.ఎస్.ఎల్.ఎస్. క్రియేషన్స్ పతాకంపై కంచర్ల అచ్యుతరావు నిర్మించిన చిత్రం 'ఉపేంద్ర గాడి అడ్డా'. ఈ సినిమా డిసెంబర్ 1న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో కంచర్ల ఉపేంద్ర మీడియాతో సంభాషించారు.

'కొత్తగా పరిచయం కాబోతున్న నన్ను హీరోగా పెట్టి మా నాన్న ఒకేసారి ఐదు సినిమాలు తీస్తుండటం నా అదృష్టం. వైజాగ్ సత్యానంద్ దగ్గర నటనలో శిక్షణ తీసుకున్నా. ఆ తర్వాత నా కొచ్చిన కాన్ఫిడెన్స్‌తో ముందుకు సాగాను. ఒక కొత్త హీరో ప్రేక్షకులకు దగ్గరయ్యే అన్ని అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి. సెప్టెంబర్ 2న పవన్ కళ్యాణ్ పుట్టినరోజు నా మొదటి సినిమా మొదలైంది. ఆ తర్వాత అక్టోబర్‌లో మరో సినిమా స్టార్ట్ అయ్యింది. ఇక ఈ సినిమాని యూత్ ఫుల్, మాస్, ఎంటర్ టైనర్‌గా రూపొందించాం. ప్రతివారూ కనెక్ట్ అవుతారు. సోషల్ మీడియాను యూజ్ చేసేవారు కూడా ఈ సినిమా గురించి తెలుసుకుంటారు. ఈ సినిమాలో నా పేరు ఉపేంద్ర. నేను పుట్టిన అడ్డాలో కథ మొదలవు తుంది. అందుకే ఈ టైటిల్ పెట్టాం. కథాపరంగా డిమాండ్ కూడా చేసింది. నా చుట్టూనే కథ తిరుగుతుంది. ఇందులో ఓ చక్కటి సందేశం కూడా ఉంది. ఫోన్ ఉంటే, దాన్ని యూజ్ చేసుకునే విధానంలో ఎటువంటి మంచి చెడులను చూపాం. స్త్రీలు ఏ విధంగా వీటిని యూజ్ చేస్తున్నారు. అలాగే సమాజంలో విలువలు ఏ విధంగా ఉంటాయి అనేవి చూపించాం. దర్శకుడిలో క్రియేటివిటీ ఉంది. తను చెప్పినట్లు తీయగలిగాడు. ఇందులో నాలుగు పాటలున్నాయి. హీరోయిన్ బెంగుళూరు అమ్మాయి. మా నాన్న 11 సినిమాలు చేయాలని నియమం పెట్టుకున్నారు. ఇప్పటికే నాలుగు సినిమాలు 70 శాతం పూర్తయ్యాయి. ప్రస్తుతం '1920 భీమునిపట్నం' సినిమా రన్నింగ్‌లో ఉంది. ఇక కంచర్ల, సినిమా కథ మా తాతలు చేసిన భూదానం నేపథ్యంలో సినిమా ఉంటుంది. అలాగే సైంటిస్ట్ కథతో మరో సినిమా. ఐ.పి.సి. కథతో ఇంకొక సినిమా రన్నింగ్‌లో ఉంది. మా సినిమాతోపాటు 'యానిమల్' వంటి సినిమాలు విడుదలవు తున్నాయి.కంటెంట్ ఉంటే ప్రేక్షకులు ఎటువంటి సినిమాకైనా థియేటర్‌కు వస్తారు. నరసింహ నందిగారితో కూడా మంచి సినిమా చేస్తున్నా. మిగిలిన దర్శకులు కూడా టాలెంటెడ్ పర్సన్సే. నాన్న నిర్మాణంతోపాటు పలు సేవా కార్యక్రమాలను కూడా చేస్తున్నారు. ఉపకార్ ఛారిటబుల్ ట్రస్ట్‌తో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సంక్రాంతికి నా తదు పరి సినిమాలు రిలీజ్ అవుతాయి. అన్ని రకాల పాత్రలు చేయాల నుంది. ఫలానా మార్క్ అనేది నాకు లేదు.ఓ నటుడిగా ప్రేక్షకుల్ని అలరించడమే నా లక్ష్యం' అని అన్నారు.



కంచర్ల ఉపేంద్ర



నాని, శృతిహాసన్

ఇక ప్రతి పార్టీలోనూ ఒడియమ్మ సందడే..

నాని నటిస్తున్న ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'హాయ్ నాన్న'. వైర ఎంటర్‌టైన్‌మెంట్ మొదటి ప్రొడక్షన్ వెంచర్‌గా శౌర్యువ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం నుంచి మంగళవారం నాలుగో పాట 'ఒడియమ్మ..'ను వర్ధమాన్ కాలేజ్‌లో జరిగిన గ్రాండ్ ఈవెంట్‌లో లాంచ్ చేశారు. ఈ సందర్భంగా స్టూడెంట్స్‌తో కలసి హీరో నాని వేదికపై 'ఒడియమ్మ..' పాటకు డ్యాన్స్ చేసి సందడి చేశారు.

సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో నాని మాట్లాడుతూ,'ఇలాంటి ఎనర్జిటిక్ సాంగ్‌ని ఇంత ఎనర్జిటిక్ ఆడియన్స్ ముందు లాంచ్ చేయడం ఆనందంగా ఉంది. ఇక్కడ మీ అందరినీ చూస్తుంటే ఫస్ట్ డే మార్నింగ్ షో హౌస్ ఫుల్ థియేటర్‌ని చూస్తున్నట్లు ఉంది. ఈ సినిమాకి మీ ఛైర్మన్ నిర్మాత అనే కంటే మీరంతా నిర్మాతలే. ఇది మీ ప్రొడక్ట్. మీరు వోన్ చేసుకోవచ్చు. రిలీజ్ రోజున టికెట్స్ దొరక్కపోతే ఇది మా సినిమా మాకు టికెట్స్ ఇవ్వకపోవడం ఏమిటనే అడగండి(నవ్వుతూ). ఈ పాట మీ అందరికీ నచ్చడం ఆనందంగా ఉంది. ఇకపై మీరు ఎక్కడికి వెళ్ళిన, పార్టీ ఎక్కడ జరిగినా ఈ పాటే మోగాలి. డిసెంబర్ 7న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదలౌతుంది. ఇది మన సినిమా. అందరూ థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేయండి' అని అన్నారు

'ఈ కాలేజ్ నా ఫ్యామిలీ లాంటింది. ఛైర్మన్ విజయేందర్ రెడ్డి నా బ్రదర్ లాంటి వారు. డిసెంబర్ 7 హాలీడే అని చెప్పేశారు కాబట్టి అందరూ సినిమా చూడండి' అని దర్శకుడు శౌర్యువ్ చెప్పారు.

నిర్మాత డాక్టర్ విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ,'సహజంగా ఈ వేదికపై నిలుచుని లెక్చర్స్ ఇస్తాను. కానీ ఈ రోజు సినిమా వేడుకలో మాట్లాడటం చాలా ప్రత్యేకమైన అనుభూతి. నానికి ధన్యవాదాలు' అని తెలిపారు.

పాన్-ఇండియా స్థాయిలో రూపొందిన ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించగా, బేబీ కియారా ఖన్నా కీలక పాత్రలో కనిపించనుంది.

ఈ చిత్రాన్ని మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల భారీ ఎత్తున నిర్మించారు. ఈ చిత్రానికి సాను జాన్ వర్గీస్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఎడిటర్‌గా ప్రవీణ్ ఆంథోని, ప్రొడక్షన్ డిజైనర్‌గా అవినాష్ కొల్లా పని చేస్తున్నారు. సతీష్ ఈవీవీ ఎగ్జిక్యూటివ్ నిర్మాత.

నవచిత్రం

అందరికీ నచ్చేలా.. అన్ని అంశాలతో అథర్వ

క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్‌లో క్లూస్ టీం ప్రాముఖ్యతను చూపించేలా తెరకెక్కించిన చిత్రం 'అథర్వ'. నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో పెగ్గో ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మించారు. కార్తీక్ రాజు, సిమ్రాన్ చౌదరి, ఐరా హీరో, హీరోయిన్లుగా నటించారు. మహేష్ రెడ్డి దర్శకత్వం వహించగా, సుభాష్ నూతలపాటి తెరకెక్కించారు. విజయ, ఝాన్సీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్‌గా వ్యవహరించారు.

డిసెంబర్ 1న ఈ చిత్రం థియేటర్లోకి రాబోతోంది. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాత సుభాష్ నూతలపాటి మీడియాతో మాట్లాడుతూ, 'నేను యూకేలో ఎంబీఏ స్టూడెంట్‌ని. ఇండియాకు వచ్చినప్పుడు మా నాన్నకి సినిమాల మీద ఇంట్రెస్ట్ ఉందని అన్నారు. ఆయకు సపోర్ట్‌గా నిలిచాను. ఇంతకు ముందే వేరే బ్యానర్‌లో ఓ సినిమాను చేశాం. మాకు టెక్నికల్‌గా 'అథర్వ' రెండో చిత్రం. దర్శకుడు మహేష్ రెడ్డి నాకు కథ నెరేట్ చేసిన విధానం నచ్చింది. ఎంతో డీటైలింగ్‌గా అనిపించింది. క్లూస్ డిపార్ట్మెంట్ గురించి బాగా చెప్పారు. కథ నచ్చడంతో సినిమా స్టార్ట్ చేశాం. ప్రస్తుతం అందరూ థ్రిల్లర్ మూవీస్‌ను ఇష్టపడుతున్నారు. ఇందులో సస్పెన్స్, థ్రిల్లింగ్ అంశాలు చాలా ఉంటాయి.

ఇన్‌స్టాగ్రాం ద్వారా కార్తీక్ రాజు ప్రొఫైల్స్ వచ్చాయి. మా దర్శకుడికి నచ్చడంతో పాత్రకు సెట్ అవుతారని తీసుకున్నారు. ఆయన ఎలా నటించారో ప్రేక్షకులే చెబుతారు. సినిమాను మరింత బాగా తీయాలనే ఉద్దేశంతోనే ఖర్చు పెట్టాం. ఈ సినిమా కోసం స్పెషల్ సెట్స్ వేశాం. వాటి గురించి ఇప్పుడే చెప్పలేం. సినిమా చూస్తే అందరికీ అర్థం అవుతుంది. ఇందులో ఇద్దరు హీరోయిన్లు ముఖ్యమైన పాత్రల్లో కనిపిస్తారు. ఒకరు క్రైమ్ రిపోర్టర్‌గా నటిస్తే, ఇంకొకరు సినిమాలో సినిమా హీరోయిన్‌గా నటించారు.

ఈ చిత్రంలో అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి. అన్ని రకాల జోనర్లు ఇందులో ఉన్నాయి. చరణ్ కెమెరా వర్క్ అద్భుతంగా ఉంటుంది. శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్‌తోనే సినిమా మీద అంచనాలు పెరిగాయి. వినయ్, ఉద్ధవ్ ఎడిటింగ్ బాగుంటుంది. మా ఫ్యామిలీ సినిమా చూశారు. ఒక్కొక్కరికి ఒక్కో పాయింట్ నచ్చింది. ముఖ్యంగా ట్విస్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. యానిమల్ సినిమా ప్రభావం కొంత ఉన్నప్పటికీ మా సినిమాపై మేం చాలా నమ్మకంతో ఉన్నాం.



క్లూస్ డిపార్ట్మెంట్ మీద ఇంత వరకు సినిమా రాలేదు. వారు చేసే పనిని ఇందులో మరింత డీటైలింగ్‌గా చూపిస్తాం. ప్రతీ పది నిమిషాలకు ఓ ట్విస్ట్ ఉంటుంది. మా డైరెక్టర్ మహేష్ రెడ్డి బ్రదర్ క్లూస్ టీంలో పని చేస్తున్నారు. క్లూస్ టీం వెంకన్నతో మా డైరెక్టర్ ఆరు నెలలు కలిసి రీసెర్చ్ చేశారు. క్లూస్ టీంకు ప్రివ్యూ వేస్తే వారంతా చాలా ఎమోషనల్ అయ్యారు.

- నిర్మాత సుభాష్ నూతలపాటి



అనుబంధాలు, విలువలతో షష్టి పూర్తి

రూపేష్ హీరోగా ఎంఎఎ ఎఎబి ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న సినిమా 'షష్టిపూర్తి'. రాజేంద్ర ప్రసాద్, అర్చన ప్రధాన పాత్రధారులు. ఆకాంక్షా సింగ్ కథానాయిక. పవన్ ప్రభ దర్శకుడు. రూపేష్ చౌదరి నిర్మాత. దర్శకుడు అనిల్ రావిపూడి చేతుల మీదుగా ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదలైంది. లుక్ చాలా బావుందని, సినిమా ఘన విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దర్శకుడు పవన్ ప్రభ మాట్లాడుతూ, 'పిల్లలు ఎవరైనా తమ తల్లిదండ్రుల పెళ్లి చూడలేరు. షష్టిపూర్తి ద్వారా ఆ లోటు తీర్చుకునే నేపథ్యంలో రూపొందుతున్న చిత్రమిది. 'లేడీస్ టైలర్' తర్వాత రాజేంద్ర ప్రసాద్, అర్చన కలిసి నటిస్తున్న చిత్రమిది. సినిమాలో ఐదు పాటలు ఉన్నాయి. సంగీతపరంగా బలమైన భావోద్వేగాలను ఆవిష్కరించడానికి ఇళయరాజా అయితే న్యాయం చేస్తారని మా నమ్మకం' అని చెప్పారు.

హీరో, నిర్మాత రూపేష్ మాట్లాడుతూ, 'కుటుంబ బంధాలు, విలువల నేపథ్యంలో రూపొందుతున్న చిత్రమిది. 80 శాతం చిత్రీకరణ పూర్తి అయ్యింది. 80 లొకేషన్స్‌లో చిత్రీకరించాం. త్వరలో కొత్త షెడ్యూల్ మొదలు పెడతాం. నేను నటిస్తూ ఇలాంటి మంచి చిత్రాన్ని నిర్మించడం ఆనందంగా ఉంది' అని చెప్పారు.



భారతదేశంలో ఓటు హక్కు

మన దేశంలో మహిళల ఓటు హక్కు ఉద్యమం బ్రిటీష్ పాలనలో కలోనియల్ ఇండియాలో రాజకీయ హక్కు కోసం పోరాడింది. 1918లో బ్రిటన్ ఆస్తిపరులకు పరిమిత ఓటుహక్కును మంజూరు చేసినప్పుడు, సామ్రాజ్యంలోని ఇతర ప్రాంతాలలోని బ్రిటిష్ పౌరులకు చట్టం వర్తించదు. భారతీయ ఓటింగ్ నిబంధనలను అధ్యయనం చేయడానికి పంపిన బ్రిటిష్ కమిషన్‌లకు మహిళలు, పురుషులు సమర్పించిన పిటిషన్‌లు ఉన్నాయి. అయితే మోంటాగు-చెమ్స్‌ఫోర్డ్ సంస్కరణల్లో మహిళల డిమాండ్‌లు విస్మరించబడ్డాయి. 1919లో సౌత్‌బరో ఫ్రాంచైజీ ఎన్నికల నియంత్రణ సంస్కరణలను ఖరారు చేయడానికి సమావేశమైన హౌస్ ఆఫ్ లార్డ్స్ అండ్ కామన్స్ జాయింట్ సెలెక్ట్ కమిటీ ముందు, హౌస్ ఆఫ్ లార్డ్స్, కామన్స్ ముందు ఓటు హక్కుదారులు మహిళలకు ఓటు వేయడానికి మద్దతుగా నివేదికలను సమర్పించారు. వారికి ఓటింగ్ హక్కులు లేదా ఎన్నికలలో నిలబడే హక్కు ఇవ్వనప్పటికీ భారత ప్రభుత్వ చట్టం 1919 ప్రకారం ఆస్తి, ఆదాయం లేదా విద్యా స్థాయిలను బట్టి మహిళలు ఓటు వేయడానికి ప్రావిన్షియల్ కౌన్సిల్‌లను అనుమతించింది.



ఓటు హక్కు ఎలా వచ్చింది..?

రేపు రాష్ట్రంలో ఎన్నికలు జరగబోతున్నాయి. మన ఓటు హక్కును ఉపయోగించుకోవల్సిన సమయం వచ్చేసింది. అయితే మనల్ని పాలించే పాలకులను ఎన్నుకునే అవకాశం అంటే ఓటు వేసే హక్కు మనకు అంత తేలిగ్గా రాలేదు. ప్రపంచ దేశాల మహిళలు ఎన్నో పోరాటాలు చేస్తే ఈరోజు మనం ఓటు వేస్తున్నాం. కాబట్టి పోరాడి సాధించుకున్న ఓటును మనం ఎలాంటి వారికి వేస్తున్నామో ఆలోచించాలి. మన కోసం నిస్వార్థంగా పని చేసే పాలకులను ఎన్నుకోవాలి. ఇంతకీ మహిళలకు ఓటు హక్కు ఎలా వచ్చిందో అప్పట్లో వారు చేసిన పోరాటాలు ఏ రూపంలో ఉన్నాయో తెలుసుకుందాం...

మాక్కూడా ఓటు హక్కు కావాలని బ్రిటన్‌లో మహిళలు మొట్టమొదటిసారి డిమాండ్ చేశారు. కానీ పాలకుల నుండి అది సాధ్యం కాదనే సమాధానం వచ్చింది. దీంతో ఓటు హక్కు కోసం పోరాడుతున్న మహిళలు ప్రభుత్వ నియమాలను, ప్రజల అభిప్రాయాన్ని మార్చాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం ఒక ఆటను, పోస్టు కార్డులను ఉపయోగించుకోవాలని వారు నిర్ణయించుకున్నారు. 19వ శతాబ్దపు చివరి భాగంలో వారు సాగించిన ఆ ప్రచారం సృజనాత్మకతకు మారుపేరుగా నిలిచింది. 'సాధ్యం కాదు' అనే సమాధానాన్ని మహిళలు ఒప్పుకోలేదు. అందుకే సృజనాత్మక ప్రచారాన్ని తమ ఆయుధంగా మలచుకున్నారు. 'సఫ్రేజెట్టో' అనే ఒక ఆటను, పోస్టు కార్డుల సాయంతో ఓటు హక్కు కోసం పోరాడిన మహిళలు ప్రభుత్వ నియమాలను, ప్రజాభిప్రాయాన్ని శాశ్వతంగా మార్చేశారు.

'సఫ్రేజెట్టో' ఏమిటి?

చూడడానికి అవి చాలా సాధారణంగా, ఎలాంటి ప్రాముఖ్యతా లేని ఆట వస్తువులుగా కనిపిస్తాయి. కానీ సరైన చేతుల్లో పడితే, వాటికి సమాజాన్ని మార్చేసే శక్తి ఉందని ఓటు హక్కు కోసం పోరాడిన ఆనాటి మహిళలు నిరూపించారు. బ్రిటన్‌లో ఓటు హక్కు కోసం పోరాడుతున్న మహిళలు తమ భావాలను, అభిప్రాయాలను వ్యాప్తి చేయడానికి ఆటలే మంచి సాధనాలని గ్రహించారు. ఒక ఆట ద్వారా తమ ఆలోచనలను రాజకీయ వర్గాలూ, తద్వారా చట్టసభల వరకు తీసుకెళ్లవచ్చని వారు భావించారు.

ఆటతో మొదలై...

"నిజానికి అది ఒక మంచి మార్కెటింగ్ టూల్" అని ప్రొఫెసర్ సెనియా పసేటా అన్నారు. 2018 నాటికి బ్రిటన్‌లో మహిళలకు ఓటు హక్కు కల్పించి వందేండ్లు పూర్తయిన సందర్భంగా ఆక్స్‌ఫర్డ్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌కు ఆమె క్యూరేటర్‌గా వ్యవహరించారు. దగ్గర నుంచి చూస్తే, 'సఫ్రేజెట్టో' గేమ్ ఇతర బోర్డులకు భిన్నంగా ఉంటుంది. దీనిలో 16 చిన్న ఆకుపచ్చ పావులు, 5 పెద్ద పావులు ఉంటాయి. ఓటు హక్కు కోసం పోరాడుతున్న మహిళలను, వాళ్ల నాయకురాళ్లను సూచిస్తాయి. పోలీసులు అడ్డుకునే లోపు 'హౌస్ ఆఫ్ కామన్స్' చేరుకుంటే ఆటలో గెల్చినట్లు. నిజజీవితంలో మాదిరే, ఈ ఆట మధ్యలో పట్టుబడితే జైలుకో, ఆస్పత్రికో వెళ్లాల్సిందే.



ఓటు హక్కు ప్రచారం కోసం...

"ఈ ఆటను బ్రిటిష్ మహిళల సామాజిక, రాజకీయ సంస్థ (డబ్ల్యూఎస్‌పీయూ) సభ్యురాళ్లు సృష్టించారు. మహిళలకు ఓటు హక్కు ప్రచారం కోసం నిధులు సేకరించడానికి ఆ ఆటను ఉపయోగించుకున్నారు. ఆ మహిళల వ్యూహం, నాటి సామాజిక పరిస్థితిని వాళ్లెంత బాగా అర్థం చేసుకున్నారు? వాళ్లకు ఎంత సెన్సాఫ్ హ్యూమర్ ఉంది?... ఇలాంటి విషయాలను ఆ ఆట తెలియపరుస్తుంది" అని ప్రొఫెసర్ పసేటా అంటారు. మాస్ కమ్యూనికేషన్‌లో ఇప్పటి ట్విటర్‌కన్నా ముందున్న మహిళలు ఓటుహక్కు సాధించాలన్న లక్ష్యంతో అతి తక్కువ నిధులతో తమ పోరాటాన్ని ప్రారంభించారు.

నెట్‌వర్కింగ్, సాధికారత

ఆ రోజుల్లో మీడియాపై నియంత్రణల వల్ల కొన్నిసార్లు ఉద్యమంలో కొన్ని ముఖ్యమైన వార్తలను చేరవేయడానికి, మద్దతు కూడగట్టడానికి, నిధుల సేకరణకు పోస్టుకార్డుల ఉద్యమం బాగా ఉపయోగపడింది. ఈ ఉద్యమం ప్రధానంగా మహిళా వాలంటీర్లపై ఆధారపడింది. తద్వారా వారి సాధికారత పెరిగి, మహిళలు తమ శక్తియుక్తులను గ్రహించడం ప్రారంభించారు. ఈ ఉద్యమం ద్వారా మొదటిసారి మహిళలను వారి నైపుణ్యాలు, వారు చేపట్టే పనుల ఆధారంగా వర్గీకరించారు. వారిని వివిధ కార్యకలాపాల కోసం ఉపయోగించుకోవడం ప్రారంభమైంది. ఈ ఉద్యమంలో పాల్గొన్న నటీమణులు తమ గొంతును ఎలా ఉపయోగించుకోవాలో ఉద్యమకారులకు శిక్షణను ఇచ్చేవారు. కళాకారులు పోస్టర్లు, బ్యానర్లు తయారు చేసి ఇచ్చేవాళ్లు. రచయితలు ప్రసంగాలు తయారు చేసి ఇస్తే, టీచర్లు సాయంత్రం క్లాసులు తీసుకునేవాళ్లు.మంచి అవగాహన ఉండేది

ప్రపంచానికి తమ గొంతు వినిపించారు

యూకేలో మహిళల ఓటు హక్కు కోసం పోరాటం తీవ్రంగా సాగుతుండగానే వాళ్ల ప్రపంచంలోని ఇతర చోట్ల కూడా మహిళల జీవితాలు, రాజకీయ కార్యకలాపాల గురించి తెలుసుకోవడానికి ఆసక్తి చూపించారు. అప్పటికే న్యూజీల్యాండ్, నార్వేలలో మహిళలకు ఓటు హక్కు లభించింది. కానీ మిగతా చోట్ల మాత్రం వారికి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. యూకేలో మహిళల ఓటు హక్కు కోసం జరిగిన పోరాటం, దేశ సరిహద్దులను దాటి ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల మహిళలను ఆ దిశగా కార్యోన్ముఖులను చేసింది. ఆనాటి పోరాట యోధులకు ప్రపంచవ్యాప్తంగా మహిళల పరిస్థితుల గురించి చాలా అవగాహన ఉండేది. దీనికి నాటి వుమెన్స్ సఫ్రేజెట్ జర్నల్, ఓట్స్ ఫర్ వుమెన్ ప్రచురణలు సాక్ష్యం.

ఓటు హక్కును విస్తరించేందుకు

ఫ్రాంచైజీని పొడిగించడంపై చర్చించేందుకు రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని కమిషన్ సిఫార్సు చేసింది. మహిళల అభిప్రాయాలు సేకరించి మూడు రౌండ్ టేబుల్స్ నుండి నివేదికలను బ్రిటిష్ పార్లమెంట్ జాయింట్ కమిటీకి పంపించారు. ఓటింగ్ వయసును 21 ఏండ్లకు తగ్గించాలని సిఫార్సు చేశారు. అయితే ఆస్తి, అక్షరాస్యత, అలాగే వారి వైవాహిక స్థితిపై మహిళల ఓటు హక్కు ఆధారపడి వుంటుంది. ఈ నిబంధనలు భారత ప్రభుత్వ చట్టం 1935లో పొందుపరచబడ్డాయి. ఇది ఎన్నికల అర్హతను పొడిగించింది. అయితే భారతదేశంలో 2.5శాతం మంది మహిళలకు మాత్రమే ఓటు వేయడానికి అనుమతిపొందారు. దాంతో తర్వాత కాలంలో అందరికీ ఓటు హక్కు కావాలని ఎన్నో పోరాటాలు జరిగాయి. 1946లో భారత రాజ్యాంగ పరిషత్ ఎన్నికైనప్పుడు 15 సీట్లు మహిళలకే దక్కాయి. వారంతా కొత్త రాజ్యాంగాన్ని రూపొందించడంలో సహాయపడ్డారు. ఏప్రిల్ 1947లో అసెంబ్లీ సార్వత్రిక ఓటు హక్కును అంగీకరించింది.

మొదటిసారి ఇద్దరు మహిళలు

1919 - 1929 మధ్య అన్ని బ్రిటీష్ ప్రావిన్స్‌లు, అలాగే చాలా ప్రిన్స్లీ స్టేట్‌లు మహిళలకు ఓటు హక్కును మంజూరు చేశాయి. కొన్ని సందర్భాల్లో స్థానిక ఎన్నికలలో నిలబడటానికి అనుమతించాయి. 1919 లో మద్రాసు నగరంలో, 1920లో ట్రావెన్‌కోర్ రాజ్యం, ఝలావర్ రాష్ట్రం, బ్రిటీష్ ప్రావిన్స్‌లలో, మద్రాస్ ప్రెసిడెన్సీ, బాంబే ప్రెసిడెన్సీ 1921లో విజయం సాధించాయి. రాజ్‌కోట్ రాష్ట్రం 1923లో పూర్తి సార్వత్రిక ఓటుహక్కును మంజూరు చేసింది. ఆ ఏడాది భారతదేశంలో లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు మొదటి సారి ఇద్దరు మహిళలు ఎన్నికయ్యారు. 1924లో ముద్దిమాన్ కమిటీ తదుపరి అధ్యయనాన్ని నిర్వహించి బ్రిటీష్ పార్లమెంట్ మహిళలను ఎన్నికలలో నిలబడటానికి అనుమతిం చాలని సిఫార్సు చేసింది. ఇది 1926లో ఓటింగ్ హక్కులపై సంస్కరణను రూపొందించింది. 1927లో కొత్త భారతదేశ చట్టాన్ని రూపొందించ డానికి సైమన్ కమిషన్‌ను నియమించారు. కమిషన్‌లో భారతీ యులు లేనందున, జాతీయవాదులు వారి సమావేశాలను బహిష్కరించారు. ఇది మహిళా సమూహాలలో చీలికలను సృష్టించింది. వారు ఒక వైపు సార్వత్రిక ఓటు హక్కుకు అను కూలంగా, మరోవైపు విద్యా ఆర్థిక ప్రమాణాల ఆధారంగా పరిమిత ఓటు హక్కును కొనసాగించడానికి అనుకూలంగా ఉన్నారు.



ఇందిరమ్మ రాజ్యమంటే అరాచకాలే

(మొదటిపేజీ తరువాయి)

నలిగిపోతున్న సమయంలో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ పెట్టి రెండు రూపాయలకు కిలో బియ్యం తీసుకొచ్చి వారి ఆకలి తీర్చారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణకు ఏమీ చేయలేదని, ఒక్క మెడికల్ కాలేజీ కూడా ఇవ్వలేకపోయారని అన్నారు. బీజేపీని మనం ఎందుకు నెత్తిన పెట్టుకోవాలని ప్రశ్నించారు. 24 ఏండ్లుగా తెలంగాణనే ఆశగా.. శ్వాసగా బతుకుతున్న గజ్వేల్ తన గౌరవాన్ని పెంచిదని, సీఎంను చేసి తనను ఈ స్థాయికి తెచ్చిందని అన్నారు. గజ్వేల్ రోల్ మోడల్‌గా ఎదిగిందని, మరోసారి అవకాశం ఇస్తే ఈ కీర్తిని మరింత ఇనుమడింపచేస్తానని తెలిపారు. ఎన్నికల ప్రచారం ముగింపు రోజైన మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్, వరంగల్ జిల్లా వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో ఆయన మాట్లాడారు.

యాభై ఏదేండ్ల కాంగ్రెస్ పాలనలో రక్తపాతం సృష్టించారని, పదవులు కావాల్సిన వారికి ఇందిరమ్మ రాజ్యం అవసరమని, తెలంగాణ ప్రజలకు అవసరం లేదని తెలిపారు. ఎమర్జెన్సీ సృష్టించి 400 మందిని పొట్టన పెట్టుకున్న కాంగ్రెస్‌కు మళ్లీ అధికారం ఇవ్వొద్దని కోరారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఒక్క మెడికల్ కళాశాల ఇవ్వకపోయినా.. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జిల్లాకు ఒకటి ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఇలాంటి సమయంలో బీజేపీకి ఓటు వేసి పిచ్చి పోచిగాళ్లం కావొద్దన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులకు పొలం లేదు, పొద్దు లేదు, రైతుల గురించి అసలే తెలియదని, ధరణి ఎత్తేస్తే భూములు అమ్ముకోవచ్చని వారు చూస్తున్నారని ఆరోపించారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ జలాశయాల నిర్వాసితుల త్యాగాన్ని తాను ఎప్పుడూ మరువలేదని, వారికి ఉపాధి కోసం అనేక పరిశ్రమలు తీసుకురావడానికి మంత్రి కేటీఆర్ ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల తర్వాత వాటిని గజ్వేల్ ప్రాంతంలో ఏర్పాటు చేస్తామన్నారు. గజ్వేల్ ప్రాంతం తనకు ముఖ్యమంత్రి పదవి ఇచ్చిందని, ఈ గడ్డను ఎప్పుడూ మరువనని స్పష్టంచేశారు. గజ్వేల్ అభివృద్ధిని దేశ విదేశాల ప్రజా ప్రతినిధులు, ఐఏఎస్, ఐపీఎస్‌లు వచ్చి పరిశీలిస్తున్నారంటే ఏ స్థాయిలో అభివృద్ధి జరిగిందో చెప్పనక్కరలేదన్నారు. కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, తెలంగాణ ఫారెస్ట్ చైర్మెన్ వంటేరు ప్రతాపరెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మెన్ కాంతారావు, గజ్వేల్ మున్సిపల్ చైర్మెన్లు రాజమౌళి, రాఘవేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో ఇండ్లు వేసుకున్న వారికి పట్టాలు

వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో కేసీఆర్ మాట్లాడుతూ.. ముగింపు సభ ఓరుగల్లులో నిర్వహించడం మంచి పరిణామమని, వరంగల్ నగరం తనకు సెంటిమెంట్ నగరమని తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో ఇండ్లు వేసుకున్న వారికి పట్టాలు ఇస్తామని, ఇప్పటికే కొంతమందికి ఇచ్చామని, మిగతావారికి కూడా అందజేస్తామని తెలిపారు. వరంగల్ పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిన ప్రొఫెసర్ జయశంకర్, కాళోజీ నారాయణరావుల సాక్షిగా మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ కొలువుదీరుతుందన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఎమర్జెన్సీ, కరెంటు కోతలు, ఆకలి చావులు, ఎన్‌కౌంటర్లు, నిర్బంధాలు, అని.... అలాంటి దుష్టపాలన తెలంగాణ ప్రజలకు అవసరమా అని అన్నారు. పదేండ్ల కిందట పురుడు పోసుకున్న తెలంగాణ రాష్ట్రం.. బీఆర్ఎస్ ప్రభుత్వ కృషితో అన్ని రంగాల్లో దూసుకుపోతున్నదని, ప్రశాంతంగా ఉన్న రాష్ట్రాన్ని ఆగం చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ చూస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆటో కార్మికులు చెల్లించే ట్యాక్స్‌లను ఎన్నికల అనంతరం రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఆకాశాన్ని ముద్దు పెట్టుకునేలా బహుళ అంతస్తుల్లో అత్యాధునికమైన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం మీ కండ్లముందే జరుగుతుందన్నారు. కాంగ్రెస్ హయాంలో నిజాంలు నిర్మించిన ఆజామ్ జాహీ మిల్లును సర్వనాశనం చేయడమే కాకుండా మిల్లు స్థలాలను రియల్ ఎస్టేట్‌గా అమ్ముకున్నారని తెలిపారు. నిధుల విషయంలో రాజీ పడకుండా కొట్లాడి మరీ తెచ్చుకొని నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తున్న వారిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉన్నదని అన్నారు. సభలో మంత్రులు సత్యవతి రాథోడ్, వేముల ప్రశాంత్ రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాష్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎంపీ పసునూరి దయాకర్, మేయర్ గుండు సుధారాణి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సైలెన్స్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎన్నికల ప్రచార రణగొణ ధ్వనులు బంద్ అయ్యాయి. ఈ రెండు రోజులూ ఓటరే రారాజు. ఎక్కడైనా ఎన్నికల కోడ్ నిబంధనల ఉల్లంఘన జరిగితే పోలీస్ కేసులు తప్పవని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ హెచ్చరించారు. రాష్ట్రంలో సైలెంట్ పీరియడ్ మొదలైందనీ, 144వ సెక్షన్ అమల్లోకి వచ్చిందని చెప్పారు. గురువారం జరిగే పోలింగ్‌కు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. మంగళవారంనాడిక్కడి ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వికాస్‌రాజ్ మాట్లాడారు. సోషల్ మీడియాలోనూ ఎన్నికల ప్రచారం నిషిద్ధమనీ, ఈసీ అనుమతి పొందిన ప్రకటనలకు ప్రింట్ మీడియాలో అవకాశముంటుందని చెప్పారు. ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు పూర్తయ్యింది. కొన్ని నియోజకవర్గాల్లో శాంతి భద్రతల దృష్ట్యా సాయంత్రం 4 గంటలకే ప్రచారాన్ని నిలిపివేయాలని ఈసీ ఆదేశించింది.

సోషల్ మీడియాతో పాటు సినిమా హాళ్లు, టీవీలు, రేడియోలు, కేబుల్ నెట్‌వర్క్‌ల్లో కూడ రాజకీయ ప్రచారం చేయరాదు. రాజకీయపార్టీలు పంచే ఓటరు స్లిప్పులపై పార్టీల గుర్తులు ఉండకూడదు. పోలింగ్ ముగిసిన అరగంట తర్వాత వరకు ఎగ్జిట్‌పోల్స్ నిషేధం.

ఎన్నికల నిర్వహణ విధుల్లో ఉన్న 1.48 లక్షల మంది ముందస్తుగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. బుధవారం ఉదయం నుంచి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి ఎన్నికల సామాగ్రిని పోలింగ్ బూత్‌లకు తరలించే ప్రక్రియ ప్రారంభమవుతుంది. ప్రిసైడింగ్ ఆఫీసర్లు సహా ఎవరికి ఎక్కడ డ్యూటీలు కేటాయించారనే వివరాలన్నీ సీల్డ్ కవర్లలో ఉంటాయి. సంబంధిత సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు వచ్చాకే ఈ సీల్డ్ కవర్లు ఓపెన్ చేసి, డ్యూటీలు ఎక్కడ పడిందీ చెప్తారు.

ఓటర్ల తరలింపునకు వాహనాలు సమకూర్చడం నేరం. ఇప్పటికే ఈసీఐఎల్ సాంకేతిక సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు చేరుకున్నారు.

30వ తేదీ ఉదయం 5.30 గంటలకు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. ఈవీఎమ్‌ల వద్దకు ఏజెంట్లు వెళ్ళకూడదు. అక్కడి వైర్లను తాకరాదు. అందుకు భిన్నంగా వ్యవహరిస్తే సదరు ఏజెంట్లను బూత్ నుంచి బయటకు పంపేస్తారు.

27,094 పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ ఉంటుంది. 7,571 ప్రాంతాల్లో పోలింగ్ స్టేషన్ల బయట కూడా వీడియో కెమెరాలు ఏర్పాటు చేస్తారు. ఇవన్నీ పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానమై ఉంటాయి.

పోలింగ్ స్టేషన్లకు ఈవీఎమ్‌ల తరలింపు రాకపోకలు ఒకే రూట్‌లో జరగాలి. మధ్యలో ఎక్కడా వాహనాలు నిలుపరాదు.

ఓటర్ల సెల్‌ఫోన్లను పోలింగ్ బూత్‌లోకి అనుమతించరు. 12 వేలకు పైగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు.

బీఆర్ఎస్ పార్టీ బుధవారం నిర్వహించే దీక్షా దివస్ అనుమతి కోసం తమకు ఎలాంటి దరఖాస్తులు అందలేదని వికాస్‌రాజ్ ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ఓడిపోతే తన శవయాత్ర జరుగుతుందని ఎన్నికల ప్రచారంలో కామెంట్ చేసిన పాడి కౌశిక్‌రెడ్డి అంశం ఇంకా తమ దృష్టికి రాలేదనీ, ఎన్నికల పరిశీలకుల నివేదిక వచ్చాక చూస్తామని అన్నారు.

స్థానికేతరులు నియోజకవర్గాల నుంచి వెళ్లిపోవాలి. పోలింగ్ సరళి పరిశీలనకు అభ్యర్థితో పాటు ఒకే వాహనానికి అనుమతి ఉంటుంది.

పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎమ్‌లు స్ట్రాంగ్ రూములకు వెళ్లే వరకు సదరు వాహనాలను అభ్యర్థి లేదా వారి తరఫు ఏజెంట్లు ఫాలో కావొచ్చు.

మొత్తం 35,655 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు. తొలిసారిగా 27,178 మంది ఇండ్ల నుంచి ఓట్లు వేశారు.

ఓటరు స్లిప్ ఓటరు గుర్తింపు కాదు. అది కేవలం సమాచార పత్రం మాత్రమే. ఓటరు ఆ స్లిప్‌తో పాటు తప్పనిసరిగా ఎన్నికల సంఘం సూచించిన ఫోటో గుర్తింపు కార్డుల్ని వెంట తీసుకెళ్లాలి.

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి మంగళవారం ఉదయం 9 గంటల వరకు నిర్వహించిన తనిఖీల్లో రూ.737 కోట్ల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు.

పోలింగ్ రోజున రాష్ట్రంలోని ప్రయివేటు సంస్థలు, ఐటీ కంపెనీలు తప్పనిసరిగా సెలవు ప్రకటించాలి. ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించాలి. 2018 అసెంబ్లీ, 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో పలు సంస్థలు సెలవులు ఇవ్వలేదనే ఫిర్యాదులు వచ్చాయి. అందువల్ల ఈసారి అన్ని సంస్థలు సెలవు ఇచ్చాయో, లేదో కార్మిక శాఖ పరిశీలించాలి. అందుకు భిన్నంగా వ్యవహరించే సంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

మేము పాలకులం కాదు..ప్రజా సేవకులం

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న కేసీఆర్ కుటుంబం తప్ప.. ప్రజలు బాగుపడలేదని చెప్పారు.

రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. మేము పాలకులము కాదు.. ప్రజల సేవకులమన్నారు. తెలంగాణలో ప్రవేశపెట్టిన పథకాలు అన్నింటిలో 30 శాతం కమీషన్ తీసుకున్న ఘనత కేసీఆర్ కుటుంబానికి దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపరిచిన ఆరు గ్యారంటీలను తమ ప్రభుత్వం అధికారంలో రాగానే అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ తెలంగాణకు చేసినదేమీలేదని, ప్రజలను మోసం చేస్తూ తన ఆస్తులను పెంచుకున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజలను మోసం చేసిన కేసీఆర్‌ను గద్దె దించే సమయం ఆసన్నమైందన్నారు. మల్కాజ్‌గిరి అభ్యర్థి మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ.. మల్కాజిగిరి ప్రజలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానని, అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు. ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు.

మృత్యుంజయులు!

డెహ్రాడూన్ : ఎట్టకేలకు గత 17 రోజులుగా సొరంగంలో చిక్కుకుపోయిన 41మంది కార్మికులు ఒక్కొక్కరుగా బాహ్య ప్రపంచంలోకి వచ్చారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిపుణుల బృందాలు, అధికార యంత్రాంగం రాత్రనకా పగలనకా శ్రమించి, 400గంటలకు పైగా ముమ్మరంగా కొనసాగించిన సహాయక చర్యలు ఫలించాయి. రాత్రి 8గంటలకు మొదట కార్మికుడు బయటకు రాగా, మొత్తంగా అందరినీ బయటకు తీసుకురావడానికి మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుందని అధికారులు అంచనా వేసినా ఒక గంటలోనే అందరినీ విజయవంతంగా బయటకు తీసుకువచ్చారు. బయటకు తీసుకొచ్చిన వెంటనే వారిని అప్పటికే సిద్ధం చేసి వుంచిన అంబులెన్సుల ద్వారా ఆస్పత్రులకు తరలించారు. వారి శారీరక, మానసిక ఆరోగ్యాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసేందుకు అక్కడ డాక్టర్లు సిద్ధంగా వున్నారు.

ఉత్తరకాశీ జిల్లాలోని సిల్క్యారా వద్ద సొరంగం నిర్మాణ పనులు జరుగుతుండగా, ఈ నెల 12న ఒక్కసారిగా సొరంగం కుప్పకూలడంతో 41మంది కార్మికులు లోపల చిక్కుకుపోయారు. అప్పటి నుండి వారిని వెలుపలకు తీసుకొచ్చేందుకు అనేక రకాలుగా ప్రయత్నించారు. సొరంగం ముఖ ద్వారం వద్ద భారీగా పడివున్న శిథిలాల దిబ్బలను తొలగించే క్రమంలో అధికారులకు అనేక సవాళ్లు ఎదురయ్యాయి. నేలకు సమాంతరంగా తవ్వుతున్న పనులకు పదే పదే ఆటంకాలు ఏర్పడి ముందుకు సాగకపోవడంతో నిలువుగా కొండను తవ్వేందుకు కూడా సిద్ధపడ్డారు. సొరంగానికి అడ్డంగా కూలిన శిథిలాల దిబ్బలను తొలగించేందుకు రప్పించిన అగర్ యంత్రం కూడా అనేకసార్లు సతాయించడంతో అధికారులకు ఈ తొలగింపు చర్యలు సవాలుగా మారాయి. సొరంగంలో 57 మీటర్ల వద్ద శిథిలాల తొలగింపులో యంత్రాలు పనిచేయకపోవడంతో ర్యాట్ హోల్ మైనర్ల సాయంతో మాన్యువల్ డ్రిల్లింగ్ చేపట్టి విజయవంతంగా పూర్తి చేశారు.

కార్మికులు బయటకు వచ్చిన వెంటనే ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ దామి, కేంద్ర సహాయ మంత్రి జనరల్ రిటైర్డ్ వి.కె.సింగ్ వారిని కలుసుకున్నారు. వారిని పూలమాలలతో సత్కరించి, ఆలింగనం చేసుకుని పరామర్శించారు. తమ వారి కోసం కళ్లలో వత్తులు వేసుకుని సొరంగం వద్ద వేచి చూస్తున్న వారి కుటుంబ సభ్యుల సంతోషానికి అవధుల్లేకపోయాయి.

ప్రశ్నించే గొంతుల్ని గెలిపించండి

(మొదటిపేజీ తరువాయి)

హుజూర్‌నగర్ గడ్డ ఎరుపెక్కింది. అడుగడుగునా ప్రజలు బృందాకరత్, సీపీఐ(ఎం) అభ్యర్థి మల్లు లక్ష్మికి అభివాదం చేస్తూ ఉత్సాహం నింపారు. ప్రజలు పూల జల్లు కురిపించారు. ఎన్ని ర్యాలీలు జరిగినా సీపీఐ(ఎం) రోడ్డు షోకు మంచి స్పందన ఉందని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. పొట్టిశ్రీరాములు సెంటర్‌లో జరిగిన సభలో బృందాకరత్ ప్రసంగించారు. ఇది రోడ్ షో మాత్రమే కాదు పోరాటాల షో అని చెప్పారు.

ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేసి గెలవాలని చూస్తున్నారన్నారు. వారికి ఓట్లతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఎర్రజెండా ఒక సిద్ధాంతం కోసం, పేదల కోసం పని చేస్తుందని చెప్పారు. తమ పార్టీ పోటీ చేస్తుంది వ్యక్తుల కోసం, పార్టీ కోసం కాదని, పేద ప్రజల కోసమే అన్నారు. ఎన్ని కష్టాలు ఉన్నా నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుంది ఒక ఎర్రజెండా మాత్రమే అన్నారు. కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రజలకు చేసిందేమీలేదన్నారు. మల్లు లక్ష్మిని గెలిపిస్తే ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇస్తామన్నారు. ప్రజాస్వామ్యం ధనస్వామ్యం మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో ప్రతి ఓటరూ ఆలోచించి సీపీఐ(ఎం)కు ఓటేసి మల్లు లక్ష్మిని గెలిపించాలని కోరారు. సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి నాగారపు పాండు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే అభ్యర్థి మల్లు లక్ష్మి జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, పార్టీ నాయకులు పారేపల్లి శేఖర్ రావు, కొలిశెట్టి యాదగిరి, నెమ్మాది వెంకటేశ్వర్లు, కోటా గోపి, చెరుకు ఏకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీరు పొంగింది

హైదరాబాద్ : బీరు అమ్మకాలు వేసవిలో పెరగడం సర్వసాధారణం. ఎందుకంటే వేసవి తాపం నుండి ఉపశమనం పొందేందుకు మద్యపాన ప్రియులు ఎక్కువగా బీరును ఆశ్రయిస్తుంటారు. కానీ తెలంగాణలో మాత్రం చలికాలంలోనూ జోరుగా బీరు అమ్మకాలు జరుగుతున్నాయి. తెలంగాణ శాసనసభకు గురువారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మద్యం ఏరులై పారుతోంది. డబ్బు, మద్యం ఎర చూపి ఓటర్లను బుట్టలో వేసుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు ఒక దానితో ఒకటి పోటీ పడుతున్నాయి. ఈ కారణంగానే రాష్ట్రంలో బీరు అమ్మకాలు పెరిగాయని పరిశీలకులు చెబుతున్నారు. ఈ నెల 1వ తేదీ నుండి 20వ తేదీ వరకూ రాష్ట్రంలో 22 లక్షల కేసుల బీరు అమ్ముడుపోయిందని ఎక్సైజ్ శాఖ వర్గాలు 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రికకు తెలిపాయి. ఎన్నికల తేదీ సమీపించే కొద్దీ అమ్మకాలు జోరు మరింత పెరిగింది.

ఇదే సమయంలో మద్యం అమ్మకాలు కూడా ఓ మోస్తరుగా పెరిగాయి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రాకముందు నుండే పార్టీలు, అభ్యర్థులు ఓటర్లను మద్యం మత్తులో ముంచేయడం ప్రారంభించారు. మద్యాన్ని భారీగా కొనుగోలు చేసి నిల్వ చేశారు. ఇప్పుడు దానిని ఎన్నికల అధికారుల కంట పడకుండా విడుదల చేస్తూ పంపిణీ చేస్తున్నారు. బీరుతో పోలిస్తే లిక్కర్ అమ్మకాలు పెద్దగా పెరగలేదు. ఈ నెల 1 నుండి 20వ తేదీ వరకూ రూ.1,470 కోట్ల విలువైన మద్యాన్ని అమ్మారు. గత సంవత్సరం ఇదే కాలంలో రూ.1,260 కోట్ల విలువైన మద్యాన్ని విక్రయించారు. అయితే అభ్యర్థులు ముందుగానే పెద్ద ఎత్తున మద్యాన్ని కొనుగోలు చేసి నిల్వ చేశారని, అందుకే ఇప్పుడు అమ్మకాల్లో పెద్దగా పెరుగుదల కన్పించడం లేదని పరిశీలకులు తెలిపారు. 'బీరు మాదిరిగానే మద్యాన్ని కూడా అభ్యర్థులు పెద్ద ఎత్తున ముందుగానే కొని నిల్వ చేశారు. గడచిన నెల రోజుల్లో అధికారులు రూ.100 కోట్ల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీనినిబట్టి వాస్తవ పరిస్థితి అర్థమవుతుంది' అని ఓ ప్రభుత్వాధికారి చెప్పారు.

రాష్ట్రంలోని మద్యం దుకాణాలు మంగళవారం సాయంత్రమే మూతపడ్డాయి. పోలింగ్ ముగిసే వరకూ వాటిని మూసి ఉంచుతారు. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీలు, అభ్యర్థులు ముందుగానే షాపుల యజమానులతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. తమకు అవసరమైన మద్యాన్ని సరఫరా చేసేలా ఏర్పాట్లు చేసుకున్నారు.

2018 ఎన్నికల సమయంలో వాతావరణం ఇందుకు భిన్నంగా ఉంది. పోలింగ్‌కు ముందు మద్యం అమ్మకాలు తగ్గాయి. 2017లో అదే కాలంతో పోలిస్తే అమ్మకాలు ఏకంగా 35% పడిపోయాయి. కఠిన చర్యలు తీసుకోవడం వల్లనే అమ్మకాలు తగ్గాయని ఎన్నికల అధికారులు అప్పట్లో చెప్పుకున్నారు.

నిరంతరం పోరు బాటలోనే..

అనేక సమస్యలకు పరిష్కారం చూపాం • ఎర్రజెండా అండతోనే ఎన్నో సాధించాం

సీతారాం ప్రాజెక్టు నుంచి పోడు పట్టాల పంపిణీ వరకు సీపీఐ(ఎం) కీలకపాత్ర

పాలేరులో ఆ ఇద్దరు అభ్యర్థులది అవకాశవాదం..

పోటీ చేసిన స్థానాల్లో కొన్నైనా గెలుస్తాం..

'నవతెలంగాణ'తో సీపీఐ(ఎం) పాలేరు నియోజకవర్గ అభ్యర్థి తమ్మినేని



"నిరంతరం పోరుబాటలోనే ఉంటూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అనేక ఉద్యమాల్లో నేరుగా పాల్గొన్నాను. ఎంపీ, ఎమ్మెల్యేగా ప్రజాసమస్యలపై చట్టసభల్లో గళం విప్పాను. పదవిలో ఉన్నా లేకున్నా పోరాటాల ద్వారా అనేక సమస్యలకు పరిష్కారం చూపించడంలో తనవంతు భూమిక పోషించాను. నాపై పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులిద్దరూ ఏనాడూ ప్రజా సమస్యలపై పోరాటం చేయలేదు. చట్ట సభల్లో స్పందించలేదు. నియోజకవర్గంలో వ్యవసాయా ధారిత పరిశ్రమలు నెలకొల్పాల్సిన అవసరం ఉంది" అని పాలేరు నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఎన్నికల ప్రచారానికి ముగింపునకు ముందు 'నవతెలంగాణ'తో తమ్మినేని ప్రత్యేకంగా మాట్లాడారు. చట్టసభల్లో కమ్యూనిస్టుల అవసరం ఉందన్నారు. ఆ అవసరాన్ని గుర్తించి పాలేరులో సీపీఐ(ఎం)ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాసమస్యలపై పోరాటాలు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 53 చోట్ల పేదలకు భూములు సాధించాం. సీపీఐతో కలిసి భూపోరాటాలు చేశాం. 1980-90 ప్రాంతంలో వ్యవసాయ కూలీల కోసం పోరాటం చేశాం. 2002లో చంద్రబాబు హయాంలో పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని పోరాడాం. బషీర్‌బాగ్‌లో జరిగిన కాల్పుల్లో ప్రాణాలు విడిచిన రామకృష్ణ ఆరోజు నా పక్కనే ఉన్నారు. భూ సమస్యలపై ముదిగొండలో జరిగిన పోరాటంలో ఏడుగురు ప్రాణాలు విడిచారు. పోరాట ఫలితంగా నాటి వైఎస్ఆర్ ప్రభుత్వం దిగివచ్చి పాండు రంగారావు కమిషన్ వేసింది.

భూ నిర్వాసితుల సమస్యపైనా...

కేసీఆర్ హయాంలో వివిధ ప్రాజెక్టుల కింద భూ నిర్వాసితుల సమస్యపై పోరాడాం. మల్లన్న సాగర్ భూనిర్వాసితుల సమస్య దీనిలో కీలకం. ఇండ్ల స్థలాల సమస్యపై 22 జిల్లాల్లో పోరాటాలు నిర్వహించాం. లక్షలాది మందిని నిర్బంధించారు. సామాజిక న్యాయం కోసం 4,200 కి.మీ మేర మహాజన పాదయాత్ర చేపట్టాను. గొర్రెల పంపిణీ, దళితులకు మూడు ఎకరాల భూమి వంటివి సాధించాం.

పాదయాత్రలు.. సైకిల్ యాత్రలు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడు లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేసే దుమ్ముగూడెం ప్రాజెక్టు సాధన కోసం 2003లో పాదయాత్ర చేపట్టాను. వందరోజుల పాటు 2,600 కి.మీ పైగా ఈ యాత్ర కొనసాగింది. ఫలితంగానే నేటి సీతారామ ప్రాజెక్టుకు బీజం పడింది. తిరిగి ఈ ప్రాజెక్టు నిధుల జాప్యంపై పాదయాత్ర మొదలుపెట్టడంతో రూ.600 కోట్లను అప్పటి వైఎస్ఆర్ ప్రభుత్వం మంజూరు చేసింది. దళితవాడల అభివృద్ధి కోసం సైకిల్‌యాత్ర చేశాను. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు సాధించుకున్నాం. గిరిజనుల పోడు భూముల కోసం చట్టసభల్లో పోరాడాం. అటవీహక్కుల చట్టం తెచ్చుకోగలిగాం. గిరిజనులు లక్షల ఎకరాలకు పోడు పట్టాలు పొందారు.

పాలేరు నియోజకవర్గ పరిస్థితిపై..

పాలేరు నియోజకవర్గాన్నే కాదు.. ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలి. వ్యవసాయాధారిత పరిశ్రమలు నెలకొల్పాలి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల వంటివి రావాలి. మేత కొరత దృష్ట్యా గొర్రెల ఫామ్‌లు ఏర్పాటు చేయాలి. దళితబంధు అవినీతిమయమయింది.

దీన్ని రూపుమాపి ఈ స్కీమ్ సక్రమంగా కొనసాగేలా చూడాలి. రాష్ట్రంలో 14 లక్షల కుటుంబాలుంటే దళితులకు మూడు ఎకరాల హామీ కేవలం 16వేల ఎకరాలకే పరిమితమైంది. ఆధునిక ఆస్పత్రులు, డిగ్రీ కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాలు నెలకొల్పాల్సిన అవసరం ఉంది. ఇవి రావాలంటే ఈ నియోజకవర్గంలో సీపీఐ(ఎం) తప్పక గెలవాల్సిన అవసరం ఉంది.

ఆ ఇద్దరిదీ అవకాశవాదం..

ప్రధాన పార్టీలు బీఆర్ఎస్ అభ్యర్థి కందాల ఉపేందర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డివి అవకాశవాద రాజకీయాలు. వాళ్ల డబ్బుపై ఆధారపడి రాజకీయం చేస్తున్నారు. ఇలాంటి అభ్యర్థుల వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదు. రాష్ట్రంలో సీపీఐ(ఎం) 19 స్థానాల్లో పోటీ చేసింది. వీటిలో కొన్నైనా గెలుస్తామనే నమ్మకం ఉంది.

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



ఖమ్మంలో... తల్లాడలో... ముష్టికుంట్లలో...

చివరిరోజు హోరెత్తిన ప్రచారం

అందుబాటులో ఉండని, పార్టీలు మారే అభ్యర్థులను ఓడించండి

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్

• మధిరలో పాలడుగు గెలుపు కోరుతూ ర్యాలీ • ఖమ్మం, తల్లాడలో బైక్ ర్యాలీ

నవతెలంగాణ - బోనకల్/ ఖమ్మం/ తల్లాడ/

15 ఏండ్లుగా ఎమ్మెల్యేగా ఉంటూ ఏనాడూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండని మల్లు భట్టి విక్రమార్కను, తరచూ పార్టీలు మార్చే లింగాల కమల్‌రాజును ఓడించి ప్రజల కోసమే పని చేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థి పాలడుగు భాస్కర్‌ను గెలిపించాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ మధిర నియోజకవర్గ ఓటర్లను అభ్యర్థించారు. బోనకల్ మండలం ముష్టికుంట గ్రామంలో సోమవారం రాత్రి సీపీఐ(ఎం)అభ్యర్థి భాస్కర్ విజయాన్ని కాంక్షిస్తూ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ప్రధాన వీధుల గుండా ఈ ర్యాలీ కొనసాగింది.

ఈ సందర్భంగా జరిగిన సభలో వెంకట్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ మద్దతు పలుకుతున్నారని, లింగాల కమల్ రాజు గెలిచినా ఒకటే బిజెపి అభ్యర్థి గెలిచిన ఒకటే అన్నారు. బిజెపి, బీఆర్ఎస్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నికరంగా పోరాడే సీపీఐ(ఎం) అభ్యర్థి పాలడుగు భాస్కర్‌ను శాసనసభలోకి పంపాల్సిన బాధ్యత మధిర నియోజకవర్గ ఓటర్లందరిపై ఉందన్నారు. మధిర నియోజకవర్గ ప్రజల, నియోజకవర్గ అభివృద్ధి గురించి మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో మాట్లాడిన పాపాన పోలేదన్నారు. సీపీఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ మధిర నియోజకవర్గ అభివృద్ధి బోడేపూడి మరణంతో నిలిచిపోయిందన్నారు. పదవుల కోసం పాకులాడే, డబ్బు సంచులతో వస్తున్న మల్లు భట్టి విక్రమార్కను, లింగాల కమల్ రాజును ఈ ఎన్నికలలో ఓడించకపోతే నియోజకవర్గ అభివృద్ధి జరగదు అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, నాయకులు బంధం శ్రీనివాసరావు, కందికొండ శ్రీనివాసరావు, కొంగర వెంకటనారాయణ, దొప్ప కొరివి వీరభద్రం, బోయినపల్లి కోటేశ్వరరావు, షేక్ నజీర్, మాజీ సర్పంచులు కొమ్ము శంకర్, బంధం వెంకటరాజ్యం, సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సత్తుపల్లిలో మాచర్ల భారతిని గెలిపించాలి : సాయిబాబు

అర్థబలం, అంగ బలం, మంది మార్బలం, డబ్బున్న పార్టీలు ఒకవైపు, దేశం కోసం ప్రజల తరఫున నిరంతరం పోరాడే ఎర్రజెండా ఒకవైపున ఉన్నాయని, ఈ పరిస్థితులను ప్రజలు అర్థం చేసుకోవాలని సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు కోరారు. సత్తుపల్లి నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి మాచర్ల భారతి విజయాన్ని కాంక్షిస్తూ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. చట్టసభల్లో కమ్యూనిస్టులు లేకపోతే నష్టపోయేది ప్రజలేనని సూచించారు.. అభ్యర్థి మాచర్ల భారతి మాట్లాడుతూ..తనను గెలిపిస్తే అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడి పరిష్కారం చేస్తానని అన్నారు.

ఖమ్మంలో శ్రీకాంత్‌కి ఓటేసి గెలిపించాలి
రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని పిలుపు

ఖమ్మంలో నీతి నిజాయితీగా పరిపాలించిన ఘనత సీపీఐ(ఎం)దేనని, నిజాయితీగల సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థి యర్రా శ్రీకాంత్‌కి ప్రజలు స్వేచ్ఛందంగా ఓటేసి గెలిపించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. యర్రా శ్రీకాంత్ విజయాన్ని కాంక్షిస్తూ ఖమ్మం నగరంలో పార్టీ అధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. తొలుత ఎన్ఎస్‌పీ క్యాంప్ సుందరయ్య భవన్ నుంచి పాత బస్టాండ్, జెడ్పీ సెంటర్, ఇల్లందు క్రాస్ రోడ్ మీదుగా గట్టయ్య సెంటర్ తిరిగి సుందరయ్య భవన్ వరకు ర్యాలీ సాగింది.

చట్ట సభలో ప్రజల గొంతై నిలుస్తా

ఎర్రజెండా బిడ్డగా ఆదరించి.. అసెంబ్లీకి పంపండి

ఇబ్రహీంపట్నం సీపీఐ(ఎం) అభ్యర్థి పగడాల యాదయ్య



'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పేదల అణచివేతకు వ్యతిరేకంగా నియంత రాజరిక పాలనను తరిమికొట్టేందుకు పోరాటం చేసిన చరిత్ర ఇబ్రహీంపట్నం గడ్డకు ఉంది. ప్రస్తుతం కొనసాగుతున్న బీఆర్ఎస్ నియంత పాలనకు చరమగీతం పాడడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. పోరాటాల గడ్డపై ఎర్రజెండా ఎగరడం ఖాయం' అని సీపీఐ(ఎం) ఇబ్రహీంపట్నం అభ్యర్థి పగడాల యాదయ్య అన్నారు. ఎర్రజెండా బిడ్డగా తనను ఆదరించి అసెంబ్లీకి పంపించాలని కోరారు. చట్ట సభల్లో ప్రజల గొంతై నిలుస్తానని తెలిపారు. విద్య, వైద్య రంగాన్ని ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. 15 ఏండ్లు స్థానిక ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నాడని మండిపడ్డారు. పగడాల యాదయ్య మాటల్లోనే...

కమ్యూనిస్టు పాలనలో ఈ ప్రాంతం బాగుంది?

ఈ ప్రాంత ప్రజలకు ఎర్రజెండాతో వీడదీయలేని బంధం ఉంది. వేల ఎకరాలల్లో భూములు పంపిణీ చేసింది ఎర్రజెండా. మూడు ధపాలుగా ఈ ప్రాంతానికి కమ్యూనిస్టు ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహించారు. నిరుపేదలకు కమ్యూనిస్టులు ఇచ్చిన జాగాలు తప్పా ఇప్పటి వరకు ఒక గుంట జాగా ఇచ్చింది లేదు. ఈ ప్రాంతానికి కృష్ణ జలాలు తీసుకువచ్చి.. ఈ ప్రాంత ప్రజల గొంతు తడిపింది ఎర్రజెండా. దీని ఫలితంగా హైదరాబాద్‌లో తాగు నీటి సమస్య పరిష్కారమైంది.

ఈ ప్రాంత ఎమ్మెల్యే చేసింది ఏమీ లేదు ?

కమ్యూనిస్టులు పేదలకు పంపిణీ చేసిన మిగులు భూములు, సీలింగ్, అసైన్డ్ భూములను పరిశ్రమల పేరుతో పేదల నుంచి స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి లాక్కొని పెట్టుబడుదారులకు ధారాదత్తం చేస్తున్నారు. ల్యాండ్ పూలింగ్ పేరుతో పేదల నుంచి భూములు గుంజుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం మాయ మాటలతో కాలం వెళ్లదిస్తోంది. ఇక ఆ పార్టీకి కాలం చెల్లినట్టే.

మీరు గెలిస్తే ఏం చేస్తారు?

ఈ ప్రాంతంలో సెజ్‌ల పేరుతో ప్రభుత్వం నుంచి పరిశ్రమల కోసం తీసుకున్న వేల ఎకరాలు ఉన్నాయి. నిరూపయోగంగా ఉన్న ఆ భూములను పీవోటీ యాక్ట్ కింద ఆ భూములను తీసుకుని భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేస్తాం. ఫార్మాసిటీ భూబాధితులకు అందాల్సిన పరిహారం అందించేందుకు కృషి చేస్తా. ప్రతీ మండల కేంద్రంలో 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి, జూనియర్, డిగ్రీ కళశాలను ఏర్పాటు చేయిస్తా. కృష్ణ జలాలతో ఇబ్రహీంపట్నం బీడు భూములకు సాగు నీరు అందిస్తాం.

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి



చట్టసభల్లో కమ్యూనిస్టులు లేని లోటు

సీపీఐ(ఎం) అభ్యర్థి దశరథ్‌ను శాసనసభకు పంపించండి

ప్రజాసమస్యలపై నిత్యం పోరాడే వ్యక్తి.. : రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య

నవతెలంగాణ-ముషీరాబాద్

"చట్టసభల్లో కమ్యూనిస్టులు లేని లోటు స్పష్టం కనిపిస్తోంది.. ప్రజాసమస్యలపై నిత్యం పోరాడుతున్న సీపీఐ(ఎం) ముషీరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దశరథ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించి శాసనసభకు పంపించండి.. అక్కడ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు" అని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా ముషీరాబాద్ నియోజకవర్గంలోని దోమలగూడ చౌరస్తా నుంచి అన్నానగర్ చౌరస్తా వరకు పాదయాత్ర చేశారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య హాజరై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్ర శాసనసభలో కమ్యూనిస్టులు లేని లోటు కనిపిస్తున్నదన్నారు. చట్టసభల్లో కార్పొరేట్ల, పెట్టుబడిదారులకు ఉపయోగకరమైన చర్చలు.. లేదంటే ఒక పార్టీని ఇంకో పార్టీ తిట్టుకోవడం మాత్రమే జరుగుతోందన్నారు. కమ్యూనిస్టులు శాసనసభలో ఉంటే ప్రజా సమస్యల మీద చర్చ జరిగేందుకు పట్టుపడతారన్నారు. పేద ప్రజల సమస్యలపై పోరాడుతారని తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి దశరథ్‌ను శాసనసభకు పంపించాలని ఓటర్లను కోరారు. అనంతరం పాదయాత్ర భారీ జన సందోహంతో ముందుకు వెళ్లింది.

అన్నానగర్ వద్ద సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి.నర్సింహారావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం దోస్తీ స్పష్టంగా కనిపిస్తోందన్నారు. నగరంలో బీజేపీ అభ్యర్థులు గెలిస్తే మత కొట్లాటలు సృష్టిస్తారని చెప్పారు.

కమ్యూనిస్టులకు వేసే ప్రతి ఓటు ఎంతో విలువైనది అన్నారు. కామ్రేడ్ దశరథ్‌కు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అభ్యర్థి దశరథ్ మాట్లాడుతూ.. ముషీరాబాద్ నియోజకవర్గంలో బస్తీస్థాయిలో అణువణువూ ప్రజా సమస్యలు తెలిసిన వ్యక్తిని తానని, పోటీలో ఉన్న ఇతర పార్టీల అభ్యర్థులెవరూ ఏనాడూ నియోజకవర్గ సమస్యల మీద పోరాడిన చరిత్ర లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, నగర కార్య దర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, ఎం.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నా బలం.. బలగం.. ప్రజలే..

• అభివృద్ధి అంటేనే సిద్దిపేట • రోడ్ షోల్లో మంత్రి హరీశ్‌రావు

బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కు లేదు

నవ తెలంగాణ - సిద్దిపేట, చేగుంట

'నా కుటుంబం సిద్దిపేట అని, ప్రజలే నా కుటుంబ సభ్యులని, సిద్దిపేట ప్రజలే నా బలం.. నా బలగం..' అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. అభివృద్ధి అంటే సిద్దిపేట అని, ఎలాంటి అభివృద్ధి చేయని బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కు లేదని చెప్పారు. సిద్దిపేటతో పాటు చేగుంటలో మంగళవారం నిర్వహించిన రోడ్‌షోలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. ప్రతిసారి మెజార్టీ పెంచుతూ తనను గెలిపించారని, ఈ జన్మ మీకే అంకితం అని తెలిపారు. పార్టీ కోసం ప్రచారం చేయమని తనని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు నియోజకవర్గాలకు పంపించారని, తాను లేకున్నా మీరే ముందుండి గ్రామగ్రామాన నా తరపున ప్రచారం చేశారని, మీ ప్రేమ వెలకట్టలేనిదన్నారు. కేసీఆర్‌తోనే



తెలంగాణ సాధ్యమైందని, తెలంగాణ రావడంతోనే సిద్దిపేట జిల్లా అయిందని, రైలు వచ్చిందని, గోదావరి జిల్లాలు తెచ్చుకున్నామని చెప్పారు. తాగునీటికి గోసగా ఉన్న సిద్దిపేట జిల్లాకు, రెండు పంటలు పండే విధంగా సాగునీటిని తెచ్చుకున్నామన్నారు. ప్రతిపక్షాలు విమర్శలు చేస్తే మీ ఓటుతో గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. 60 ఏండ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రానికి ఒరగబెట్టింది ఏమీలేదన్నారు. కల్లబొల్లి మాటలు చెప్పి గెలిచిన దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యేకు బుద్ధి చెప్పాలన్నారు. అసైన్డ్ భూములున్న ప్రతి ఒక్క రైతుకు పట్టా హక్కులు కల్పించి, వారికి పూర్తి స్వతంత్రాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. పేదలకు అండగా ఉండేది గులాబీ జెండా.. కారు గుర్తు అని అన్నారు. ఈ నెల 30న జరిగే పోలింగ్‌లో ప్రజలందరూ పాల్గొని, పోలింగ్ శాతం పెంచాలని, దేశంలో మారుమోగే విధంగా మెజార్టీ తీసుకురావాలని తెలిపారు.

మా పోరాటాలతోనే సమగ్ర అభివృద్ధి

ఆశీర్వదించి.. అసెంబ్లీకి పంపండి

భువనగిరి సీపీఐ(ఎం) అభ్యర్థి కొండమడుగు నరసింహ



నిరుపేద ఇంటిలో పుట్టి కష్టనష్టాలకు ఓర్చి విద్యార్థి దశ నుండే రాజకీయాలలోకి వచ్చి ప్రజానాట్య మండలి, కులవివక్ష, వ్యవసాయ కార్మిక సంఘం వంటి ప్రజా సంఘాల్లో పని చేసిన కొండమడుగు నరసింహ సిపిఐ(ఎం) భువనగిరి నియోజకవర్గం అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. 35 సంవత్సరాలుగా ప్రజా ఉద్యమాల్లో పని చేస్తూ సుమారు 20 సంవత్సరాలుగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సీపీఐ(ఎం) పూర్తికాల కార్యకర్తగా పనిచేశారు. ప్రస్తుతం భువనగిరి జిల్లాలో పనిచేస్తున్నారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే భువనగిరి నియోజకవర్గంలో సాగు, తాగునీరు మూసి కాలుష్యం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విద్య, వైద్యం, ఆరోగ్యము, ఉపాధి అవకాశాలు జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం పాటుపడతానని తెలిపారు. సీపీఐ(ఎం) పోరాటాలతోనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని అన్నారు. సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న తనను ఆశీర్వదించి..గెలిపించి అసెంబ్లీకి పంపాలని ఆయన కోరారు. నవ తెలంగాణతో కొండమడుగు నరసింహ మాట్లాడుతూ..

నియోజకవర్గంలో గుర్తించిన సమస్యలు... ?

భువనగిరి నియోజకవర్గంలో పునాది గాని కాలువ పిలాయిపల్లి ధర్మారెడ్డి కాలువలు పూర్తి కాలేదు. వనపర్తికత్వలోకి గోదావరి జలాల కోసం బస్వాపురం రిజర్వాయర్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి భూనిర్వాసితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించలేదు మూసి జల కాలుష్యము, పరిశ్రమల వాయు కాలుష్యం, ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నాయి. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ, పీజీ, సాంకేతిక విద్యాలయాలు లేవు. కవులు కళాకారులకు సాంస్కృతిక భవనము, టౌన్ హాల్ లేదు. క్రీడాకారుల కోసం అవుట్‌డోర్ స్టేడియం ఏర్పాటు చేయాలి. మహిళల కోసం ప్రత్యేకమైన మహిళ వైద్యశాల, వారి ఉపాధి కోసం వృత్తి, విద్యా కేంద్రాలను ఏర్పాటు చేయాలి. సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైల్వే ప్రయాణికుల కోసం హాల్టింగ్ సమస్య ఉంది.

ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులకు మీకు ఉన్న తేడా?

బీఆర్ఎస్ అభ్యర్థి పైల శేఖర్ రెడ్డికి, కాంగ్రెస్ అభ్యర్థి కుంభం అనిల్ కుమార్ రెడ్డి కి కనీసం ప్రజా సమస్యలపైనా, నియోజకవర్గ సమస్యలపైనా అవగాహన లేదు. వ్యాపార సంబంధాలు తప్ప రాజకీయాల్లో ప్రజలతో ఎలాంటి సంబంధం లేదు. తాను 1992 నుండి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉన్నాను. కళాకారునిగా ఈ నియోజకవర్గంలో అక్షరాస్యత, చదువు వెలుగు కార్యక్రమంలో ప్రతి గ్రామంలో తిరిగి చైతన్యవంతం చేశాను.

నవతెలంగాణ-భువనగిరి

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

ఓబీసీ ఫెలోషిప్‌కు నిధుల్లేవ్

ఆందోళనలో ఎంఫిల్, పీహెచ్‌డీ స్కాలర్లు

మత రాజకీయాలను జనం నమ్మటంలేదు. ఇపుడు బీజేపీ ఓబీసీ అంశాన్ని తెరపైకి తెచ్చి లబ్దిపొందాలనుకుంటోంది. కానీ ఓబీసీ వర్గానికి చెందిన విద్యార్థులకు మాత్రం పైసలివ్వటంలేదు. నిధుల కొరతతో ఎంఫిల్, పీహెచ్‌డీ చేసే ఓబీసీ పరిశోధకులకు ఇచ్చే ఫెలోషిప్‌లు అందక.. ఉన్నత విద్యను అభ్యసించలేకపోతున్నారు.



'నిధుల కొరత'



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

అధికారంలోకి వచ్చినప్పటినుంచి మోడీ ప్రభుత్వం ఏదో ఒక కొత్త పథకాన్ని తెరపైకి తేవటమో లేక ఉన్న పథకాలకు పేర్లుమార్చటమో చేస్తోందన్నది జగమెరిగిన సత్యం. నిధుల కొరతతో ఎంఫిల్, పీహెచ్‌డీ చేసే ఓబీసీ పరిశోధకులకు ఇచ్చే ఫెలోషిప్‌లు బకాయిలు పేరుకుపోయాయి. దీంతో ఆ వర్గాల పరిశోధకులు ఆందోళన చెందుతున్నారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ 2014లో ఓబీసీకి ఎంఫిల్, పీహెచ్‌డీ స్కాలర్‌లకు సహాయం చేయడానికి స్కాలర్‌షిప్ పథకాన్ని ప్రారంభించింది. కానీ స్టైఫండ్‌లలో జాప్యం పెరుగుతోంది. మంత్రిత్వ శాఖకు ఫిర్యాదులు చేసినప్పటికీ సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యాయని స్కాలర్లు ఆరోపిస్తున్నారు. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) వెనుక బడిన తరగతులకు చెంది జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు అర్హత సాధించిన 1,000 మంది కొత్త స్కాలర్‌లకు జాతీయ ఫెలోషిప్ (ఎన్ఎఫ్ఓబీసీ) ఇస్తుంది. వీరిలో 75 శాతం మంది సామజిక శాస్త్రాల నేపథ్యం ఉన్నవారై ఉంటారు. మిగిలిన వారు సైన్స్ స్కాలర్లుగా ఉంటారు. ఈ పథకంలో ఇంటిగ్రేటెడ్ ఎంఫిల్, పీహెచ్‌డీ అభ్యసించే విద్యార్థులకు ఐదేండ్ల ఫెలోషిప్, ఇతర ప్రోగ్రామ్‌ల కోసం రెండేండ్ల ఫెలోషిప్ ఉంటుంది. స్టైఫండ్ నెలవారీగా యూజీసీ ప్రమాణాలకు సమానంగా ఉంటుంది. అయితే ఓబీసీ ఓట్లకు గాలం వేస్తున్న ప్రభుత్వ ఈ సంవత్సరం ఈ మొత్తాన్ని నెలకు రూ. 37,000కి పెంచింది. కానీ ఇవ్వటం లేదని, బకాయిలు పేరుకుపోతున్నాయని విద్యార్థులు పేర్కొంటున్నారు.

నోడల్ ఏజెన్సీ మార్పు తరువాత బకాయిలు

మొదట్లో ఎన్ఎఫ్ఓబీసీకి నోడల్ ఏజెన్సీగా యూజీసీ ఉండేది. అయితే జాతీయ వెనుకబడిన తరగతుల ఆర్థిక,అభివృద్ధి కార్పొరేషన్ (ఎన్‌బీసీఎఫ్‌డీసీ) లేదా మంత్రిత్వ శాఖ కింద పనిచేసే ఎన్‌బీసీఎఫ్‌డీసీ గత ఏడాది అక్టోబర్‌లో "సవరించిన విధానం" కింద బాధ్యతలు చేపట్టింది. ఈ మార్పు తరువాత బకాయిలు అధ్వాన్నంగా పెరిగాయని పరిశోధకులు అంటున్నారు.

వందకు పైగా వర్సిటీల్లో జాప్యం...

ఎన్ఎఫ్ఓబీసీ పథకం లబ్దిదారులు మంత్రిత్వ శాఖకు పదేపదే ఫిర్యాదు చేశారని జవహర్‌లాల్ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ స్కాలర్‌గా ఉన్న నయన్ ధావల్ నిర్వహించిన సర్వే తెలిపింది. 100కి పైగా విశ్వవిద్యాలయాలలోని 223 మంది స్కాలర్‌లలో దాదాపు 70 శాతం మంది జాప్యాన్ని ఎదుర్కొన్నారని పేర్కొంది. "ఇది యూజీసీ కింద ఉన్నప్పుడు ఒకటి-రెండు నెలల ఆలస్యం జరిగేది. కానీ అది పెండింగ్‌లో ఉన్న అన్ని బకాయిలతో క్లియర్ చేసేంది. ఎన్‌బీసీఎఫ్‌డీసీకి మార్చిన తరువాత నుండి పరిస్థితులు మరింత దిగజారాయి. ఐదు లేదా ఆరు నెలల తరువాత, మేం ఒక నెల మాత్రమే స్కాలర్‌షిప్ మొత్తాన్ని పొందుతాం" అని రాజస్థాన్‌లోని రాజ్ రిషి భర్తిహరి మత్స్య విశ్వవిద్యాలయం నుంచి పొలిటికల్ సైన్స్‌లో రీసెర్చ్ స్కాలర్ వెంకటేష్ యాదవ్ అన్నారు. ఆయన దాదాపు మూడు సంవత్సరాలుగా ఈ ఫెలోషిప్ లబ్దిదారుగా ఉన్నారు.

ఫెలోషిప్ విడుదలలో ఆల స్యం జరగ టానికి "నిధుల కొరత" కారణ మని ఎన్‌బీసీఎఫ్‌డీసీలోని ఒక అధికారి తెలిపారు. "ఈ పథకానికి ఏడాదికి కేటాయించిన మొత్తం నిధులలో 25 శాతానికి మించి ఒక విడతలో విడుదల చేయకూడదని ఆర్థిక మంత్రిత్వ శాఖ నియమం కలిగి ఉంది. కాబట్టి డిమాండ్ చాలా ఎక్కువగా ఉంది. కానీ మేం ఈ పథకం కింద ఒక సంవత్సరం మొత్తంలో కూడా ఈ 25 శాతాన్ని విడుదల చేయలేకపోయాం" అని అధికారి తెలిపారు. "మేం విద్యార్థుల నుంచి క్లెయిమ్‌లను స్వీకరించిన తరువాత, మేం మంత్రిత్వ శాఖకు డిమాండ్‌ను పంపుతాం. ఆ తరువాత మంత్రిత్వ శాఖ మాకు మూడు నెలలకు నిధులను పంపుతుంది" అని తెలిపారు.ఈ ఫెలోషిప్ కింద 2022-23లో రూ.51 కోట్లు, 2021-22లో రూ.55 కోట్లు, 2020-21 రూ.33 కోట్లు, 2019-20లో రూ. 52 కోట్లు ఖర్చు చేసినట్టు ఆగస్టులో కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ పార్లమెంటుకు తెలిపింది. ఈ ఏడాది 2023-24 మూడో త్రైమాసికం వరకు రూ.40.11 కోట్లు ఖర్చు చేసింది. ప్రస్తుతం 1,700 మంది ఈ ఫెలోషిప్ లబ్దిదారులు ప్రతి నెలా దాదాపు రూ.8 కోట్ల స్టైఫండ్‌లతో ఉన్నారని, ఈ మొత్తం అవసరం కంటే తక్కువగా ఉందని అధికారి పేర్కొన్నారు.

"మేం ఈ పథకం కోసం సవరించిన బడ్జెట్ అంచనాను మంత్రిత్వ శాఖకు పంపాం. దీనికి సంబంధించి సానుకూల స్పందన వచ్చింది" అని అధికారి తెలిపారు.

ఓట్లు కోసం ప్రధాని ఓబీసీ జపం: ఎస్ఎఫ్ఐ

ఓట్ల కోసమే ప్రధాని మోడీ ఓబీసీ జపం చేస్తున్నారని, కానీ వాస్తవానికి ఆ వర్గాల విద్యార్థులకు ద్రోహం చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూక్ బిశ్వాస్ విమర్శించారు. నిధుల కొరతతో ఎన్ఎఫ్ఓబీసీ ఫెలోషిప్‌లు విడుదలలో జాప్యంపై వారు స్పందించారు. ఓబీసీల పట్ల ప్రధాని మోడీ సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తున్నారని, ఆ వర్గాలకు నష్టం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఓట్ల కోసం ప్రధాని మోడీ ఓబీసీ జపం చేస్తున్నారే, కానీ విద్యార్థులకు ఫెలోషిప్‌లు విడుదల చేయటం లేదని దుయ్యబట్టారు.

ప్రధాని మోడీ విమానం కొనుగోలుకు రూ.12 వేల కోట్లు,షర్ట్ కోసం రూ.10 లక్షలు ఖర్చు చేశారని, ఓబీసీల స్కాలర్‌షిప్‌లను మాత్రం నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. ఇప్పుడు ఎంఫిల్, పీహెచ్‌డీ ఫెలోషిప్‌లు నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. వెనుకబడిన వర్గాలను నిర్లక్ష్యం చేయడం మనువాద ఆలోచనా విధానమని దుయ్యబట్టారు.

కేసు వెనక్కి తీసుకోలేదని...

గుజరాత్‌లో దళిత మహిళ హత్య



అహ్మదాబాద్ : అది మూడు సంవత్సరాల నుండి నడుస్తున్న కేసు. ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద నమోదైంది. కేసు పెట్టింది ఓ దళిత యువకుడు. కేసును వెనక్కి తీసుకోవాలంటూ అప్పటి నుండీ నిందితులు అతని కుటుంబాన్ని వేధిస్తున్నారు. అయితే వారు కేసును ఉపసంహరించుకోలేదు. దీంతో ఆగ్రహించిన దుండుగులు అతని తల్లిపై దాడి చేసి దారుణంగా హత్య చేశారు. శైలేష్ కోలీ, రోహల్ కోలీ, మరో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కలిసి 45 సంవత్సరాల మహిళ గీతాబెన్ మారూపై స్టీలు పైపులతో దాడి చేశారు. బీజేపీ ఏలుబడిలోని గుజరాత్‌లోని భావనగర్‌లో ఈ దారుణం జరిగింది. తీవ్రంగా గాయపడిన మారు సోమవారం చనిపోయారు. నలుగురు నిందితుల పైన హత్య దాడి, భయపెట్టడం వంటి ఆరోపణలపై కేసులు నమోదు చేశామని డీఎస్పీ ఆర్ఆర్.సింఘాల్ తెలిపారు. ఆస్పత్రిలో మారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని చెప్పారు. మహిళ మృతి నేపథ్యంలో ఆమె కుటుంబ సభ్యులు, దళిత నేతలు భావనగర్‌లోని సర్ తక్క్యాసింగ్‌జీ ఆస్పత్రి ఎదుట నిరసనకు దిగారు. నిందితులను అరెస్ట్ చేసే వరకూ మృతదేహాన్ని తీసుకోబోమని స్పష్టం చేశారు. ఎఫ్ఐఆర్ ప్రకారం దుండగుల దాడిలో మారు శరీరంపై పలు గాయాలు ఉన్నాయి. అనేక చోట్ల ఎముకలు విరిగాయి. మారు భర్తను, కుమార్తెను కూడా నిందితులు బెదిరించడంతో వారు భయంతో పారిపోయారు. ఈ ఘటనపై కాంగ్రెస్ ఎమ్మెల్యే జిగ్నేష్ మేవానీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించారు. అందులో ఆయన కేసు పూర్వాపరాలను వివరించారు. కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో గౌతమ్ మారు అనే యువకుడిపై సంఘ వ్యతిరేక శక్తులు దాడి చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు కోర్టు ముందుకు వచ్చింది. ఎలాగైనా తమకు శిక్ష తప్పదన్న భయంతో నిందితులు గౌతమ్ కుటుంబంపై ఒత్తిడి పెంచారు. కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అయితే అందుకు ఆ కుటుంబం నిరాకరించింది. కోర్టులో న్యాయం కోసం పోరాడతామని స్పష్టం చేసింది. దీంతో నిందితులు గౌతమ్ తల్లి గీతాబెన్‌పై దాడి చేశారు. ఆమెను భావనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. తీవ్ర గాయాలపాలైన ఆమె అక్కడ చనిపోయారు. రాజ్యాంగ దినోత్సవం రోజునే ఈ దాడి జరిగింది. రాష్ట్రంలో పోకిరీలు రెచ్చిపోతున్న తీరును ఈ ఘటన ఎండగట్టింది. సంఘ వ్యతిరేక శక్తులు ఇలా ఎలా పెట్రేగిపోతున్నారు? వారికి అంత ధైర్యం ఎలా వచ్చింది? దళితులు, అణగారిన వర్గాలు, దోపిడీకి గురవుతున్న వారి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటి మాదిరిగానే మూర్ఖంగా చూస్తూ ఉండిపోతోంది' అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలకు చట్టపరమైన రక్షణలు కల్పించాలి

- ప్రభుత్వాన్ని కోరిన పార్లమెంటరీ కమిటీ

న్యూఢిల్లీ : చికిత్స పొందుతూ రోగులు చనిపోయినపుడు వారి బంధువులు, అటెండెంట్ల నుండి దాడులను, హింసను ఎదుర్కొంటున్న ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలకు సముచితమైన రీతిలో చట్టపరమైన ఆరోగ్య రక్షణలను ప్రవేశపెట్టే విషయాన్ని ప్రభుత్వం పరిశీలించాలని బిజెపి సభ్యుడు బ్రిజ్‌లాల్ నేతృత్వంలో హోం వ్యవహారాలపై పార్లమెంటరీ స్థాయీ సంఘం కోరింది. ప్రతిపాదిత మూడు క్రిమినల్ చట్టాలను పరిశీలించిన, వివిధ వైద్య సమాఖ్యలు, సంఘాలు అందచేసిన మెమోరాండాలపై చర్చించిన ఈ స్థాయీ సంఘం ఆరోగ్య కార్యకర్తలకు చట్టపరమైన రక్షణలు కల్పించాలంటూ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఈ మేరకు కమిటీ తన నివేదికను అందచేసింది. ఆరోగ్య సేవలందించే సిబ్బందిపై హింసకు దిగడం వంటి చర్యలకు శిక్ష విధించేలా భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) లోని 115వ క్లాజు కింద నిబంధనలను ప్రవేశపెట్టాలని వివిధ వైద్య సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలపై ఇలాంటి హింసాత్మక దాడులు దేశమంతా జరుగుతునే వున్నాయి. ఈ నేపథ్యంలో కార్యకర్తల ప్రయోజనార్థం కొన్ని చట్టపరమైన రక్షణలు ఏర్పాటు చేయాల్సిన అవసరం వుందని వైద్య సమాఖ్యలు కమిటీని కోరాయి.

సాధారణ శిక్షార్హమైన నిబంధనలు అందరికీ వర్తిస్తాయని, అయితే ఏ ఒక్క వ్యక్తి లేదా వర్గానికి ప్రత్యేకంగా శిక్షా చట్టాల్లో ఎలాంటి భేదాలు లేవని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. చట్టం ముందు అందరూ సమానమేనని స్పష్టం చేసింది. డాక్టర్లు, మీడియా సిబ్బంది, న్యాయవాదులు, బ్యాంకర్లు, సిఎలు వంటి వారితో సహా పౌరులందరి జీవితాలను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొంది. డాక్టర్లు, ఇతర ఆరోగ్య సిబ్బందికి ప్రత్యేక నిబంధనలు రూపొందిస్తే ఇతర వర్గాల నుండి ఇదే రకమైన డిమాండ్లు రావచ్చని హెం శాఖ పేర్కొంది. అయితే హింసాత్మక దాడులను ఎదుర్కొనే ఆరోగ్య సంరక్షణ కార్యకర్తల కోసం కొన్ని రక్షణలు అందించేందుకు మెడికల్ ప్రొఫెషనల్స్ యాక్ట్‌ను ప్రవేశపెట్టాలని ఆరోగ్య శాఖ ఒక ప్రతిపాదన పెట్టిందని తెలిపింది. సిబ్బంది ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత ప్రభుత్వం ఆరోగ్య కార్యకర్తలకు కోసం తగు చట్టపరమైన రక్షణలు కల్పించగలదని ఆశిస్తున్నట్లు కమిటీ అభిప్రాయపడింది.

బీజేపీ నాయుకుని ఇంట్లో రూ.55లక్షలు పట్టివేత

- సొంత పార్టీ నాయకులే ఫిర్యాదు చేసినట్టు పుకార్లు

నవతెలంగాణ-హాజీపూర్

కిసాన్ మోర్చా మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మాధవరపు వెంకటరమణారావు ఇంట్లో సోమవారం రాత్రి రూ.55లక్షలను ఎన్నికల అధికారులు సీజ్ చేశారు. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం..హాజీపూర్ మండల కేంద్రంలోని రమణారావు ఇంట్లో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్, ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఎలాంటి ఆధారాలు లేని రూ.55లక్షలను గుర్తించి సీజ్ చేశారు. ఈ సోదాల్లో ఎఫ్ఎస్టీ సభ్యులు రాజన్న, ఎఎస్ఐ రాములు పాల్గొన్నారు. వారం రోజుల నుంచి బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌కు చెందిన కొందరు సర్పంచులను కొనుగోలు చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. వెంకటరమణరావు స్థానిక నాయకులను పట్టించుకోకుండా ఎమ్మెల్యే అభ్యర్థి నుంచి డబ్బులు తీసుకొచ్చి ఇష్టారీతిన కొనుగోలు కార్యక్రమాలు చేస్తున్నట్టు పుకార్లు వస్తున్నాయి. సదరు నాయకుడు పార్టీ సీనియర్లను పట్టించుకోకుండా ఒంటెద్దు పోకడలకు పోవడంతోనే సొంత పార్టీకి చెందిన వారే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినట్టు మండలంలో చర్చ జరుగుతోంది.

క్రీడలను రాజకీయం చేయవద్దు

- ఉపా కింద విద్యార్థులను అరెస్టును ఖండించిన తరిగామి

జమ్ము : క్రీడలను రాజకీయం చేయవద్దని సిపిఎం నాయకులు ఎంవై తరిగామి విజ్ఞప్తి చేశారు. ఉపా చట్టం కింద యూనివర్శిటీ విద్యార్థులను అరెస్టు చేయడాన్ని తరిగామి ప్రశ్నించారు. 'విద్యార్థుల అరెస్టు పూర్తిగా తప్పు. వారిపై ఉపా చట్టం కింద అభియోగాలు మోపడం మరింత అన్యాయం. క్రీడలను రాజకీయం చేయద్దు' అని తరిగామి అన్నారు. 'భారత క్రికెటర్లకు ఇతర దేశాల్లో ఎంత ఆదరణ ఉంటుందో, ఇతర దేశాల క్రికెటర్లకు కూడా భారత్‌లో అంతే ఆదరణ ఉంటుంది. రాజకీయాలను, క్రీడలను లింక్ చేయడం మంచిది కాదు' అని తెలిపారు. 'వారు (విద్యార్థులు) ఉగ్రవాదులా.. ప్రభుత్వానికి అభ్యంతరం ఉంటే ఇతర చట్టాలు ఉన్నాయి. విద్యార్థులపై ఉపా కింద కేసులు ఎందుకు నమోదు చేయాలి' అని తరిగామి ప్రశ్నించారు. ఈ సందర్భంలో న్యూస్‌క్లిక్ సంపాదకులు ప్రబీర్ పుర్కాయస్థ, హెచ్‌ఆర్ హెడ్ అమిత్ చక్రవర్తిలను ఉపా చట్టం కింద అరెస్టు చేయడాన్ని కూడా తరిగామి ఖండించారు. ఇటీవల జరిగిన ప్రపంచకప్ ఫైనల్‌లో భారత్ ఓటమితో సంబరాలు చేసుకున్నారని, అభ్యంతరకమైన నినాదాలు చేశారనే ఆరోపణలతో షేర్-ఎ-కాశ్మీర్ యూనివర్శిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ (ఎస్‌కెయుఎఎస్‌టి) విద్యార్థులను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. జమ్ముకాశ్మీర్‌లో అనేక సమస్యలు ఉన్నా ప్రజల దృష్టిని వాటి నుంచి మరల్చడానికి కేంద్ర ప్రభుత్వం విభజన రాజకీయాలకు పాల్పడుతుందని తరిగామి విమర్శించారు. రాష్ట్రంలో తీవ్రమైన విద్యుత్ సంక్షోభం నెలకుందని, అయినా ఈ సమస్యపై శీతకాలం ముందు ఎటువంటి ఏర్పాట్లు చేయలేదని విమర్శించారు.

జమ్మూలో సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో తరిగామి ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో రైతులు, కార్మికులు అంతులేని సమస్యలను ఎదుర్కొంటున్నారని తరిగామి ఆందోళన వ్యక్తం చేశారు. గత తొమ్మిదేళ్లలో ప్రభుత్వ రంగ బ్యాంకులు కార్పొరేట్లకు రూ. 15.32 లక్షల కోట్లు మాఫీ చేశాయని, అయితే రైతుల రుణాలను మాఫీ చేసేందుకు బిజెపి ప్రభుత్వం సిద్ధంగా లేదని తరిగామి విమర్శించారు.

పెరుగుతున్న వ్యక్తిగత రుణాలు





- ఆరేండ్లలో మూడు రెట్ల పెరుగుదల

న్యూఢిల్లీ : బ్యాంకులు, బ్యాంకింగ్ యేతర ఆర్థిక కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) నుండి ప్రజలు తీసుకుంటున్న వ్యక్తిగత రుణాలు ఇటీవలి కాలంలో బాగా పెరిగాయి. గత ఆరు సంవత్సరాల్లో ఈ రుణాలు దాదాపు మూడు రెట్లు పెరిగి ఈ సంవత్సరం మార్చి 31 నాటికి 51.7 ట్రిలియన్ రూపాయలకు చేరాయి. బ్యాంకులు అందిస్తున్న మొత్తం రుణాల్లో ఇవి 30.3%గా ఉన్నాయి. 2017 మార్చి 31న బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఇచ్చిన వ్యక్తిగత రుణాలు 18.6 ట్రిలియన్ రూపాయలు (మొత్తం రుణాల్లో 21.5%) మాత్రమేనని రేటింగ్ సంస్థ కేర్‌ఎడ్జ్ ఓ నివేదికలో తెలిపింది. వినియోగ రుణాలుగా పిలిచే వ్యక్తిగత రుణాల్లో వృద్ధి రేటు మిగిలిన బ్యాంకింగ్ రంగ రుణాల (వ్యాపార రుణాలు) కంటే దాదాపు రెట్టింపు ఉంది. 2017-2023 ఆర్థిక సంవత్సరాల మధ్యకాలంలో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఇచ్చిన మొత్తం రుణాల వృద్ధితో పోలిస్తే వ్యక్తిగత రుణాల వృద్ధి ఒకటిన్నర రెట్లు అధికంగా ఉంది. వ్యక్తిగత రుణాల్లో హామీ లేని రుణాలే అధికంగా ఉంటున్నాయి. మొత్తంగా తీసుకున్న వ్యక్తిగత రుణాల్లో హామీ లేకుండా పొందినవి ఒకటిన్నర రెట్లు అధికంగా ఉండడం గమనార్హం. ఎన్‌బీఎఫ్‌సీలు ఎలాంటి హామీలు పొందకుండా చిన్న మొత్తాల్లో రుణాలు అందించాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీలు ఇచ్చిన వ్యక్తిగత రుణాల్లో లక్ష రూపాయల కంటే తక్కువ మొత్తం ఇచ్చిన రుణాలు 85% ఉండడం విశేషం. యాభై వేల రూపాయల కంటే తక్కువ మొత్తంలో ఇచ్చిన అప్పులు కూడా అధికంగానే ఉన్నాయి. మొత్తం రుణాల విలువతో పోలిస్తే ఇవి రెండు రెట్లు ఎక్కువ. హామీ ఇవ్వకుండా వ్యక్తిగత రుణాలు తీసుకోవడానికి అనేక కారణాలు కన్పిస్తున్నాయి. కొనుగోలు శక్తి పెరగడం, ఇంటర్నెట్, బ్రాడ్‌బ్యాండ్, ఫీచర్ ఫోన్లు అందుబాటులో ఉండడం, డిజిటల్ చెల్లింపుల పద్ధతిని అనుసరించడం వంటివి కొన్ని కారణాలు.

వినియోగదారుల వ్యవహార శైలి కూడా ఓ కారణమే. వినియోగం పెరగడంతో వ్యక్తిగత రుణాలు తీసుకోవడం కూడా ఎక్కువవుతోంది. అయితే దీనివల్ల కుటుంబ అప్పులు కూడా పెరుగుతున్నాయి. కుటుంబాలు చేస్తున్న పొదుపుపై ఆర్‌బీఐ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం గత 47 సంవత్సరాల్లో ఎన్నడూ లేనంతగా పొదుపు తగ్గిపోయింది. గత ఆర్థిక సంవత్సరంలో కుటుంబ పొదుపు జీడీపీలో 5.1% మాత్రమే. వినియోగ డిమాండ్‌ను తీర్చుకోవడానికి ప్రజలు ఎక్కువగా అప్పులపై ఆధారపడడమే దీనికి కారణం. ముఖ్యంగా 2020-21 తర్వాత కుటుంబ పొదుపు బాగా పడిపోయింది. ఆదాయం తగినంత ఉన్నప్పుడు రుణాల పెరుగుదల గురించి పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేర్‌ఎడ్జ్ తెలిపింది. అయితే ఆదాయం సరిగా లేకపోయినా అప్పులు చేస్తుంటే రుణాల చెల్లింపులో సమస్యలు ఎదురవుతాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి హామీలు తీసుకోకుండా ఇచ్చే రుణాలకు సంబంధించి ఆర్‌బీఐ కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది.

కలెక్టర్లకు ఇడి సమన్లుపై మద్రాస్ హైకోర్టు స్టే

చెన్నై : అక్రమ ఇసుక తవ్వకాలకు సంబంధించి విచారణకు హాజరుకావాలని తమిళనాడులోని ఐదు జిల్లాల కలెక్టర్లుకు ఇడి సమన్లుపై మద్రాస్ హైకోర్టు మంగళవారం స్టే విధించింది. రాష్ట్రంలో అక్రమ ఇసుక తవ్వకాలపై మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి ఇడి విచారణ జరుపుతున్న సంగతి తెలిసిందే. ఈ విచారణలో భాగంగా అరియలూర్, వెల్లూరు, తంజావూరు, కరూర్, తిరుచిరాపల్లి కలెక్టర్లుకు ఇడి సమన్లు జారీ చేసింది. అయితే ఈ సమన్లకు వ్యతిరేకంగా రాష్ట్ర కార్యదర్శి కె.నంతకుమార్, ఐదుగురు కలెక్టర్లు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటీషన్‌ను మంగళవారం విచారించిన జస్టిస్ ఎస్ఎస్ సుందర్, జస్టిస్ సుందర్ మోహన్‌లతో కూడిన ధర్మాసనం మధ్యంతర స్టే ఇచ్చింది. ఈ పిటీషన్‌పై స్పందించేందుకు ఇడికి మూడు వారాల సమయం ఇచ్చింది. ఇలాంటి సమన్లు జారీ చేసే అధికార పరిధిలో ఇడి లేదని తాము ప్రాథమికంగా నమ్ముతున్నట్లు ధర్మాసనం తెలిపింది. అయితే రాష్ట్రంలో అక్రమ ఇసుక మైనింగ్‌పై ఇడి తన విచారణ కొనసాగించవచ్చునని ధర్మాసనం స్పష్టం చేసింది.

రూ. 400 కోట్లతో ఫుట్‌వేర్ పార్కు..

- 20వేల మందికి ఉద్యోగాలు: సీఎం స్టాలిన్

చెన్నై: రాష్ట్రంలో రూ.400 కోట్లతో పాదరక్షలు (ఫుట్‌వేర్) తయారీ పార్కును ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్టు తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ వెల్లడించారు. రాణిపేట్ జిల్లాలో సుమారు 250 ఎకరాల స్థలంలో ఈ పార్కును నిర్మించనున్నట్టు చెప్పారు. ఈ పారిశ్రామిక ప్రాజెక్టుతో 20వేల కొత్త ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. పెరంబలూరు జిల్లా ఎరైయూర్‌లో జేఆర్ వన్ ఫుట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.400 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన పాదరక్షల తయారీ కేంద్రాన్ని సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ.. గత రెండేళ్లలో ప్రభుత్వం లెదర్, పాదరక్షల పరిశ్రమలలో అనేక ప్రాజెక్టులను తీసుకువచ్చిందని చెప్పారు. 2022లో పాదరక్షలు, తోలు ఉత్పత్తుల పాలసీని విడుదల చేసిన తర్వాత ఈ రంగాలలో మంచి మార్పు కనిపిస్తోందన్నారు. వెనుకబడిన జిల్లాల్లో పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ఫలితాలు కనబడుతున్నాయన్నారు. ఎరైయూర్‌లోని పరిశ్రమ ద్వారా పెరంబలూరు, పొరుగు జిల్లాల్లోని ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు ఉపాధి కలుగుతుందని చెప్పారు.

'ఉక్కు'పై కుట్రలను తిప్పికొడతాం

- పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం (విశాఖపట్నం) : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయడానికి జరుగుతున్న కుట్రలను ఐక్యపోరాటాలతో తిప్పికొడతామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1020వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ సింటర్ ప్లాంట్ కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రధాన విభాగాల్లో ఉత్పత్తిని గణనీయంగా తగ్గించడం ద్వారా ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టడం, కార్మికులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను నెరవేర్చకపోవడం వంటి చర్యలతో ఉక్కు యాజమాన్యం కుట్రలు పన్నుతోందని విమర్శించారు.

గాజాలో కాల్పుల విరమణ మరో 48గంటలు పొడిగింపు

- 60శాతానికి పైగా ఇళ్ళు ధ్వంసం
- రోజుకు 16లక్షల డాలర్లు నష్టం

గాజా : గాజాలో గత నాలుగు రోజులుగా అమలవుతున్న కాల్పుల విరమణను మరో 48గంటలు పొడిగించారు. ఇరు పక్షాలు ఇందుకు అంగీకరించాయని మధ్యవర్తి ఖతార్ తెలిపింది. దీంతో ఇరు పక్షాల అధీనంలో వున్న బందీలు మరింత మంది విడుదలవుతారనే ఆశలు నెలకొన్నాయి. మరోవైపు కాల్పుల విరమణ మరింతగా పొడిగించే అవకాశాలు వుండవచ్చనే అంచనాలు, ఆశలు కూడా పెరిగాయి. దీనివల్ల గాజాలోకి మరింతగా మానవతా సాయం అందుతుంది. కాగా, నాల్గవ రోజు బందీల మార్పిడిలో భాగంగా 33మంది పాలస్తీనియన్ ఖైదీలు ఇజ్రాయిల్ జైళ్ళ నుండి విడుదలయ్యారు. వారు మంగళవారం తెల్లవారు జాముకు తూర్పు జెరూసలేం, వెస్ట్ బ్యాంక్ పట్టణమైన రమల్లాకు చేరుకున్నారు. మరోవైపు హమస్ విడుదల చేసిన 11మంది ఇజ్రాయిలీ మహిళలు, పిల్లలు సోమవారం రాత్రికి ఇజ్రాయిల్‌లోకి ప్రవేశించారు. వీరిని తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్లు రెడ్ క్రాస్ తెలిపింది.

ఏది ఏమైనా హమస్ సైనిక సామర్ధ్యాలను అణచివేయడానికే తాము కట్టుబడి వున్నట్లు ఇజ్రాయిల్ మరోసారి ప్రకటించింది. గాజాలో 16ఏళ్ల హమస్ పాలనకు ముగింపు పలుకుతామని చెప్పింది. కాగా ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిల్ సైనికులు ఇద్దరు పాలస్తీనియన్లను చంపేశారు. ఇప్పటివరకు గాజాలో 15వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. తూర్పు జెరూసలేంతో సహా వెస్ట్ బ్యాంక్‌లో ఇప్పటివరకు 231మంది పాలస్తీనియన్లు మరణించారని ఐక్యరాజ్య సమితి మానవతా కార్యకలాపాల సహాయ కార్యాలయం (ఒసిహెచ్ఎ) వెల్లడించింది.


కాల్పుల విరమణ జరగడంతో గాజాలో చోటు చేసుకున్న విధ్వంసాన్ని అంచనా వేసేందుకు అవకాశం కలుగుతోంది. ఈ నేపథ్యంలోనే అక్కడి పరిస్థితులకు సంబంధించిన వివరాలు వెల్లడవుతున్నాయి. గాజాలో ఆరోగ్య వ్యవస్థను తక్షణమే పునరుద్ధరించని పక్షంలో మరింతమంది మరణించే అవకాశముందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. అల్‌షిఫా అస్పత్రిలో డయాలసిస్ యూనిట్‌ను పునరుద్దరించారని, రోగులను కూడా చేర్చుకుంటున్నామని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. గాజాలో సుదీర్ఘకాలం కాల్పుల విరమణ ఆమలు చేయాలని, మొత్తంగా బందీలందరినీ విడుదల చేయాలని యుఎన్ చీఫ్ కోరారు.

గాజా వ్యాప్తంగా 60శాతానికి పైగా ఇళ్ళు ధ్వంసమయ్యాయని ఐక్యరాజ్య సమితి తన కొత్త నివేదికలో తెలిపింది. ఇజ్రాయిల్ బాంబు దాడుల కారణంగా మొత్తంగా ఉత్పత్తి స్తంభించిపోయిందని ఫలితంగా రోజుకు 16లక్షల డాలర్లు నష్టం జరిగిందని పాలస్తీనా కేంద్ర గణాంకాల బ్యూరో వెల్లడించింది. వ్యవసాయ పరికరాలు, వేలాదిగా వృక్షాలు, పొలాల విధ్వంసాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే ఈ నష్టాలు ఇంకా ఎక్కువగానే వుంటాయని బ్యూరో తెలిపింది.

ప్రజారోగ్య బిల్లుపై ఆరిఫ్ ఖాన్ సంతకం

విచారణకు ఒక రోజు ముందు..

- రాష్ట్రపతి ఆమోదానికి మరో 7 బిల్లులు



తిరువనంతపురం: తనపై సుప్రీంకోర్టులో విచారణకు ఒక రోజు ముందు ప్రజారోగ్య బిల్లుపై కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ సంతకం చేశారు. మరో ఏడు బిల్లులు రాష్ట్రపతి ఆమోదం కోసం పంపారు. లోకాయుక్త చట్టం సవరణ, యూనివర్సిటీ చట్టం సవరణ, సహకార చట్టం సవరణ వంటి బిల్లులను రాష్ట్రపతికి పంపారు. శాసనసభ ఆమోదించిన బిల్లులను సుదీర్ఘకాలం గవర్నర్ పెండింగ్‌లో పెట్టుకోవడాన్ని వ్యతిరేకిస్తూ కేరళ ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం విచారించనుంది. శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నర్లు నిరవధికంగా నిలుపుదల చేయడాన్ని సుప్రీంకోర్టు ఇటీవల విమర్శించింది. పంజాబ్ గవర్నర్‌ను విమర్శిస్తూ ఇచ్చిన తీర్పును కేరళ గవర్నర్ చదివితే బాగుంటుందని కోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలోనే తమ వద్ద నిలిపివుంచిన ఎనిమిది బిల్లుల్లో ఏడు బిల్లులను రాష్ట్రపతి ఆమోదం కోసం పంపాలని గవర్నర్ నిర్ణయం తీసుకున్నారు. లోకాయుక్త సవరణ బిల్లు, గవర్నర్‌ను ఛాన్సలర్ పదవి నుంచి తొలగించేందుకు యూనివర్సిటీల చట్టంలో రెండు సవరణలు, వైస్‌ఛాన్సలర్ నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీ బిల్లు, యూనివర్సిటీ అప్పీలేట్ అథారిటీ బిల్లు, సహకార చట్ట సవరణ బిల్లు రాష్ట్రపతికి పంపారు. ఈ విషయాన్ని సుప్రీంకోర్టుకు తెలియజేయాలని రాజ్ భవన్ నిర్ణయించింది. కేరళ ప్రజారోగ్య బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలిపారు. ప్రజారోగ్య బిల్లును ఈ ఏడాది మార్చిలో విజయన్ ఆమోదించి, ఏప్రిల్‌లో గవర్నర్ ఆమోదం కోసం పంపారు.